

ఫెన్సింగ్ కోసం డ్రిల్లింగ్ వేస్తున్న హైడ్రా సిబ్బంది..

పెన్ పవర్
తెలంగాణ రౌండప్

# శభాష్ హైడ్రా..!

- డి.పోచంపల్లి సర్వే నెం.120లో హైడ్రా ఫెన్సింగ్..!
- రూ.80 కోట్లు విలువైన ప్రభుత్వ భూమికి హైడ్రా రక్షణ..

- 120లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలకు ఫెన్సింగ్ పనులు ప్రారంభం..
- గతేడాది ఓ ఇద్దరు 'గైరాన్ సర్కారీ' భూమిలో అక్రమ కట్టడాల నిర్ధారణ..
- దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో 23.05.2025 ఎఫ్ఐఆర్ నెం.514/2025 నమోదు..
- ఎవిక్షన్ ప్రొసీడింగ్స్- అసైన్డ్ ల్యాండ్ స్వాధీన ప్రక్రియ ప్రారంభించారు..
- 2025 మే 23న దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో కబ్జాదారులపై కేసునమోదు..
- 2025 'అక్టోబర్ 7న' హైడ్రాకు లేఖ రాసిన అప్పటి తహాశీల్దార్ మతీన్..
- హైడ్రా కమిషనర్ ఆదేశాలతో గురువారం 08-16 ఎకరాలకు ఫెన్సింగ్ ఏర్పాటు..
- దొమ్మర పోచంపల్లి గ్రామంలో రెండు సర్వే నెంబర్‌లలో మూడు చోట్ల ఫెన్సింగ్..
- బాధితులు దుండిగల్ తహాశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన..

ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు మేల్కోవాలి.. కేవలం రెవెన్యూ అధికారుల, నిర్లక్ష్యంతోనే.. బాధితులు రోడ్డున పడ్డారు అనడంలో అతిశయోక్తి కాదు.. ప్రభుత్వ భూముల్లో ఎప్పటికప్పుడు కబ్జాలపై చర్యలు తీసుకుని, భూ కబ్జాదారులపై కేసులు నమోదు చేస్తే పరిస్థితి ఇంతవరకు వచ్చేదా..? ఎవరైనా ప్లాట్లు కొనుగోలు చేయాలన్నా కూడా ఆలోచించే వారు కదా..! "చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే" ప్రయోజనం ఏముంది..? ప్లాట్లు విక్రయించిన కబ్జాదారులు బాగానే ఉన్నారు.. వాళ్ళకు సహకరించిన రెవెన్యూ అధికారులు బాగానే ఉన్నారు.. చివరికి బాధితులే రోడ్డున పడ్డారు.. సర్వే నెం.120లో ఉన్న ప్రభుత్వ భూమి మొత్తం సబ్ డివిజన్‌లతో సహా నిర్మాణాలు, రిజిస్ట్రేషన్‌లు, నిషేధించిన ప్రభుత్వం "22-ఎ నిషేధిత" జాబితాలో పెట్టిన విషయం రెవెన్యూ అధికారులకు తెలియదా..? భూ రికార్డులు తమవద్దనే ఉండి, చట్టం తెలిసిన అధికారులే ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే..! ఏమి తెలియని అమాయక బాధితులు మోసపోకుండా ఎలా ఉంటారు..? అధికారులు, సమర్ధించు కోవడానికి సవాలక్ష సమాధానాలు చెప్పవచ్చు.. రోడ్డున పడిన ఈ బాధితులకు ఇప్పుడు ఎవరు సమాధానం చెబుతారు..? కనీసం ఇప్పటికైనా అధికారుల తీరును మార్చుకోవాలని పలువురు సూచిస్తున్నారు.. మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఏప్రిల్ 23:



సర్వే నెం.120లో ఓవైపు చదును చేస్తున జేసిబి..

-4లో

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## కాళేశ్వరంపై సీఎం ఆధ్వర్యంలో సీబీఐ డైరెక్టర్‌ను కలుస్తాం




**హైదరాబాద్ పెన్ పవర్:** కాళేశ్వరం ప్రాజెక్టు విచారణపై త్వరలో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో సీబీఐ డైరెక్టర్ ను కలుస్తామని చెప్పారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి. విచారణ జరపాలని స్వయంగా కోరుతామని తెలిపారు. 9 నెలలు గడిచినా సీబీఐ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. 2026 ఏప్రిల్ 23న జరిగిన కేబినెట్ సమావేశంలో కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై చర్చించినట్లు తెలిపారు. కాళేశ్వరం కూలిపోవడానికి వీళ్లు కారణం కాదని హైకోర్టు చెప్పలేదన్నారు మంత్రి. కమిషన్ ఏర్పాటును హైకోర్టు ఎక్కడా తప్పుపట్టలేదన్నారు. కమిషన్ ఏర్పాటు రాజ్యాంగ విరుద్ధం కాదని హైకోర్టు చెప్పినట్లు గుర్తు చేశారు. రిపోర్టు ఆధారంగా వీళ్లపై చర్యలు తీసుకోవద్దని మాత్రమే కోర్టు చెప్పిందని తెలిపారు. బీఆర్ఎస్ ఎందుకు సంబరాలు చేసుకుంటుందో అర్థం కావడం లేదని విస్మయం వ్యక్తం చేశారు ఉత్తమ్. చిన్న విషయాన్ని కూడా తెలుసుకోకుండా సంబరాలా అని ప్రశ్నించారు. లీగల్ ఎక్స్ పర్ట్స్ తో భేటీ అయ్యాక తదుపరి చర్యలుంటాయన్నారు. కమిషన్ రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకోమని ముందే చెప్పినట్లు గుర్తు చేశారు.

## ఇంజినీరింగ్ పరిశోధక స్థానంగా తెలంగాణ




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణను కేవలం తయారీ కేంద్రంగా మాత్రమే కాకుండా ప్రపంచస్థాయి ఇంజినీరింగ్ పరిశోధన స్థానంగా తీర్చిదిద్దేలా ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. 'మేడ్ ఇన్ తెలంగాణ' బ్రాండ్ మరింత విశ్వవ్యాప్తమయ్యేలా ఇంజినీరింగ్ పరిశ్రమల కోసం ప్రత్యేకంగా ఇండస్ట్రియల్ పార్కులను అభివృద్ధి చేస్తామన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు మండలం తునికిబొల్లారం ఇండస్ట్రియల్ పార్కులోని 'ఆజాద్-సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్'లో అమెరికన్

-4లో

# శభాష్ హైడ్రా..!



ఫెన్సింగ్ పోల్‌లకు సిమెంట్ కాంక్రీట్ వాహనం.




## హైకోర్టు ఉత్తర్వులు ధిక్కరించి.. మళ్ళీ నిర్మాణాలు..

సర్వే నెంబర్ 120/1 "గైరాన్ సర్కారీ" భూమిలో, రెవెన్యూ అధికారుల కూల్చివేతల అనంతరం, ఆక్రమణ దారులు హైకోర్టును ఆశ్రయించారు.. దీంతో వివాదం తేలేవరకు యధాస్థితిని కొనసాగించాలనే హైకోర్టు ఉత్తర్వులు ధిక్కరించి 6 నిర్మాణాలు మళ్ళీ నిర్మాణం చేస్తుండగా.. అప్పటి దుండిగల్ తహశీల్దార్ మతీన్ ఫిర్యాదుతో, ఆ ఇద్దరు ఆక్రమణ దారులపై దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నెం.514/2025 (తేదీ: 23.05.2025) నమోదు అయింది.. దీంతో ఏడాది క్రితమే "ఎవిక్షన్ ప్రొసీడింగ్స్, అసైన్డ్ ల్యాండ్ స్వాధీన ప్రక్రియలు ప్రారంభమైనట్లు తెలుస్తోంది.. తహసీల్దార్ ఈ లేఖలో జిల్లా కలెక్టర్‌కు కూడా లేఖ రాసినట్టు పేర్కొంటూ, సేల్ డీడ్స్ (డాక్యుమెంట్ నెం.13967, 13998, 13996, 13991/2021)లను రద్దు చేయాలని అభ్యర్థించారు. భూమిని రక్షించడానికి తగిన చర్యలు తీసుకోవాలని హైడ్రాకు తహశీల్దార్ రాసిన లేఖతో గురువారం సుమారు రూ.80 కోట్లు విలువైన ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది..



సర్వే నెం.120 గైరాన్ సర్కారీ భూమిలో అక్రమంగా నిర్మించిన అక్రమ నిర్మాణాలు..



దుండిగల్ తహశీల్దార్ కార్యాలయం ముందు బాధితులు.

## దుండిగల్ ఎమ్మార్వో ఆఫీస్ వద్ద నిరసన..

దొమ్మర పోచంపల్లి సర్వే నెం.120 ప్రభుత్వ భూమిలో ఖాళీగా ఉన్న 8-16 ఎకరాలు హైడ్రా ఫెన్సింగ్ పనులు ప్రారంభించారు.. దీంతో బాధితులు లబోదిబో మంటూ ఆవేదన చెందారు.. ప్లాట్‌లు విక్రయించిన వారు ఇప్పుడు ఫోన్‌లకు స్పందించడం లేదంటూ కన్నీరు పెట్టుకున్నారు.. బాధితులు అందరూ దుండిగల్ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని,తమకు న్యాయం చేయమని నిరసనకు దిగారు.. పరిస్థితిని గమనించిన రెవెన్యూ అధికారులు, ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు సమాచారం.. తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళనకు దిగిన బాధితులు, తాము ఎనిమిదేళ్ళ క్రితం, ప్లాట్‌లు కొనుగోలు చేసి నిర్మించుకున్న ఇండ్లకు, ఇంటి పన్నులు కూడా చెల్లిస్తున్నట్టు బాధితులు తెలిపారు..

## ఆ ఇద్దరి కబ్జాలే..! బాధితులను రోడ్డున పడేశాయా..?

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, గండిమైసమ్మ-దుండిగల్ మండలం, దొమ్మరపోచంపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 120/1లోని ప్రభుత్వ భూమిని, ఇద్దరు అన్నదమ్ములు అక్రమంగా ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంతో, అప్పటి దుండిగల్ తహసీల్దార్ ఎస్.ఏ.మతీన్, 2025 అక్టోబర్ 7న హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ కమిషనర్‌కు లేఖ రాశారు.. ఈ లేఖలో (Lr.No.B/508/2025, తేదీ: 07-10-2025) తహశీల్దార్ వివరాలు ఇలా ఉన్నాయి.. డి.పోచంపల్లి సర్వే నెంబర్ 120/1లోని భూమి "గైరాన్ సర్కారీ"గా, వర్గీకరించారు.. అందులో కొంత భాగం భూమి లేనివారికి, మాజీ సైనికులు, స్వాతంత్ర్య సమరయోధులు, మొదలైనవారికి, ప్రభుత్వం అసైన్ చేసింది.. అయినప్పటికీ, యెల్లారెడ్డి, ఏ.రామ్‌రెడ్డిలు, సంబంధిత స్థలాన్ని నిబంధనలకు విరుద్ధంగా, కబ్జాచేసి నిర్మించిన 6 ఇండ్లను, 15.04.2025న ఫీల్డ్ సిబ్బంది కూల్చివేసినట్టు లేఖలో వివరించారు..

- 3 పేజి తరువాయి

మేడ్చల్ జిల్లా గండిమైసమ్మ-దుండిగల్ మండలం, దొమ్మర పోచంపల్లి గ్రామ సర్వే నెం.120లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో హైడ్రా అధికారులు గురువారం ఫెన్సింగ్ వేసి కాపాడారు.. సుమారు రూ.80 కోట్లు విలువైన ప్రభుత్వ భూమిని కాపాడినట్లు అధికారులు పేర్కొన్నారు.. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. గురువారం దుండిగల్-గండిమైసమ్మ మండల పరిధిలోని సర్వే నంబర్.120/1లోని 05-10 ఎకరాలు.. సర్వే నంబర్.120/28 లో 03-06 ఎకరాల భూమిని హైడ్రా అధికారులు స్వాధీన పరచుకుని చుట్టూ పెన్సింగ్ ఏర్పాటు చేశారు.. మరోవైపు ఈ హైడ్రా చర్యలతో బాధితులు రోడ్డున పడ్డారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. సొంతింటి కల నెరవేర్చు కోవడానికి, ఎదురు చూసే అమాయకులను, టార్గెట్ చేస్తూ..!సొమ్ము చేసుకున్న, బూ కబ్జాదారుల నుండి బాధితులకు ం

ఇప్పుడు డబ్బులు ఇప్పించగలా..? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. హైడ్రా ఫెన్సింగ్ చేస్తుండగా తాము కొనుగోలు చేసుకున్న స్థలానికి ఫెన్సింగ్ వేస్తున్నారని.. బాధితులు అయోమయంలో పడ్డారు.. తాము లక్షలు వెచ్చించి కొనుగోలు చేశామని, ఇలా రోడ్డున పడతామని ఊహించలేదని బాధితులు కంటతడి పెట్టారు..

## ఇంజినీరింగ్ పరిశోధక స్థానంగా తెలంగాణ

- 3 పేజి తరువాయి

కంపెనీ 'బేకర్ హ్యూస్' యూనిట్‌ను మంత్రి గురువారం ప్రారంభించి మాట్లాడారు. "రూ.200 కోట్ల పెట్టుబడులతో బేకర్ హ్యూస్ లాంటి అంతర్జాతీయ దిగ్గజ సంస్థ 'మేక్ ఇన్ ఇండియా' ప్రాజెక్టు కోసం రాష్ట్రాన్ని ఎంచుకోవడం తెలంగాణ పారిశ్రామిక ప్రగతికి నిదర్శనం. ప్రైవేట్ రంగంలోనూ రక్షణ సంబంధిత ఇంజినీరింగ్ పరిశ్రమలకు రాష్ట్రం గమ్యస్థానంగా మారింది. 1,500కు పైగా సూక్ష్మ, చిన్నతరహా, మధ్యతరహా సంస్థల ఎంటర్‌ప్రైజెస్‌ల (ఎంఎస్‌ఎంఈ)తో ఉత్పత్తుల తయారీలో రాష్ట్రం గ్లోబల్ హబ్‌గా ఎదుగుతోంది. పెట్టుబడులతో ముందుకొచ్చే పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తాం" అని తెలిపారు. ఆజాద్ ఇంజినీరింగ్ ఛైర్మన్, సీఈఓ రాకేశ్ చోప్దార్, టీజీఐఐసీ ఎండీ శశాంక, బేకర్ హ్యూస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి రాహుల్ గాంధీకి వివరించా: పీసీసీ చీఫ్


హైదరాబాద్ పెన్ పవర్:రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాల గురించి రాహుల్ గాంధీకి వివరించినట్లు చెప్పారు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్. 2026 ఏప్రిల్ 23న ఢిల్లీలోని 10 జన్ పథ్ లో రాహుల్ గాంధీతో సమావేశం అయిన మహేష్? కుమార్ గౌడ్.. రాష్ట్రంలో జరుగుతున్న తాజా పరిణామాలపై చర్చించారు. రాష్ట్రంలో కుల గణన జరిపి సమగ్ర అధికారిక సమాచారాన్ని ప్రకటించినట్లు ఈ సందర్భంగా రాహుల్ గాంధీ కి వివరించారు.

దాదాపు15 నిమిషాల పాటు జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి రాహుల్ గాంధీకి టీపీసీసీ వివరించారు. రాష్ట్రంలో పార్టీ పరంగా జరుగుతున్న ఆర్గనైజేషన్ కార్యక్రమాలను స్పష్టంగా వివరించారు. డీసీసీ అధ్యక్షుల నియామకాలు, జిల్లా కమిటీలు, మండల కమిటీలు, బీఎల్ఏల నియామకాలు, అనుబంధ సంఘాల నియామకాలు తదితర అంశాలపై సమావేశంలో రాహుల్ గాంధీకి వివరించారు. ఏఐసీసీ జాతీయ ఓబీసీ సలహా మండలి సమావేశాన్ని హైదరాబాద్?లో నిర్వహించేలా చూడాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని కోరారు టీపీసీసీ చీఫ్?





మహేష్? కుమార్ గౌడ్. అదే విధంగా మహిళా రిజర్వేషన్ల బిల్లులో బీసీ రిజర్వేషన్ల అంశాన్ని జోడించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. తమ విజ్ఞప్తులపై రాహుల్ సానుకూలంగా స్పందించినట్లు మహేష్? కుమార్ గౌడ్ తెలిపారు.




# ఆర్టీసీ ని ప్రయివేట్ పరం చేసేందుకు ప్రభుత్వం కుట్రలు...
# బి ఆర్ ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్

**హైదరాబాద్ పెన్ పవర్:**
ఆర్టీసీ ని ప్రయివేట్ పరం చేసేందుకు ప్రభుత్వం కుట్రలు పన్నుతుందని బి ఆర్ ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. గురువారం నాడు రాణిగంజ్ డిపో వద్ద ఆర్టీసీ ఉద్యోగులదధర్నాలో అయన పాల్గొని సమ్మెకు మద్దతు ప్రకటించారు. తలసాని మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో లో పెట్టిన హామీలనే ఆర్టీసీ ఉద్యోగులు అమలు చేయాలని కోరుతున్నారు. సురక్షితమైన ప్రయాణానికి ఆర్టీసీకి ప్రత్యేక గుర్తింపు ఉంది. 92సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన ఆర్టీసీ మనుగడకు ప్రభుత్వం ముప్పు తలపెడుతుంది. ఆర్టీసీ అభివృద్ధిలో ఉద్యోగుల శ్రమ, కృషి వెలకట్టలేనిది. ఎలెక్ట్రికల్ బస్సులను తీసుకొచ్చి ఆర్టీసీ ఉద్యోగులను రోడ్డున పడేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తుందని అన్నారు.ఎలెక్ట్రికల్ బస్సులు ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లతోనే నడపాలి. డిమాండ్ లు అమలయ్యే వరకు ఆర్టీసీ ఉద్యోగులకు బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుంది. బి ఆర్ ఎస్ నేతల ప్రోద్భలంతో నే ఆర్టీసీ ఉద్యోగులు సమ్మె చేస్తున్నారని మంత్రులు మాట్లాడుతున్నారు.. సిగ్గుండాలి అలా మాట్లాడటానికి. ఎవడబ్బ జాగీరు అని డిపోలను ప్రయివేట్ సంస్థలకు ధారాదత్తం చేస్తారు. తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ ఉద్యోగుల పాత్ర ఎంతో గొప్పది. ఆర్టీసీ ఉద్యోగుల డిమాండ్ లు న్యాయమైనవి ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని అన్నారు.



## అందుబాటులోకి రానున్నఈ డ్రోన్...

**హైదరాబాద్, ఏప్రిల్ 23, పెన్ పవర్:**
హైదరాబాద్‌లో డ్రోన్ల ద్వారా ఈ-కామర్స్ వస్తువులను డెలివరీ చేసేందుకు స్కై ఎయిర్ సంస్థ చర్యలు చేపట్టింది. వచ్చే ఏడాది నుంచి నగరంలో డ్రోన్ల ద్వారా వస్తువులను చేరవేయనుంది. ఇప్పటికే దేశంలోని పలు నగరాల్లో చేపట్టిన ఈ డ్రోన్ డెలివరీలు సక్సెస్ కావడంతో.. మిగిలిన నగరాలకు కూడా విస్తరిస్తోంది. దీనికి సంబంధించి తెలంగాణ సర్కార్‌తో కలిసి పనిచేయనుంది. హైదరాబాద్‌లో నిత్యం 3.75 లక్షల డెలివరీలు చేయాలని ఆ సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.ప్రస్తుతం హైదరాబాద్ లాంటి నగరాల్లో ఏ వస్తువు కావాలన్నా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఈ-కామర్స్ వెబ్‌సైట్‌లలో బుక్ చేసుకుంటున్నారు. ఇక జెప్టో, బిగ్‌బాస్కెట్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ వంటి క్విక్ కామర్స్ కంపెనీలు 10 నిమిషాల్లోనే ఇంటి వద్దకు డోర్ డెలివరీ చేస్తున్నాయి. ఇందుకోసం నిత్యం వేల మంది గిగ్ వర్కర్లు ఈ ఈ-కామర్స్ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. అయితే ఇప్పుడు ఈ ఈ-కామర్స్ వస్తువుల డెలివరీకి డ్రోన్లు రంగంలోకి దిగనున్నాయి. హైదరాబాద్ నగరంలో వచ్చే ఏడాది నుంచి స్కై ఎయిర్ అనే సంస్థ డ్రోన్ల ద్వారా ఈ-కామర్స్ సేవలను అందించేందుకు చర్యలు చేపట్టనుంది.వచ్చే ఏడాది జులైలో హైదరాబాద్‌లో డ్రోన్ డెలివరీ సేవలను ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు హైసియా వార్షికోత్సవం సందర్భంగా ఇటీవల ఏర్పాటు చేసిన ఒక ప్రదర్శనలో స్కై ఎయిర్ సంస్థ స్పష్టం చేసింది. తెలంగాణ సర్కార్‌తో కలిసి స్కై ఎయిర్ మెడిసిన్స్ ఫ్రం స్కై ప్రాజెక్ట్‌లో ఇప్పటికే ఈ స్కై ఎయిర్ సంస్థ భాగం కావడం గమనార్హం. గురుగ్రామ్, బెంగళూరు వంటి నగరాల్లో ఈ-కామర్స్ అల్ట్రా ఫాస్ట్ డ్రోన్ డెలివరీ సేవలను స్కై ఎయిర్ సంస్థ అందుబాటులోకి తీసుకొచ్చింది.ప్రస్తుతం ఢిల్లీలో నిత్యం 12 లక్షల డ్రోన్ డెలివరీలు చేస్తున్నట్లు ఆ సంస్థ వెల్లడించింది. ఇక హైదరాబాద్ నగరంలో రోజుకి 3.75 లక్షల డ్రోన్ డెలివరీలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టం చేసింది. సాధారణంగా 30 కిలోమీటర్ల దూరం నుంచి ఏదైనా వస్తువును డెలివరీ చేయాలంటే.. ప్రస్తుతం వాహనాల ద్వారా ట్రాఫిక్ రద్దీ నేపథ్యంలో దాదాపు 2 గంటల సమయం పడుతుంది. కానీ ఢిల్లీ, బెంగళూరు నగరాల్లో హైపర్ లోకల్ డ్రోన్ డెలివరీ నెట్‌వర్క్ ద్వారా స్కై ఎయిర్ సంస్థ కేవలం 7 నిమిషాల్లోనే వస్తువులను డెలివరీ చేస్తుండటం విశేషం.గాలిలో డ్రోన్లు సేఫ్‌గా ఎగిరేందుకు వర్చువల్ స్కై టన్నెల్ ఏర్పాటు చేస్తారు. గోడౌన్ (వేర్‌హౌస్) నుంచి కస్టమర్ ఇంటి వరకు ఈ మార్గంలోనే ఆ డ్రోన్లు ప్రయాణిస్తాయి. ఆ రూట్‌లో ఇతర డ్రోన్‌లు ఉన్నాయా లేదా వాతావరణం ఎలా ఉందే చెక్ చేసేందుకు అన్‌మ్యాన్డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ కూడా ఉంటుంది. అందుకోసం భద్రతపరంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులను తీసుకోవాల్సి ఉంటుంది. ఇక ఆయా ప్రాంతాల్లో బేస్ స్టేషన్లను ఏర్పాటు చేస్తారు.కస్టమర్ల నుంచి ఆర్డర్ రాగానే ఆ బేస్ స్టేషన్ల నుంచి డ్రోన్లు ఎగురుతాయి. భూమికి 120 మీటర్ల ఎత్తులో ఈ డ్రోన్లు ఎగురుతాయి. ఇక కస్టమర్ వద్దకు చేరుకున్న తర్వాత భూమి నుంచి 20 మీటర్ల ఎత్తు వరకు దిగి.. ఆ వస్తువులను స్కైప్యాడ్ ప్రాంతంలో వదిలేస్తుంది. అయితే ఈ ప్రక్రియ మొత్తం 7 నిమిషాల్లో పూర్తి అవుతుందని స్కై ఎయిర్ సంస్థ తెలుపుతోంది. అక్కడి నుంచి ఆ వస్తువును డెలివరీ బాయ్ తీసుకుని.. చివరికి కస్టమర్‌కు అందిస్తారు. ఆ తర్వాత డ్రోన్ తిరిగి తన బేస్ స్టేషన్‌కు చేరుకుంటుంది. ఇక ఈ డ్రోన్లను ట్రాకింగ్ చేయడానికి, రియల్ టైమ్ నావిగేషన్ కోసం 5జీ మాడ్యుల్ అందుబాటులో ఉంటుంది. ఒక్కో డ్రోన్ గరిష్ఠంగా 10 కిలోల బరువు మోస్తుంది.సాధారణ డ్రోన్లను కంటికి కన్పించే దూరం వరకే ఆపరేట్ చేస్తారు. కానీ ఈ ఈ-కామర్స్ సేవలకు ఉపయోగించే డ్రోన్లు 30 కిలోమీటర్ల దూరం ప్రయాణించాలి. అదే సమయంలో నగరంలో కంటికి కన్పించనంత దూరం వెళ్లాల్సి ఉంటుంది. దానికోసం బియాండ్ విజువల్ లైన్ ఆఫ్ సైట్ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. పైలట్, ఆపరేటర్, రిమోట్ లేకుండానే కొన్ని డ్రోన్లు ఆటోమేటిక్‌గా ఎగురుతాయి.కానీ అవి సరిగ్గా వెళ్తున్నాయా లేదా అనేది సిస్టమ్ పర్యవేక్షిస్తుంది. దారిలో పక్షులు, డ్రోన్లు ఉంటే సెన్సర్లు గుర్తించి వాటి నుంచి తప్పిస్తాయి. డ్రోన్ ఎగురుతున్నంతసేపు ఎప్పటికప్పుడు సమాచారాన్ని పంపిస్తూ ఉంటుంది. స్పీడ్, బ్యాటరీ, వాతావరణ పరిస్థితుల వంటి 255 రకాల సమాచారాన్ని డ్రోన్ బ్లాక్‌బాక్స్ రికార్డ్ చేస్తుంది. ఎమర్జెన్సీ సమయాల్లో డ్రోన్ సేఫ్‌గా ల్యాండ్ కావడానికి ఇన్‌బిల్ట్‌గా పారాచ్యూట్ ఉంటుంది.

## మిధాని డిపోలో కొనసాగుతున్న సమ్మె

**హైదరాబాద్: పెన్ పవర్:** మిదాని డిపో వద్ద పోలీసుల బందోబస్తు మధ్య రెండో రోజు ఆర్టీసీ సమ్మె కొనసాగుతోంది. కార్మికులు డిపో ముందు నిరసన చేపట్టారు. ప్రైవేటు డ్రైవర్లతో వివిధ రూట్లలో 6 బస్సుల తరలించడంతో పోలీసులతీరుపై ఆర్టీసీ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేసారు. న్యాయమైన డిమాండ్లు తీర్చాలని నినాదాలు చేసారు. డిపో వద్ద భారీగా బలగాలు మోహరించాయి. ఓ వైపు పోలీసులు...మరోవైపు ఆర్టీసీ కార్మికులనిరసనతో పరిసర ప్రాంతాలు హోరెత్తుతున్నాయి. నిరసన చేస్తున్న కార్మికులను అదుపులోకి తీసుకొని పీఎస్ కు తరలించారు.

## వికారాబాద్ లో ప్రైవేటు బస్సుల పరుగులు

**వికారాబాద్: పెన్ పవర్:** వికారాబాద్ డిపో నుంచి ఇప్పటివరకు ప్రైవేటు, 4 బస్సులు 16 ప్రభుత్వ బస్సులు కలిపి మొత్తం 20 బస్సులు బయటకు వెళ్లినట్టు డిపో మేనేజర్ నమ్రత తెలిపారు. ప్రభుత్వ బస్సులను ధ్వంసం చేస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకోబడతాయని జిల్లా ఎస్పీ తెలిపారు. ఆర్ టీ సీ సిబ్బంది మాత్రం మా డిమాండ్లు నెరవేరే వరకు శాంతి యుతంగా మా నిరసన ఆపేదే లేదని ఆర్ టీ సి సిబ్బంది అంటున్నారు.

## అనుభవం లేని డ్రైవర్లతో ప్రమాదాలు:
## బర్కత్పురా డిపో వద్ద జేపసీ ఆగ్రహం

**హైదరాబాద్: పెన్ పవర్:** తెలంగాణ జేఏసీ పిలుపు మేరకు చేపట్టిన ఆర్టీసీ సమ్మె రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బర్కత్పురా బస్ డిపో వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ రోజు ఉదయం డిపో నుండి బస్సులను బయటకు తీసే క్రమంలో ఒక బస్సు డిపో మెయిన్ గేటును బలంగా ఢీకొట్టింది.ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా నియమించిన తాత్కాలిక డ్రైవర్లకు బస్సుల నిర్వహణపై కనీస అవగాహన లేకపోవడమే ఈప్రమాదానికి కారణమని కార్మిక సంఘాలు ఆరోపించాయి.

## సిద్దిపేటకు రూ 500

**హైదరాబాద్: పెన్ పవర్:** బస్సులు బంధు ఉండడంతో ప్రైవేట్ వాహనాలు, కార్ల యజమానులు అందినకాడికి దోచుకుంటున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. సిద్దిపేట్ కు 6వందలు, ప్రజ్ఞాపూర్ కు 2వందలు చొప్పున వసూల్‌చేస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. చర్చలు జరిపి బస్సులు యధావిధిగా నడిచే విదంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# కేటీఆర్ కవిత ఫైట్..




**హైదరాబాద్, ఏప్రిల్ 23, పెన్ పవర్:**
తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోసించిన కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తెలంగాణ తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. తొమ్మిదిన్నరేళ్ల రాష్ట్రాన్ని పాలించాడు. కొడుకు, కూతురు, అల్లుడు, సడ్డకుని కొడుకు ఇలా సకుటుంబ సపరివార సమేతంగా పాలనలో భాగస్వాములయ్యారు. 2023 ఎన్నికల్లో తెలంగాణ ఓటర్లు కేసీఆర్ పార్టీని తిరస్కరించారు. కాంగ్రెస్‌కు పట్టం కట్టారు. అధికారం కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్ అలియాస్ టీఆర్ఎస్‌లో కుమ్ములాటలు బయట పడ్డాయి. అధికారంలో ఉన్నప్పటి నుంచే ఆధిపత్య పోరు వార్తలు వచ్చినా నేతలు ఖండించారు. కానీ ఇప్పుడు అన్న చెల్లెలుకు పడడం లేదు.. బావా మరదలికి పడడం లేదు. దీంతో కూతురును ఒంటరి చేసి పార్టీనుంచి మెడలు పట్టి గెంటేసినంత పనిచేశారు. అయినా కూతురు బాపుకు వ్యతిరేకంగా ఎక్కడా మాట్లాడలేదు. అన్నను, బావనే టార్గెట్ చేస్తూ వచ్చింది. కానీ కొత్త పార్టీని లాంచ్ చేయబోతున్న కూతురు ఇప్పుడు బాపును కూడా టార్గెట్ చేసింది. మొత్తానికి అన్న చెల్లెలు గొడవలో చివరకు బాపే బలి అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.కవిత ఇప్పుడు విమర్శల కంచెను కుటుంబంలోకే మళ్లించినట్టు కనిపిస్తోంది. ఇప్పటివరకు పరోక్షంగా మాత్రమే స్పృశించిన కేసీఆర్‌పై కూడా ఆమె నేరుగా ప్రశ్నలు సంధించడం, ఆమె రాజకీయ పంథాలో స్పష్టమైన మలుపు అని చెప్పొచ్చు.కవిత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఉద్దేశించి తాజాగా చేసిన వ్యాఖ్యలు కేవలం భావోద్వేగ స్పందనలా కాకుండా, తనకంటూ ప్రత్యేక రాజకీయ గుర్తింపు నిర్మించాలనే ప్రయత్నంగా కనిపిస్తున్నాయి. కేసీఆర్‌ను టార్గెట్ చేయడం ద్వారా, బీఆర్ఎస్‌లోని అధికార కేంద్రాన్ని సవాల్ చేయడానికి కవిత సిద్ధమవుతున్నారనే భావన బలపడుతోంది.గులాబీ బాస్ కేసీఆర్ జగిత్యాల సభలో ప్రజలను తప్పుబట్టడం, ఉద్యమకారులకు స్థానం లేదనడం, మహిళల గౌరవాన్ని ప్రశ్నించడం వంటి అంశాలపై కవిత చేసిన వ్యాఖ్యలు కేసీఆర్ నేతృత్వంపై నేరుగా దెబ్బకొట్టేలా ఉన్నాయి. ఇవి కేవలం అసంతృప్తి వ్యక్తీకరణ

కాదు, పార్టీ లోపల ఉన్న అధికార సమీకరణలను మార్చాలనే సంకేతాలుగా కూడా చదవొచ్చు.కేసీఆర్‌ను నేరుగా ఎదుర్కొంటేనే తన రాజకీయ స్థానం స్పష్టమవుతుందని కవిత భావిస్తున్నట్లు కనిపిస్తోంది. కుటుంబ రాజకీయాల్లో ఉన్న బంధం కంటే రాజకీయ స్పష్టత ముఖ్యమని ఆమె నిరూపించాలనుకుంటున్నారన్న అభిప్రాయం ఈ పరిణామాలతో బలపడుతోంది.ఈ పరిణామం బీఆర్ఎస్ అంతర్గత రాజకీయాల్లో పెద్ద మార్పుకు దారితీయొచ్చు. ఒకవేళ కవిత ఈ ధోరణిని కొనసాగిస్తే, ఇది కేవలం వ్యక్తిగత అసమ్మతి కాదు, తెలంగాణ రాజకీయాల్లో కొత్త శక్తి నిర్మాణానికి ఆరంభం కావచ్చు.

# కొనుగోలులో కొర్రీలు..

**వరంగల్, ఏప్రిల్ 23, పెన్ పవర్:**
యాసంగిలో పెద్ద మొత్తంలో పండించిన మక్కల అమ్మకాలకు అన్నదాతలు ఆరిగోస పడుతున్నారు. దిగుబడికి తగ్గట్టుగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం, ఏర్పాటు చేసిన అరకొర కేంద్రాల్లో ఇప్పటికే వేల బస్తాల మక్కలు పేరుకుపోవడం, తేమ, ఇతర సాకులతో కొర్రీలు పెడుతుండడంతో రైతులు పండించిన పంటను నిల్వ చేసుకునే పరిస్థితి లేక అగ్గువ ధరకు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించి ఆర్థికంగా నష్టపోవలసిన పరిస్థితి నెలకొంది.ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో మక్కలకు క్వింటాల్ కు 2,400 రూపాయలు చెల్లిస్తుండగా, అక్కడ రోజుల తరబడి నిరీక్షించే పరిస్థితి లేక ప్రైవేటు వ్యాపారులకు క్వింటాలకు కనిష్టంగా 1,500 నుండి గరిష్టంగా 1,900 వరకు విక్రయించి క్వింటాలకు 400 నుండి 500 రూపాయల చొప్పున నష్టపోతున్నారు. యాసంగి సీజన్లో జిల్లా వ్యాప్తంగా లక్షన్నరకు పైగా ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ఎకరానికి తక్కువలో తక్కువ 25 క్వింటాళ్ల నుంచి 40 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వచ్చింది.ఫలితంగా జిల్లాలో ఎక్కడ చూసినా మక్కజొన్నలే కనిపిస్తున్నాయి. అయితే జిల్లా వ్యాప్తంగా 20 కొనుగోలు కేంద్రాలను మార్క్ఫెడ్ సంస్థ ఏర్పాటు చేసింది. ఆయా కేంద్రాల్లో విక్రయించడానికి తెచ్చిన మక్కలతో కిక్కిరిసిపోవడంతో కొనుగోళ్లకు జాప్యం జరుగుతోంది. ఒక్కో రైతు 20 రోజుల నుండి కొనుగోలు కేంద్రాల్లో మక్కలను విక్రయించడానికి పడికాపులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. రోజుల తరబడి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో నిరీక్షించలేక, సాగు చేసిన మక్క పంట నిల్వను చూసుకునే పరిస్థితి లేక, వాతావరణ మార్పుల నేపథ్యంలో ఎంతకు అంతకు అమ్మడానికి అన్నదాతలు ఆసక్తి చూపిస్తున్నారు. ఫలితంగా మార్క్ఫెడ్ సంస్థ ద్వారా మక్కలు విక్రయించడానికి కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన రైతులు కొనుగోళ్లకు తేమ, ఎకరానికి 25 క్వింటాళ్ల మక్కలు మాత్రమే కొంటామని,ఇతర సాకులతో కొర్రీలు పెట్టడం వల్ల గత్యంతరం లేని పరిస్థితుల్లో అగ్గువకు ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తూ నష్టపోతున్నారు.ప్రైవేట్ ట్రేడర్లు ఇదే అదనుగా భావించి కనీసం మద్దతు ధరకు మక్కలు కొనకుండా, ఇష్టం ఉన్న ధరకు కొంటున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు, ఇటు ప్రైవేటు ట్రేడర్ల దోపిడీ వల్ల ఈ యాసంగి సీజన్లో మొక్కజొన్న పంట సాగు చేసిన రైతులు ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.యాసంగి సీజన్లో పండించిన మక్కజొన్న పంట వ్యాపారులకు లాభాల సిరులు కురిపిస్తుండగా, ఆరుగాలం కష్టపడి పండించిన అన్నదాతకు మద్దతు ధర లభించక నష్టాల పాలవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారులు మొక్కజొన్నలకు క్వింటాలకు కనిష్టంగా 1750 రూపాయలు మాత్రమే పెడుతున్నారని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి విక్రయించే పరిస్థితిలో సిద్ధం చేసిన మక్కలకు కూడా 1900 రూపాయలకు మించి ధర పెట్టడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. అమ్మకానికి సిద్ధం చేసిన పంట నిలువ చేసుకునే పరిస్థితి లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు ట్రేడర్లకు విక్రయిస్తున్నట్లు రైతులు చెప్పారు. ప్రైవేటు ట్రేడర్లకు మక్కలు, ధాన్యం విక్రయించేందుకు వచ్చే రైతుల నుండి చార్జీల పేరుతో దోపిడీ చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. ట్రాక్టర్ల ద్వారా వే బ్రిడ్జి కాంటా వేయించినప్పటికీ, హమాలీ, కూలి, దడువాయి చార్జీల పేరుతో బస్తాకు 16 రూపాయల నుండి 23 రూపాయల వరకు కోత విధిస్తున్నారని రైతులు చెబుతున్నారు. నేరుగా వే బ్రిడ్జీ లో కాంట వేయించి ఆ చార్జీలను కూడా రైతులే చెల్లిస్తూ, ప్రైవేటు వ్యాపారికి చెందిన స్థలంలో అన్లోడ్ చేస్తున్నామని, అయినప్పటికీ ఇతర చార్జీల పేరుతో కోతలు పెడుతుండడంతో అటు తగ్గించి రెండు విధాలుగా తాము నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని అన్నదాతలు పేర్కొంటున్నారు.

# ఈ స్మార్ట్ యార్డులు

**హైదరబాద్, ఏప్రిల్ 23, పెన్ పవర్:**
తెలంగాణలో ఇక స్మార్ట్ మార్కెట్‌యార్డులు అందుబాటులోకి రానున్నాయి. ఐటీ, ఏఐ సాంకేతికతల వినియోగించనున్నారు. ఇకపై మార్కెట్ యార్డుల్లో క్రయవిక్రయాలు, లావాదేవీలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.. ఈ మేరకు కొత్త సాఫ్ట్‌వేర్‌ను రూపొందించి అన్ని ఏర్పాట్లు చేస్తోంది మార్కెటింగ్‌శాఖ. ముందుగా గడ్డి అన్నారం మార్కెట్‌లో ఈ కొత్త సాఫ్ట్‌వేర్‌ను ప్రవేశ పెట్టనున్నారు. అనంతరం రాష్ట్రంలోని అన్ని మార్కెట్ యార్డుల్లో అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది.తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్‌యార్డులకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై మార్కెట్ యార్డుల్లో ఎలాంటి అక్రమాలకు అవకాశం లేకుండా, అక్కడి కార్యకలాపాలు పూర్తి పారదర్శకంగా ఉండేలా డిజిటలైజ్ చేయాలని నిర్ణయించారు. తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 198 మార్కెట్ యార్డులు ఉంటే.. వాటిలో కార్యకలాపాలు మాన్యువల్ పద్ధతిలో కొనసాగుతున్నాయి. ప్రతి ఏటా దిగుబడి కూడా పెరుగుతుండటంతో మార్కెట్ యార్డులకు వచ్చే రైతుల సంఖ్య కూడా పెరుగుతోంది. ఇలా మార్కెట్ యార్డులకు పంట ఉత్పత్తులు ఎక్కువగా వస్తుండగా.. ఆదాయం మాత్రం పెద్దగా పెరగలేదు.మార్కెట్ యార్డులకు ఆదాయం రాకపోవడానికి కారణాలను అధికారులు పరిశీలిస్తే.. యార్డుల్లో సరుకుకు సంబంధించిన వివరాలు నమోదు సరిగా జరగడం లేదని తేలింది. కొంతమంది వ్యాపారులు రసుములు కూడా చెల్లించకుండా క్రయవిక్రయాలు చేస్తున్నారు. మాన్యువల్ కారణంగా యార్డుల్లో అక్రమాలకు అవకాశం ఏర్పడింది. చాలామంది వ్యాపారులు రూ.లక్షల్లో రుసుములు చెల్లించకుండా తప్పించుకుంటున్నట్లు తెలుస్తోంది. అందుకే మార్కెట్ యార్డుల్ని డిజిటలైజ్ చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలు జారీ చేశారు. దీంతో అధికారులు ఐటీ, ఏఐ సాంకేతికతలతో స్మార్ట్ మార్కెట్‌యార్డు సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేశారు.కొత్తగా రూపొందించిన ఈ స్మార్ట్ మార్కెట్‌యార్డు సాఫ్ట్‌వేర్‌ను

ముందుగా గడ్డిఅన్నారం మార్కెట్‌లో ఉపయోగించాలని నిర్ణయించారు. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా మిగిలిన మార్కెట్ యార్డుల్లో ప్రవేశపెట్టాలని భావిస్తున్నారు. మార్కెట్ యార్డుల ఎంట్రీ, వై బ్రిడ్జిల దగ్గర సెన్సార్లు అమర్చి కంప్యూటర్లకు కనెక్ట్ చేస్తారు. అలాగే ఏఐ సాయంతో సర్వైలెన్స్ కెమెరాలు కూడా ఏర్పాటు చేస్తారు.. అప్పుడు మార్కెట్‌లోకి వచ్చే వాహనాలు, సరుకులు, తూకం వివరాలు నమోదు చేయొచ్చు. మార్కెట్ యార్డుల్లో కొనుగోళ్లు సహా అన్ని వివరాలు ఈజీగా నమోదవుతాయి.. ఆన్‌లైన్‌లో రసీదులు కూడా ఉంటాయి. ఈ వివరాలు మొత్తం మార్కెటింగ్ శాఖ ప్రధాన కార్యాలయానికి కూడా వెళతాయి. ఒకవేళ వ్యాపారులు ఎవరైనా రైతుల నుంచి పంటల్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తే కారణాలపై ఆరా తీసిన తర్వాతే ఆమోదం తెలుపుతారు. మొత్తం మీద తెలంగాణలో స్మార్ట్ మార్కెట్‌లు అందుబాటులోకి రానున్నాయి

# మృతి రాలు కుటుంబానికి అండగా టిఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు దామల రవి

**ఖమ్మం రూరల్ పెన్ పవర్, ఏప్రిల్ 23:** ఖమ్మం పట్టణం పరిధిలో 59వ డివిజన్ దానవాయిగూడెం కి చెందిన కోనేరి లక్ష్మమ్మ మృతి చెందిన విషయం తెలుసుకొని పాలేరు మాజీ శాసనసభ్యుడు కందాల ఉపేందర్ రెడ్డి అభిమాని బెల్లం వేణు అనుచరుడు 59 వ డివిజన్ టిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు దామల రవి వారి కుటుంబాన్ని పరామర్శించారు దశదిన కార్యక్రమానికి ఆర్థిక 5000 రూపాయలు ఇవ్వడం జరిగింది అనంతరం దామల రవి మాట్లాడుతూ మీ కుటుంబానికి బి ఆర్ ఎస్ పార్టీ వెల్లవేల తోడుంటుంది ఆయన అన్నారు ఈ కార్యక్రమం లో59వ డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు నల్లూరి మధుబాబు అను బత్తుల వెంకటేశ్వర్లు మద్దెల ఉపేందర్ నాగటి బిక్షం ఇలాప్రోంగు సీతారాములు లింగ రెడ్డి వెంపటి సంతోష్ బత్తుల రవి మరపాక కరుణాకర్ కుట్టే పాపారావు జల కోటయ్య బత్తుల వెంకన్న నాగ గంటి సంగయ్య గురుమూర్తి షేక్ నాగుల్ మీరా పసుపులేటి కృష్ణ జానీ మద్దెల ఉదయ్ చీకటి వినయ్ దార నాగరాజ్ మద్దెల విజయ్ షేక్ ఆజాద్ దామాల ప్రసాద్. బి ఆర్ ఎస్ కార్యకర్తలు స్థానికులు పాల్గొన్నారు



# భారీ ప్రక్షాళనకు రేవంత్ ప్లాన్

**హైదరాబాద్, ఏప్రిల్ 23, పెన్ పవర్:**
రాష్ట్ర పాలనా యంత్రాంగంలో తన మార్క్‌తో భారీ ప్రక్షాళనకు ప్లాన్ చేస్తున్నారట సీఎం రేవంత్ రెడ్డి. సెక్రటేరియట్ నుంచి జిల్లా కలెక్టరేట్ దాకా ఐఏఎస్ ట్రాన్స్‌ఫర్లలో ఉన్న అన్ని చిక్కులకు చెక్ పెట్టే స్కెచ్ వేస్తున్నారట. అడ్మినిస్ట్రేటివ్ రీషఫ్లింగ్‌కు రెడీ అవుతున్నారట. రేవంత్ సరికొత్త కసరత్తు వెనుక మాస్టర్ ప్లాన్ ఏంటి?అధికార యంత్రాంగంలో మార్పులు, చేర్పులపై పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టారు సీఎం రేవంత్. ఇందులో భాగంగా త్వరలోనే భారీగా ఐఏఎస్ ల బదిలీలు చేయబోతున్నారట. ఈసారి ట్రాన్స్‌ఫర్స్ కసరత్తు..ఇప్పటివరకు ఒక లెక్క..ఇక నుంచి మరో లెక్క అన్నట్లు నడుస్తోందట. రెండున్నరేళ్ల కాలంలో ఐదారుసార్లు ఐఏఎస్‌ల బదిలీలు చేసింది రేవంత్ సర్కార్. ఒక్కోసారి..పదుల సంఖ్యలో టాన్స్‌ఫర్లు చేసిన సందర్భాలున్నాయి. జిల్లా కలెక్టర్ల నుంచి మొదలుకుని..సెక్రటేరియట్‌లో ప్రిన్సిపల్, స్పెషల్ సెక్రటరీల వరకు..అందరికీ స్థానం చలనం కల్పించింది. అయితే..ఈ బదిలీల్లో జరిగిన చిన్న తప్పిదాలు... కింది స్థాయి అధికారుల నుంచి..పై స్థాయి అధికారుల వరకు..క్లాషెస్‌కు దారితీసింది.సీనియర్ వర్సెస్ జూనియర్ కోల్డ్ వార్ ఇష్యూ అయింది. గ్రేటరక్ కమిషనర్‌గా ఓ అధికారికి పోస్టింగ్ ఇచ్చిన సర్కార్..ఆయన కింద జోనల్ కమిషనర్‌గా..ఓ సీనియర్ ఐఏఎస్ ఉన్న విషయాన్ని కూడా గుర్తించలేకపోయిందట. దీంతో నొచ్చుకున్న సదరు సీనియర్ ఐఏఎస్ ఇగో హర్ట్ కావడంతో లాంగ్ లీవ్‌లో వెళ్లిపోవడం అప్పట్లో చర్చనీయాంశమైంది.అధికారుల్లో..తాము వేరయా అన్నట్లు..ఐఏఎస్ అధికారులు భావిస్తుంటారు..వ్యవహరిస్తుంటారు కూడా. ఇలా కన్ఫర్డ్ ఐఏఎస్‌లకు..ఐఏఎస్‌ల మధ్య కూడా..గతంలో డిసిగ్నేషన్ పంచాయితీతో ఇగో క్లాషెస్ వచ్చిన సందర్భాలు ఉన్నాయి. ఈ మధ్య కన్ఫర్డ్ ఐఏఎస్‌లలో ఒకరికి స్పెషల్ సెక్రటరీగా పోస్టింగ్ ఇవ్వగా..ఆయనకంటే సీనియర్ ఐఏఎస్ సెక్రటరీగా ఉన్న సందర్భం ఎదురైంది. దీంతో సదరు ఐఏఎస్..వాట్ ఈజ్ దిస్ అంటూ బాగా ఫీల్ కావడంతో..అప్పటికప్పుడు సెక్రటరీని స్పెషల్ సెక్రటరీగా మార్చారట.ఇక టూరిజం శాఖలో అయితే ఇప్పటివరకు అరడజన్



మంది సెక్రటరీలు రావడం..పోవడం ఓ తంతుగా మారిపోయిందట. ఇక ఎన్నిసార్లు బదిలీలు జరిగినా.. హెల్త్ సెక్రటరీ సహా మరికొందరికి ఎందుకోగానీ స్థాన చలనం లేదనే టాక్ సెక్రటేరియట్ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఇలా..ఒక్కోచోట..ఒక్కో రకంగా..ఐఏఎస్‌ల ట్రాన్స్‌ఫర్లలో జరుగుతున్న పొరపాట్లను గుర్తించిన సీఎం రేవంత్ రెడ్డి..వీటన్నింటికి చెక్ పెట్టాలని భావిస్తున్నారట. మరోవైపు తెలంగాణ అధికారులకు కీలక పోస్టింగ్‌లు ఇవ్వడం లేదన్న విమర్శలకు కూడా చెక్ పెట్టాలన్న ఆలోచనలో రేవంత్ అండ్ టీం కసరత్తు చేస్తోందట. మరికొన్ని శాఖల్లో మంత్రులకు, ఐఏఎస్‌ల మధ్య జరుగుతున్న పంచాయతీలకు చెక్ పెట్టేలా షఫ్లింగ్ చేయనున్నారని తెలుస్తోంది.త్వరలో రాష్ట్రంలో ఐఏఎస్ అధికారుల సమూల బదిలీలకు రంగం సిద్ధం చేస్తున్నారన్న టాక్ నడుస్తోంది. కేవలం బదిలీలు అంటే ఒకరిని తీసి మరొకరిని పెట్టడం కాదు..పూర్తిగా ప్రక్షాళన చేయడమే లక్ష్యంగా కసరత్తు జరుగుతోందని అంటున్నారు. ముఖ్యంగా..సీనియర్, జూనియర్ల కోల్డ్ వార్, కన్ఫర్డ్ ఐఏఎస్, ఐఏఎస్‌ల మధ్య ఇగో క్లాషెస్‌కు ఫుల్ స్టాప్ పెట్టేలా ఎక్సర్ సైజ్ చేస్తోందట సర్కార్.కీలకమైన పోస్టుల కోసం జరుగుతున్న పోటీకి బ్రేక్స్ వేసి..ఎవరికి ఏ బాధ్యత ఇవ్వాలి? ఎవరి సీనియారిటీకి ఎక్కడ పోస్టింగ్ ఇవ్వాలనేది ఒక పద్ధతి ప్రకారం జరగాలని రేవంత్ రెడ్డి క్లియర్ కట్ డైరెక్షన్స్ ఇచ్చారట. దీనిలో భాగంగా..రేవంత్ మార్క్ అడ్మినిస్ట్రేటీవ్ రీషఫ్లింగ్‌తో న్యూటీమ్ రెడీ అవుతుందని టాక్. ఈ సారి జరిగే ఐఏఎస్‌ల బదిలీల్లో..అధికారుల లాబీయింగ్‌కు చెక్ పెట్టి..ఫెర్మామెన్స్, లాయల్టీ, ఎఫీషియన్సీకి పెద్దపీట వేయనున్నారట. ఇప్పటివరకు పనితీరు బాగా కనబరిచిన అధికారులకు ప్రమోషన్లు ఇవ్వాలన్నది సీఎం ఆలోచన అంటున్నారు. మొత్తానికి రేవంత్ రెడ్డి తన మార్క్ మార్పులతో పర్ఫెక్ట్ టీమ్‌ను సెట్ చేసుకునే పనిలో బిజీగా ఉన్నారట. తన స్పీడ్‌కు అనుగుణంగా..క్షేత్రస్థాయిలో పనిచేసే అధికారులను ఎంపిక చేయనున్నారట. రేవంత్ మార్క్ ఐఏఎస్ టీమ్ ఎలా ఉండనుందనేది ఇంట్రెస్టింగ్‌గా మారింది.

# కాళేశ్వరంలో కొత్త ట్విస్టులు... పంతం నీదా...నాదా

**హైదరాబాద్, ఏప్రిల్ 23, పెన్ పవర్:**
సర్కార్ విచారణ..బీఆర్ఎస్ అబ్జక్షన్..ఎట్టకేలకు కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్‌ను నిలిపివేసింది హైకోర్టు. కమిషన్ 655 పేజీల రిపోర్ట్ ఇస్తే..ఆ నివేదికతో పాటు కమిషన్ విచారణ తీరుపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కారు పార్టీ హైకోర్టును ఆశ్రయించింది. దీంతో మాజీ సీఎం కేసీఆర్, హరీశ్‌రావుకు హైకోర్టులో ఊరట లభించింది. జస్టిస్ ఘోష్ కమిషన్ రిపోర్టును నిలిపివేసింది రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం. రిపోర్ట్ ఆధారంగా చర్యలు తీసుకోవద్దని ఆదేశాలు ఇచ్చింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎలాంటి నిబంధనలు పాటించలేదని స్పష్టం చేసింది హైకోర్టు.హైకోర్టు తీర్పు కాంగ్రెస్ కుట్రలకు చెంపపెట్టు లాంటిదంటూ బీఆర్ఎస్ అటాక్ స్టార్ట్ చేసింది. రాజకీయ కక్ష సాధింపు కోసం వ్యవస్థలను దుర్వినియోగం చేస్తున్న తీరును ఈ తీర్పు ఎండగట్టిందన్నారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఇప్పటికైనా చిల్లర రాజకీయాలు మాని..మేడిగడ్డ పిల్లర్లకు రిపేర్లు చేయాలని మాజీ ఇరిగేషన్ మినిస్టర్ హరీశ్‌రావు డిమాండ్ చేశారు.కాళేశ్వరం కమిషన్ ఏర్పాటును హైకోర్టు సమర్థించినట్లు కాంగ్రెస్ నేతలు చెప్పుకోవడం ఆసక్తికరంగా మారింది. ఏ ఇష్యూపై అయినా కమిషన్‌ను ఏర్పాటు చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని..కానీ ఆ కమిషన్ నిబంధనలు పాటించలేదని కోర్టు చెప్పిన విషయాన్ని మర్చిపోవద్దంటున్నారు బీఆర్ఎస్ లీడర్లు. రేవంత్ సర్కార్ మాత్రం హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయాలని డిసైడ్ అయినట్లు తెలుస్తోంది. గురువారం జరిగే క్యాబినెట్‌లో భేటీలో డిస్కస్ చేసి సుప్రీంకోర్టులో అప్పీల్ చేయాలని భావిస్తున్నారట.గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్ ఒప్పందాలపై రేవంత్ సర్కార్ విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. కమిషన్ ఛైర్మన్ జస్టిస్ నరసింహారెడ్డి మాట్లాడిన తీరుపై బీఆర్ఎస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఏకంగా తనను విచారణకు పిలిచే అధికారం జస్టిస్ నరసింహారెడ్డికి లేదంటూ కేసీఆర్ ఇచ్చిన రిప్లై అప్పట్లో చర్చకు దారితీసింది. ఈ విచారణ చట్ట విరుద్ధమని, రాజకీయ కక్షతో ఏర్పాటు చేశారని మాజీ సీఎం కేసీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు ఆదేశాలతో జస్టిస్ నరసింహారెడ్డి విచారణ కమిషన్ ఛైర్మన్ పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చింది.ఇప్పుడు కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్‌పై కూడా హైకోర్టుకెళ్లి మరీ ఆర్డర్స్ తెచ్చుకుంది బీఆర్ఎస్. అపోజిషన్‌లోకి వచ్చినప్పటి నుంచి కారు పార్టీని ఈ రెండు ఇష్యూస్‌లో ఆరోపణలు వెంటాడుతున్నాయి. అయితే ఈ అంశాలపై ఇప్పటివరకు తాము చేసిన పోరాటం ఫలించిందని..గులాబీ దళం హ్యాపీగా ఫీల్ అవుతోంది. రేవంత్‌ది రాజకీయ కక్ష సాధింపు చర్యగా రివర్స్ అటాక్ చేస్తోంది. ఈ రెండు ఇష్యూస్‌కు ఇంతటితో ఎండ్‌కార్డ్ పడ్డట్లేనా? వచ్చే ఎన్నికల వరకు కాళేశ్వరం చుట్టే రచ్చ జరగబోతోందా అనేది ఇప్పటికైతే సస్పెన్స్‌గానే ఉంది.మరోవైపు కాళేశ్వరం కమిషన్ ఏర్పాటులో ప్రభుత్వం ప్రోటోకాల్ పాటించలేదని బీజేపీ అంటోంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ లోపాయికారి ఒప్పందంలో భాగంగానే హైకోర్టు ఆర్డర్స్ వచ్చాయని ఆరోపిస్తోంది. సీబీఐ విచారణ కోసం లేఖ రాస్తే..బీజేపీ తమ విజ్ఞప్తిని తొక్కి పెట్టిందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. బీఆర్ఎస్ నేతలను సేవ్ చేసేందుకు బీజేపీ ఆరాటపడుతోందని విమర్శిస్తోంది. బీజేపీ మాత్రం ఎంటైర్ కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ జరపాలని రేవంత్ సర్కార్ లేఖ రాయలేదని చెప్తోంది. పైగా కాళేశ్వరం రిపోర్ట్‌తో పాటు..

చీణూూ నివేదికను బేస్ చేసుకుని విచారణ జరపాలని రాష్ట్ర ప్రభుత్వం కోరిందని అంటోంది బీజేపీ. చీణూూ రిపోర్ట్ ఆధారంగా ఒక్క మేడిగడ్డపై దర్యాప్తు చేస్తే ఒరిగేదేమి ఉండదని స్పష్టం చేస్తోంది.చీణూూ కేవలం డ్యామ్ సేఫ్టీ, డిజైన్‌పైనే అభ్యంతరాలు తెలిపిందని..అవినీతిపై ఎక్కడా క్లారిటీ ఇవ్వలేదని చెప్తోంది బీజేపీ. రేవంత్‌కు నిజాయితే ఉంటే..మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ చేయాలని లేఖ రాసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలంటూ బీజేపీ సేఫ్ గేమ్‌కు తెరదీసింది. ఇలా కమిషన్ చుట్టూ ట్రయాంగల్ వార్ నడుస్తోంది. ఎట్టకేలకు బీఆర్ఎస్ మాత్రం హ్యాపీగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్తే..తాము ఇంప్లీడ్ కావాలని గులాబీ పార్టీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే మాజీమంత్రి హరీశ్‌రావు ఢిల్లీ వెళ్లి లీగల్ ఎక్స్‌పర్ట్స్‌తో డిస్కస్ చేసి వచ్చారు. స్టేట్ సర్కార్ సుప్రీంలో పిటిషన్ వేస్తే..హైకోర్టు తీర్పు ఆధారంగా..సుప్రీంలో ఫైట్ చేయాలనేది బీఆర్ఎస్ ప్లాన్‌గా తెలుస్తోంది. ఎంటైర్ కాళేశ్వరం ఎపిసోడ్‌లో బీఆర్ఎస్‌కు ఇప్పటికే జరగాల్సిన నష్టం జరిగినా..కరెక్ట్ ఎన్నికల హీట్ మొదలయ్యే టైమ్‌కు హైకోర్టు ఇచ్చిన తీర్పు అడ్వాంటేజ్‌గా భావిస్తోంది గులాబీ దళం.

# మాజీ సిఎం కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



**గార్ల, పెన్ పవర్ ఏప్రిల్ 23:** కాలేశ్వరం ప్రాజెక్టు ఉన్నంతకాలం కెసిఆర్ పేరు చిరస్మరణీయంగా నిలుస్తుందని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గంగావత్ లక్ష్మణ్ నాయక్ అన్నారు. గురువారం స్థానిక బిఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో మండల నాయకులతో కలిసి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు పై కాంగ్రెస్ చేసిన కుట్రలను, దుష్ప్రచారాన్ని ఎండగడుతూ హైకోర్టు అద్భు తమైన తీర్పు ఇచ్చిందని, ఈ తీర్పు బిఆర్ ఎస్ పార్టీకే కాదు, తెలంగాణ రాష్ట్ర ప్రజలకు, రైతాంగానికి ఒక గొప్ప విజయమని అభివర్ణించారు.
హైకోర్టు తీర్పు కాంగ్రెస్ పార్టీ మూడు సంవత్సరాలుగా కాళేశ్వరం ప్రాజెక్టు పైన చేస్తున్న అసత్య ప్రచారం పూర్తిగా అవాస్తవమని హైకోర్టు తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు, షఫీయుద్దీన్, యాకూబ్ పాషా, ముంగి రాములు, అజార్, తాళ్లూరి అనిల్, ప్రభాకర్, చంద్రశేఖర్, అంజి, లచ్చు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలకు కుర్చీలు బహుకరణ




**గార్ల, పెన్ పవర్, ఏప్రిల్ 23:** గార్ల మండల పరిధిలోని మద్దివంచ గ్రామంలోని జెడ్పిహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలకు ఎస్. కె షరీఫ్ (స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్) ఉపాధ్యాయుడు ఎస్. కె షరీఫ్ 10 కుర్చీల ను బహుకరించారు. పేద విద్యార్థులు చదువుకుంటున్న ప్రభుత్వ పాఠశాలకు కుర్చీలు బహుకరించిన ఉపాధ్యాయుడిని అమ్మ ఆదర్శ కమిటి చైర్మన్ పి రజిత, ప్రధానోపాధ్యాయులు ఎన్ సీతారామయ్య, ఉపాధ్యాయులు జి సీతా రాములు, కే నాగేశ్వరరావు. ఎన్ పెంట్యా, జి. నరసింహ, ఎం. రేణుక, ఎం జితేందర్, బి. మంగీలాల్ పాఠశాల చైర్మన్, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా అభయ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం





**ఖమ్మం రూరల్ పెన్ పవర్ ఏప్రిల్ 23:** కూసుమంచి మండలం లింగారం తండా గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ అభయ ఆంజనేయ స్వామి, ధ్వజస్తంభం, నవగ్రహాలు, జంట నాగులు, నాభిశీల, స్థిర విగ్రహ యంత్ర ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిగ్రామ ప్రజల అభివృద్ధి, శాంతి, సౌభాగ్యాల కోసం ఆంజనేయ స్వామి ని వేడుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎదులాపురం మున్సిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత సర్పంచ్ బానోత్ పుష్ప రవి కుమార్ అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఉద్యోగిపై కేసు నమోదు

**మమబూబాబాద్ పెన్ పవర్:** మహబూబాబాద్ జిల్లాలో ఆర్టీసీ కార్మికులపై పోలీసులు అత్యుత్సాహం చూపించారు. మహబూబాబాద్, తొర్రూరు డిపోల వద్ద భారీగా పోలీసులు మోహరించారు. విధులకు రాని 21 మంది కార్మికులపై కేసు నమోదు అయింది. సమ్మెలో పాల్గొనేందుకు డిపో వద్దకు వస్తున్న కార్మికులను పోలీసులు అరెస్టు చేసారు. ఆర్టీసీ ఉద్యోగులను అరెస్ట్ చేసి కేసులు నమోదు చేయడంపై ఉద్యోగ సంఘాల నేతలు మండిపడుతున్నారు.

# సూర్యాపేటలో రెండవ రోజు ఆర్టీసీ కార్మికుల సమ్మె

**సూర్యాపేట పెన్ పవర్:** సూర్యాపేట జిల్లాలో ఆర్టీసీ కార్మికుల సమ్మె రెండో రోజు కొనసాగింది. సూర్యాపేట డిపో ఎదుట పోలీసులకు, కార్మికులకు మధ్య వాగ్వాదం జరిగింది. తాము సమ్మెలో ఉండగా బస్సులు బయటకి ఎలా పంపిస్తారంటూ పోలీసులపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేసారు.

# ఆర్టీసీ కార్మికుడిపై చేయి చేసుకున్న డీఎస్పీ

**వికారాబాద్ పెన్ పవర్:** వికారాబాద్ జిల్లా పరిగిలో ఆర్టీసీ కార్మికులపై డీఎస్పీ చెయ్యి చేసుకోవడం వివాదంగా మారింది. ఈ నేపథ్యంలో పోలీసులు ఆర్టీసీ కార్మికుల మధ్య తోపులాట జరిగింది. ప్రైవేటు వ్యక్తులతో బస్సులు తరలిస్తుంటే ఆర్టీసీ కార్మికులు అడ్డుకున్నారు. భారీగా మోహరించి.. వారిని నిలువరించే ప్రయత్నం పోలీసులు చేసారు ఆర్టీసీ కార్మికులు వినకపోవడంతో వారిని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేసారు. ఈ క్రమంలో ఆర్టీసీ కార్మికుల పై డీఎస్పీ దాడికి దిగారు. డీఎస్పీ శ్రీనివాస్ పక్కనే ఉన్న ఓ బాలుడిని కూడా గట్టిగా కొట్టారు.

# సుప్రీం కోర్టుకు తెలంగాణ ప్రభుత్వం

**హైదరాబాద్, ఏప్రిల్ 22, పెన్ పవర్:** కాళేశ్వరం ప్రాజెక్టు అవకతవకలపై వెలువడిన హైకోర్టు తీర్పు తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనాన్ని సృష్టించింది. చట్టబద్ధతకూ, సహజ న్యాయసూత్రాలకూ మధ్య జరిగిన ఈ న్యాయపోరాటం ఇటు ప్రభుత్వానికి, అటు బీఆర్ఎస్ అగ్రనేతలకు చెరో సగం విజయాన్ని, చెరో సగం ఆందోళనను మిగిల్చింది. ఇప్పుడు ప్రభుత్వం ఏం చేయబోతోందన్నది ఆసక్తికరమైన అంశంగా మారింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీష్ రావులపై ప్రభుత్వం తక్షణమే ఎటువంటి కఠిన చర్యలు తీసుకోకుండా హైకోర్టు బ్రేక్ వేసింది. విచారణా చట్టం సెక్షన్ 8బి ప్రకారం, నివేదికలో ఎవరినైనా బాధ్యులుగా పేర్కొనే ముందు వారి వివరణ కోరడం తప్పనిసరి. అయితే, సదరు నిందితుల వాదన వినకుండానే దోషులుగా తేల్చడం సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ సాంకేతిక లోపం కారణంగా నివేదికలోని చర్యల భాగం ప్రస్తుతానికి అమలుకు వీలులేనిదిగా మారిపోయింది, ఇది బీఆర్ఎస్ అగ్రనేతలకు పెద్ద ఊరటనిచ్చింది.ప్రభుత్వానికి ఈ తీర్పు కొంత మేర చేదును మిగిల్చినప్పటికీ, మరో కోణంలో చట్టబద్ధమైన విజయాన్ని అందించింది. కాళేశ్వరం అక్రమాలపై విచారణకు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 6ను హైకోర్టు సమర్థించింది. కమిషన్ ఏర్పాటులో ఎటువంటి రాజ్యాంగ ఉల్లంఘనలు లేవని, అవకతవకలపై విచారణ జరిపే పూర్తి అధికారం ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేసింది. దీనివల్ల కమిషన్ నిర్వహించిన విచారణ ప్రక్రియకు గుర్తింపు లభించినట్లయింది, ఇది భవిష్యత్తులో ప్రభుత్వం తీసుకునే తదుపరి చర్యలకు ఒక బలమైన పునాదిగా నిలుస్తుంది. విచారణ చట్టబద్ధతను కోర్టు అంగీకరించడం బీఆర్ఎస్ పార్టీకి ఆందోళన కలిగించే అంశం. మరోవైపు, అక్రమాలను నిరూపించే నివేదిక ఉన్నప్పటికీ, ప్రక్రియ లోపాల వల్ల రాజకీయంగా మైలేజ్ పొందలేకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రతిబంధకంగా మారింది. హైకోర్టు లేవనెత్తిన సాంకేతిక అంశాలపై వెనక్కి తగ్గకూడదని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. సాక్ష్యాధారాలతో కూడిన కమిషన్ నివేదికను కేవలం నోటీసుల కారణంతో పక్కన పెట్టడం సరికాదని న్యాయ నిపుణులతో ప్రభుత్వం చర్చలు జరుపుతోంది. ఈ కారణంగా హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించుకుంది. కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుంచారు. హైకోర్టు తీర్పుతో కేసీఆర్, హరీష్ రావులకు ముప్పు పూర్తిగా తొలగిపోయిందని భావించలేరని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి. ఒకవేళ సుప్రీంకోర్టులో చుక్కెదురైతే, ప్రభుత్వం మరో వ్యూహాన్ని సిద్ధం చేస్తోంది. హైకోర్టు సూచించినట్లుగా నిందితులకు నోటీసులు ఇచ్చి, వారి వాదనలు విన్న తర్వాత సవరించిన నివేదికను సమర్పించేలా కమిషన్‌కు అదనపు గడువు ఇచ్చే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో విచారణ మళ్లీ మొదటికి వస్తుంది తప్ప, బాధ్యత నుండి తప్పించుకోవడం సాధ్యం కాదని ప్రభుత్వం గట్టిగా నమ్ముతోంది. ఈ న్యాయపోరాటం ఇప్పుడు అత్యంత ఉత్కంఠభరితమైన దశకు చేరుకుంది. తదుపరి పోరాటం ఢిల్లీలోని సుప్రీంకోర్టు వేదికగా సాగుతుందాస కొత్త నివేదిక రూపంలో రాష్ట్రంలోనే కొనసాగుతుందా అన్నది ప్రభుత్వ వ్యూహంపై ఆధారపడి ఉంటుంది.

# కొత్త రాష్ట్రంలో రెండోసారి సమ్మె

**హైదరాబాద్, ఏప్రిల్ 22, పెన్ పవర్:** తెలంగాణ రాజకీయ చరిత్రలో 2019లో జరిగిన ఆర్టీసీ సమ్మె ఒక పెను సంచలనం. కేసీఆర్ ప్రభుత్వానికి, కార్మిక సంఘాలకు మధ్య జరిగిన ఆ సుదీర్ఘ పోరాటం అనేక మలుపులు తిరిగింది. 2019 అక్టోబరు 5న, సరిగ్గా దసరా పండుగకు ముందు రోజున ఆర్టీసీ కార్మికులు సమ్మె బాట పట్టారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి, జీతాల పెంపు వంటి 26 డిమాండ్లతో సుమారు 48 వేల మందికి పైగా కార్మికులు విధులను బహిష్కరించారు. పండుగ సమయంలో ప్రజలకు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నా, తమ డిమాండ్లు నెరవేరే వరకు వెనక్కి తగ్గేది లేదని కార్మిక సంఘాల జేఏసీ భీష్మించుకూర్చుందిసమ్మెపై అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ అత్యంత కఠినంగా స్పందించారు. ప్రభుత్వం విధించిన గడువు లోపు విధుల్లో చేరని వారందరూ తమంతట తామే ఉద్యోగాల నుంచి డిస్మిస్ అయినట్లు ప్రకటించారు. ఆర్టీసీలో కేవలం 1,200 మంది మాత్రమే ఉద్యోగులు మిగిలారని, మిగిలిన వారందరినీ తిరిగి తీసుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

సమ్మె కాలంలో ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా ప్రైవేట్ డ్రైవర్లను, కండక్టర్లను నియమించి బస్సులను నడిపింది. సుమారు 52 రోజుల పాటు సాగిన ఈ సమ్మెలో అనేక విషాదాలు చోటుచేసుకున్నాయి. ఉద్యోగాలు పోతాయన్న భయంతో, ఆర్థిక ఇబ్బందులతో సుమారు 25 మందికి పైగా కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడటం, గుండెపోటుతో మరణించడం రాష్ట్రవ్యాప్తంగా ఉద్రిక్తతలకు దారితీసింది. ఈ

వివాదం హైకోర్టుకు చేరింది. ఇరువర్గాలు చర్చల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని కోర్టు సూచించింది. కానీ, ప్రభుత్వం చర్చలకు మొగ్గు చూపలేదు. చివరికి, నవంబరు 25న కార్మిక సంఘాలు ఒక అడుగు వెనక్కి వేసి, ఎటువంటి షరతులు లేకుండా సమ్మెను విరమిస్తున్నట్లు ప్రకటించాయి. తాము విధుల్లో చేరతామని చెప్పినప్పటికీ, ప్రభుత్వం వెంటనే వారిని అనుమతించలేదు, దీనితో మరో రెండు రోజులు సందిగ్ధత కొనసాగింది.నవంబరు 28న కేసీఆర్ తన వైఖరిని మార్చుకుని, కార్మికులందరినీ తిరిగి విధుల్లోకి తీసుకుంటున్నట్లు ప్రకటించారు. కార్మికులు నా బిడ్డలు, వారు యూనియన్ నాయకుల మాట విని తప్పుదారి పట్టారు అని పేర్కొంటూ వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఆ తర్వాత ప్రగతి భవన్‌లో కార్మికులతో కలిసి భోజనం చేసి, ఆర్టీసీని నష్టాల నుంచి గట్టెక్కించే బాధ్యతను వారిపై పెట్టారు. అలా ఒక తీవ్రమైన పోరాటం ఊహించని విధంగా సుఖాంతమైంది.

# సాయిన్న కుటుంబంలో మళ్లీ..

**హైదరాబాద్, ఏప్రిల్ 23, పెన్ పవర్:** :సరిగ్గా మూడు సంవత్సరాల క్రితం ఆ కుటుంబంలో ఆనందా లు.. ఎటు చూసినా సంతోషాలు.. నియోజకవర్గ ప్రజల ఆశీర్వాద బలంతో ఆయన ఆ ప్రాంతంలో మకుటం లేని మహారాజు లాగా వెలుగొందేవారు. ప్రతిరోజు ఆయన ఇల్లు చిన్నపాటి అసెంబ్లీని తలపించేది. సమస్యల మీద వచ్చేవారు ఆయనను కలిసి వెళ్లేవారు. ఆయన అక్కడికక్కడే సమస్యలకు పరిష్కార మార్గం చూపించేవారు. అందువల్లే ఆయన ఆ నియోజకవర్గంలో వరుసగా విజయాలు సాధించారు. టిడిపిలో.. తర్వాత భారత రాష్ట్ర సమితిలో కీలక నాయకుడిగా ఎదిగారు. అంతటి స్థాయికి ఎదిగిన ఆయన సరిగ్గా మూడు సంవత్సరాల క్రితం చనిపోయారు. దీంతో ఆయన కుటుంబం ఒక్కసారిగా కుదుపునకు గురైంది. ఆ విషాదమే ఆ కుటుంబాన్ని కుంగ తీసింది అనుకుంటే.. వరుస విషాదాలు మరింత అగాధంలోకి నెట్టి వేశాయి.సికింద్రాబాద్ పరిధిలోని కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా సాయన్న ఉండేవారు. సరిగ్గా మూడు సంవత్సరాల క్రితం ఆయన అనారోగ్యంతో కన్నుమూశారు. ఆ తర్వాత ఆస్థానం నుంచి భారత రాష్ట్ర సమితి అభ్యర్థిగా సాయన్న కుమార్తె లాస్య నందిత పోటీ చేశారు.. తన తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తానని నియోజకవర్గ ప్రజలకు హామీ ఇవ్వడంతో వారంతా నమ్మారు.. సాయన్న సానుభూతి కూడా ఆమెకు ఉపకరించింది. ఫలితంగా లాస్య నందిత విజయం సాధించారు.. సరిగ్గా ఏడాది క్రితం లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు.. దీంతో ఆ కుటుంబం ఒకసారిగా షాక్ లోకి వెళ్ళిపోయింది.సాయన్న చనిపోవడం.. లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడంతో ఆ కుటుంబం మొత్తం శోక సంద్రంలో మునిగిపోయింది. నేపథ్యం లో సాయన్న భార్య గీత కూడా బుధవారం కన్నుమూశారు. గడిచిన మూడు సంవత్సరాలుగా ఆమె తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్నారు. హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆమె చికిత్స పొందారు.. చికిత్స పొందుతూ బుధవారం కనుమూశారు..

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# డిప్యుటేషన్ల ప్రభావం.. విద్యా లక్ష్యాలకు విఘాతం..

**ఉన్న చోటుకే పోస్టింగులు**

**బోధన లేక విద్యార్థుల అవస్థలు..!**

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి మరోసారి ప్రజా చర్చకు దారితీస్తోంది. చేరికల పెంపు, డ్రాప్‌ఔట్ తగ్గింపు వంటి లక్ష్యాలతో ప్రభుత్వం చేపడుతున్న చర్యలు ఒకవైపు ఆశలు రేకెత్తిస్తుంటే, మరోవైపు పాఠశాలల్లో పెరుగుతున్న టీచర్ల కొరత, అసమాన కేటాయింపులు, డిప్యూటేషన్ దుర్వినియోగం వంటి సమస్యలు ఆ లక్ష్యాలనే ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. విద్యార్థిని పాఠశాల గడప దాటించడం ఒకఅడుగు మాత్రమే..అతనికి నాణ్యమైన బోధన అందేలా చేయడం అసలు బాధ్యత. ఈ విరుద్ధ దృశ్యం, విద్యా విధానాల రూపకల్పనకంటే వాటి సమర్థవంతమైన అమలే కీలకమని మరోసారి స్పష్టం చేస్తోంది. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వం ప్రకటిస్తున్నప్పటికీ, పాఠశాల విద్యా వ్యవస్థలో కనిపిస్తున్న వాస్తవ పరిస్థితి పూర్తిగా విరుద్ధంగా ఉంది. రాష్ట్రంలో సుమారు 13 వందలకు పైగా పాఠశాలల్లో ఒక్క టీచర్ కూడా లేకపోవడం సమస్య తీవ్రతను స్పష్టంగా తెలియజేస్తోంది. మరోవైపు 6 వేల 3వందలకు పైగా పాఠశాలలు ఒక్క టీచర్‌తోనే నడుస్తుండటం, దాదాపు 8 వేల 8 వందల పాఠశాలలు కేవలం ఇద్దరు టీచర్లతో కొనసాగుతుండటం పరిస్థితి ఎంత క్లిష్టంగా ఉందో చూపిస్తోంది. కనీసం 3 వేల పాఠశాలల్లో స్పష్టమైన టీచర్ల కొరత ఉండగా, సుమారు 4 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మొత్తంగా చూస్తే, 10 వేలకు పైగా పాఠశాలలు ఉపాధ్యాయుల కొరతతో ఇబ్బందులు పడుతున్నాయి. ఈ గణాంకాలే ప్రభుత్వ హామీలకు, వాస్తవానికి మధ్య

**ఉన్న అంతరాన్ని బహిర్గతం చేస్తున్నాయి.**

ఈ పరిస్థితుల కారణంగా దాదాపు 5 లక్షల మంది విద్యార్థులు విద్యాపరంగా నష్టపోతున్నారు. ఇలాంటి క్లిష్ట సమయంలో కూడా పెద్ద సంఖ్యలో టీచర్లు డిప్యూటేషన్‌పై ఉండటం మరింత ఆందోళనకరం. 2023 నుంచి ఇప్పటివరకు సుమారు 15 వందల నుంచి 4 వేల మంది టీచర్లు డిప్యూటేషన్‌పై ఉన్నారని అంచనా. ఒకవైపు టీచర్లు లేని పాఠశాలలు ఉండగా, మరోవైపు అవసరం లేని చోట్లకు టీచర్లను డిప్యూటేషన్‌పై పంపించడం స్పష్టమైన పరిపాలనా లోపమేనని చెప్పాల్సి వస్తోంది. సమస్య కేవలం టీచర్ల కొరతలో మాత్రమే లేదు; వారిని సరైన విధంగా కేటాయించకపోవడమే అసలు మూల కారణం. కొన్ని పాఠశాలల్లో టీచర్లు అవసరానికి మించి ఉండగా, మరికొన్ని పాఠశాలలు కనీస సిబ్బంది లేక నడవడం విచారకరం. ఒకచోట అధికం, మరోచోట కొరత..ఈ అసమాన పరిస్థితి విద్యా వ్యవస్థలో సమతుల్యత లేకపోవడాన్ని బలంగా నిరూపిస్తోంది. దీనిని సరిచేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉంది. అయితే డిప్యూటేషన్ అనే తాత్కాలిక మార్గాన్ని అధికంగా ఉపయోగించడం వల్ల సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకకుండా, మరింత జఠిలం చేస్తోంది

**డిప్యూటేషన్ వ్యవస్థపై వస్తున్న విమర్శలు కూడా** తక్కువేమీ లేవు. ఉన్నతాధికారులతో పరిచయాలు, రాజకీయ పలుకుబడి ఆధారంగా కొంతమంది టీచర్లు తమకు అనుకూలమైన పట్టణ ప్రాంతాలకు వెళ్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యక్తిగత సౌకర్యాలు, పిల్లల విద్య, సులభమైన జీవనశైలి కోసం డిప్యూటేషన్‌ను వినియోగించడం సాధారణ ధోరణిగా మారింది. ఈ ప్రక్రియలో నిజాయితీ, పారదర్శకత లేకపోవడం, సందేహాస్పదంగా మారడం పరిస్థితిని మరింత క్లిష్టం చేస్తోంది. ముడుపుల ఆరోపణలు వినిపించడం ఈ వ్యవస్థపై నమ్మకాన్ని మరింత దెబ్బతీస్తోంది. డిప్యూటేషన్ వల్ల అసలు నష్టం విద్యార్థులకే జరుగుతోంది. ఒక పాఠశాల నుంచి టీచర్‌ను పంపిస్తే తరలిస్తే, అక్కడి పిల్లలు చదువులో వెనుకబడిపోవడం జరుగుతోంది.మరోవైపు ఇప్పటికే టీచర్లు సరిపడా ఉన్న పాఠశాలలకు అదనంగా పంపించడం వల్ల, ఆ సిబ్బంది పూర్తిస్థాయిలో వినియోగం కాకుండా ఉండిపోతు న్నారు. అంటే ఒకచోట తీవ్ర కొరత, మరోచోట వృథా..ఇది లోప భూయిష్టమైన పరిపాలనకు నిదర్శనం. మానవ వనరులు ఉన్నప్పటికీ వాటిని సక్రమంగా వినియోగించకపోవడం విద్యా వ్యవస్థకు పెద్ద లోపంగా మారుతోంది.

**గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత** ఆందోళనకరంగా ఉంది. ఒకే టీచర్‌తో బహుళ తరగతులను నిర్వహించాల్సిన పరిస్థితి సర్వ సాధారణమవుతోంది. సబ్జెక్ట్ టీచర్లు లేకపోవడం వల్ల విద్యార్థులు ప్రాథమిక స్థాయిలోనే విద్యపై పట్టు కోల్పోతున్నారు. దీని ప్రభావం క్రమంగా పెరిగి విద్యా నాణ్యతను దెబ్బతీస్తోంది. డ్రాప్‌ఔట్ సమస్య మళ్లీ తలెత్తే ప్రమాదం కనిపిస్తోంది. ఒకవైపు ప్రభుత్వం విద్యార్థుల చేరికలను పెంచేందుకు కృషి చేస్తుండగా, మరోవైపు టీచర్ల సరైన కేటాయింపు లేకపోవడం వల్ల అదే విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతోంది. డిప్యూటేషన్ సమస్యను తాత్కాలిక పరిష్కారంగా కొనసాగించడం ఇక సాధ్యం కాదు. ఇది నియంత్రణ లేకుండా సాగితే, విద్యా వ్యవస్థలోని అసలు బలాన్ని దెబ్బతీసే శాశ్వత లోపంగా మారుతుంది. అందుకే ప్రభుత్వం వెంటనే స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాలి.. అవసరం లేని డిప్యూటేషన్లను రద్దు చేయడం,

టీచర్లను బోధనకే పరిమితం చేయడం, ఖాళీలను వేగంగా భర్తీ చేయడం అత్యవసరం. అధికారులు ఈ వ్యవస్థను బాధ్యతగా పర్యవేక్షించాలి. టీచర్లు కూడా తమ ప్రాథమిక విధిని గుర్తించి తరగతి గదికి ప్రాధాన్యం ఇవ్వాలి. చివరగా ఒక విషయం స్పష్టం.. పాఠశాలలో టీచర్ లేకపోవడం అంటే ఖాళీ తరగతి మాత్రమే కాదు, అది నేరుగా విద్యార్థి భవిష్యత్తును ప్రభావితం చేసే తీవ్రమైన లోటు. ఇప్పుడే చర్యలు తీసుకోకపోతే, కలిగే నష్టం తిరిగి సరిచేయలేనిది అవుతుంది.

# మాజీ సైనికుడి మద్యం వ్యాపారం గుట్టురట్టు!

**హైదరాబాద్, ఏప్రిల్ 22, పెన్ పవర్:**
హైదరాబాద్‌కు చెందిన ఓ సైనిక ఉద్యోగి వివిధ ఆర్మీ క్యాంటీన్ల నుంచి మద్యం తీసుకొచ్చి అమ్ముతున్న గుట్టు బయటపడింది. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు చేపట్టిన ఆపరేషన్‌లో అతని వద్ద ఉన్న 10 లక్షల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మద్యాన్ని అర్మీ క్యాంటీన్ల నుంచి తక్కువ ధరకు తీసుకొచ్చి సిటీలో అధిక ధరకు అమ్ముతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యాపారం చేస్తున్న వ్యక్తి ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. అతని కోసం అధికారులు గాలిస్తున్నారు. అధికారుల చెప్పిన వివరాలు ప్రకారం ప్రీమియం మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సీసాలను బెంగళూరు, హర్యానాలోని ఆర్మీ క్యాంటీన్ల నుంచి తీసుకొచ్చినట్టు ఆరోపణలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం ఆర్మీ క్యాంటీన్ల నుంచి తీసుకొచ్చి బాటిళ్లు ఆయా వ్యక్తులు మాత్రమే వినియోగించడానికి అనుమతి ఉంది. కానీ ఈ సీరాలను వేరే వ్యక్తులకు అమ్మడానికి లేదు. కానీ సదరు వ్యక్తి విక్రయించినట్టు గుర్తించారు.ఈ కేసులో దొడ్ల సురేష్ రెడ్డి అనే వ్యక్తి ప్రధాన నిందితుడిగా గుర్తించారు. ఆర్మీ నుంచి రిటైర్ అయిన తర్వాత ఈ పని చేస్తున్నట్టు వెల్లడించారు. ఈ నెట్‌వర్క్‌ను నడపడానికి అతను తన సైనిక సంబంధాలను ఉపయోగించుకుంటున్నాడని, చాలా కాలంగా ఈ అక్రమ వ్యాపారంలో పాలుపంచుకున్నట్టు దర్యాప్తులో తేలింది. పక్కా సమాచారం ఆధారంగా ఈ ఆపరేషన్ చేపట్టారు. జీవన్ కిరణ్ సుభాష్ చందర్ అఖిల్‌తో కలిసిన ఎక్సైజ్ శాఖ టీం ఈ ఆపరేషన్ చేపట్టింది. హస్తినాపురంలోని శ్రీరమణ కాలనీ ఫేజ్ టూలో ఉన్న ఒక ఇంటిపై దాడి చేసిందీ టీం. ఈ దాడిలో భారీ సంఖ్యలో మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఇది కేవలం ఒక వ్యక్తికి సంబంధించిన విషయం కాదని, దీని వెనుక ఒక ఆర్గనైజ్డ్ నెట్‌వర్క్ ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ అక్రమ సరఫరా చైన్‌లో ఇంకా ఎవరైనా ఉన్నారా అన్న కోణంలో దర్యాప్తు సాగుతోంది. వారి వివరాలపై ఆరా తీస్తున్నారు. ఈ ఘటన డిఫెన్స్ క్యాంటీన్‌లో జరుగుతున్న చట్టవిరుద్ధ కార్యకలాపాలపై మరోసారి ప్రశ్నలు లేవనెత్తుతోంది. ఇలాంటి కేసుల్లో కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ శాఖ స్పష్టం చేసింది. ప్రస్తుతం పరారీలో ఉన్న నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. వారు దొరికిన తర్వాత మరిన్ని వివరాలు ఈ కేసులో వెలుగు చూసే అవకాశం ఉందని అంటున్నారు.

# ఏప్రిల్ 24 నుంచి స్కూళ్లకు సెలవులు




**విజయవాడ, ఏప్రిల్ 22, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ స్కూల్ విద్యార్థులకు శుభవార్త అందించింది. రాష్ట్రంలోని స్కూళ్లకు ఈ నెల 24వ తేదీ నుండి వేసవి సెలవులను పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. అకడమిక్ కేలండర్ ప్రకారం వెల్లడించిన ఈ సెలవులు పూర్తయిన అనంతరం జూన్ 12న స్కూల్స్ రీఓపెన్ చేయనున్నారు. సెలవుల సమయంలో ఎండ తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉందని ప్రజలకు జాగ్రత్తలు సూచించారు.

చెరువులు, బావులు, కాలువల వద్ద ఈతకు వెళ్లి ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున జిల్లా విద్యాధికారులకు విద్యాశాఖ పలు కీలక సూచనలు జారీ చేసింది.విద్యా సంవత్సరం ముగిసేలోపు అన్నిప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు సమ్మర్ సీజన్‌లో భద్రతా చర్యలపై ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ముఖ్యంగా పెద్దల పర్యవేక్షణ లేకుండాపిల్లలు బావులు, నదులు, చెరువులు, కాలువల వద్దకు వెళ్లకూడదని విద్యార్థులకు స్పష్టం చేయాలని సర్క్యులర్‌లో సూచించింది. ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకుఎండలో బయట తిరగకూడదని, తిరిగితే వచ్చే అనారోగ్య సమస్యలను విద్యార్థులకు వివరించాలని పేర్కొంది.పాఠశాల నోటీసు బోర్డులపై భద్రతా నియమాలను విధిగా ప్రదర్శించడంతో పాటు, తల్లిదండ్రులకుకూడా అవసరమైన సూచనలు చేయాలని ఏపీ స్కూల్ విద్యాశాఖ తెలిపింది. సెలవుల్లో పిల్లలపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా చూడాలని, ఎండ వేడి నుండి వారిని రక్షించుకోవాలని.. అందుకు తగినజాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులను కోరింది. విద్యార్థుల భద్రత దృష్ట్యా ఈ నిబంధనలను కచ్చితంగా పాటించాలని అధికారులు స్పష్టం చేశారు.

# ఏపీ బీజేపీని లైట్ తీసుకుంటున్న అధిష్టానం ఆశలొద్దు.. పనిచేయండి

**విజయవాడ, ఏప్రిల్ 23, పెన్ పవర్:** బీజేపీ ఏపీ నేతలకు ఇక పదవులు దక్కే అవకాశం లేదని పిస్తోంది. ఆంధ్రప్రదేశ్ బీజేపీలో పదవుల కోసం ఆశావహులు చాలా మంది ఉన్నారు. కానీ ఇప్పటి వరకూ కూటమిలో ఉండటంతో వచ్చిన అవకాశాలను ఈ రాష్ట్ర నాయకులతోనే పదవులతో భర్తీ చేస్తుంది. కంభంపాటి హరిబాబుకు గవర్నర్ పదవి వచ్చింది. శ్రీనివాస వర్మకు కేంద్ర మంత్రి పదవి దక్కింది. రాష్ట్ర మంత్రివర్గంలో సత్యకుమార్ యాదవ్ ఉన్నారు. ఎమ్మెల్సీగా సోము వీర్రాజును ఎంపిక చేశారు. మరోసారి రాజ్యసభ సభ్యుడిగా నర్సాపురం నేత వెంకట సత్యనారాయణను ఎంపిక చేసి అందరినీ ఆశ్చర్యంలోముంచెత్తించారు.ఇక రానున్న ఏ పదవుల్లోనూ బీజేపీ రాష్ట్ర నేతలకు అవకాశాలు లేవని చెబుతున్నారు. ఎమ్మెల్సీ పోస్టులు ఖాళీ అయినా దానిపై పెద్దగా కేంద్ర నాయకత్వం ఆసక్తి చూపడం లేదు. ఎమ్మెల్సీ, రాజ్యసభ పదవి కోసం విష్ణు వర్ధన్ రెడ్డితో పాటు పలువురు నేతలు ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నారు. అయితే వచ్చే జూన్ నెలలో ఖాళీ అయ్యే రాజ్యసభ స్థానాల్లో ఒక స్థానం బీజేపీకి లభించనుంది. అందులో తమిళనాడు నేత అన్నామలైకు ఇవ్వాలని ఇప్పటికే నిర్ణయించినట్లు పార్టీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. అన్నామలైను పెద్దల సభకు ఏపీ నుంచి పంపాలని యోచిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ లో ఎంత మొత్తుకున్నా ఇక పార్టీ ఎదిగే పరిస్థితి లేదు. అయినా ఏపీ వల్ల రాజకీయంగా తమకు




కలిగే నష్టం ప్రత్యేకంగా ఏమీ లేదన్న అభిప్రాయంలో కేంద్ర నాయకత్వం ఉన్నట్లు తెలిసింది. టీడీపీతో ఎటూ బీజేపీ పొత్తులో ఉంటుంది. ఒకవేళ వైసీపీ వచ్చినప్పటికీ తమకు కేంద్రంలో మద్దతు లభిస్తుంది. అందువల్ల మిగిలిన రాష్ట్రాల్లో బలం పెంచుకునే ప్రయత్నంలో కేంద్ర నాయకత్వం ఉన్నట్లు తెలిసింది. అందులో భాగంగానే ఇకపై పదవులను రాష్ట్ర నేతలను కాకుండా ఇతర ప్రాంత నేతలకు ఇచ్చే అవకాశాలున్నాయన్నది పార్టీ అత్యున్నత స్థాయి వర్గాల నుంచి అందుతున్న సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. రాజ్యసభ సభ్యుడిగా తెలంగాణకు చెందిన ఆర్. కృష్ణయ్యకు ఇచ్చారు. ఇప్పుడు మరోసారి తమిళనాడుకు చెందిన అన్నామలైకు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. మరి ఏపీ బీజేపీ నేతలకు ఇది షాకింగ్ వార్త అనే చెప్పాలి.

# టీడీపీ, జనసేనల మౌనం ఎందుకో...

**విజయవాడ, ఏప్రిల్ 23, (పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లో కూటమి పార్టీల మధ్య ఎక్కడా సఖ్యత కనిపించడం లేదు. ఇది నిజంగా పార్టీ నాయకత్వానికి తెలిసీ మౌనంగా ఉంటుందా? లేకపోతే ఎన్నికల నాటికి సర్దుకుంటాయని భావిస్తుందో తెలియదు కాని రోజురోజుకూ మూడు పార్టీల మధ్య విభేదాలు మాత్రం పెరుగుతూనే ఉన్నాయి. నేతల మధ్య సమన్వయం చేసే వారు లేరు. పార్టీ క్రమశిక్షణ కమిటీలు కూడా పెద్దగా పట్టించుకోవడం లేదు. దీంతో కూటమి నేతల పోరాటాలు వీధిపోరాటాలుగా మారాయి. అంతెందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహించే పిఠాపురం నియోజకవర్గంలోనే టీడీపీ, జనసేన నేతల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా ఉంది. రెండు పార్టీలూ కలవలేనంతగా విడిపోయాయి.రాష్ట్ర స్థాయిలో చంద్రబాబు, పవన్ కల్యాణ్ ల మధ్య మంచి అవగాహన ఉంది. ఇరువురూ ఒకరినొకరు సంప్రదించుకుంటూ ఎవరినీ నొప్పించకుండా నిర్ణయం తీసుకుంటున్నారు. కానీ పవన్ కల్యాణ్ ఎమ్మెల్యేగా ఎన్నికయిన పిఠాపురం నియోజకవర్గంలోనే ఈ పరిస్థితి ఎందుకు వచ్చిందన్న ప్రశ్నకు మాత్రం ఎవరి వద్దా సమాధానం దొరకడం లేదు. ప్రభుత్వ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటో పెట్టకపోవడంపై మాజీ ఎమ్మెల్యే వర్మ మండిపడ్డారు. అధికారులపై ఆయన ఫైర్ అయ్యారు. జనసేన ఇన్ ఛార్జి పెండెం దొరబాబుతోనే ఒక్క పవన్ కల్యాణ్ ఫొటో మాత్రమే ఉంచడమేంటని ప్రశ్నించారు. మట్టి తోలుకునే వాడు వచ్చి ఇప్పుడు చెరువులు తవ్వేందుకు



ప్రయత్నిస్తున్నాడని వర్మ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తాము ఇక్కడ పుట్టి పెరగామని, దత్తతకు రాలేదని అనడంతో జనసేన నేతలు మండిపడ్డారుఇటు టీడీపీ కాని, అటు జనసేన కానీ తమ పార్టీ నేతలను సముదాయించే ప్రయత్నాలు చేయకపోవడం, సంధి కుదర్చకపోవడం చూస్తుంటే ఏదో జరుగుతుందన్న అనుమానాలు కలుగుతున్నాయి. పిఠాపురంలోనే తాను మరోసారి పోటీ చేయాలని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. అదే సమయంలో కూటమి పదిహేనేళ్ల పాటు కలసి ఉంటుందని చెబుతున్నప్పటికీ స్థానిక నాయకత్వాన్నిపిలిచి మాట్లాడలేకపోతున్నారు. మరొకవైపు చంద్రబాబు కూడా వర్మ అండ్ కోను కంట్రోల్ లో పెట్టకపోవడం చూస్తుంటే ఈ విభేదాలు ఇలాగే సాగిపోనీ.. తమకు వీరివల్ల నష్టం ఏమీ ఉండదన్న భరోసాలో ఉన్నట్లుంది. మొత్తం మీద పిఠాపురం నియోజకవర్గం వ్యవహారం మాత్రం పార్టీ నేతలకు ఎలా ఉన్నా... కూటమి అభిమానులకు మాత్రం కలవర పెడుతున్నాయి.

# వైసీపీలోకి వెంకట్రామరెడ్డి..

**విజయవాడ, ఏప్రిల్ 23,పెన్ పవర్:** ఏపీలో ఒక విచిత్ర వాతావరణం నడిచింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ప్రజలు తిరస్కరించారు. కానీ చాలామంది చదువుకున్న వారు, ఉద్యోగాలు చేస్తున్నవారు ముందుగా జగన్మోహన్ రెడ్డికి మద్దతు చెబుతుంటారు. అయితే అది వారి వ్యక్తిగతం కానీ కొందరు ఉద్యోగులు బాహటంగానే నిబంధనలకు విరుద్ధంగా రాజకీయాలు చేస్తుంటారు. అటువంటి వారికి ఉద్యోగ సంఘం మాజీ నేత వెంకట్రామిరెడ్డి ఎపిసోడ్ చక్కటి ఉదాహరణ. ఆయనకి ఇంకా 15 సంవత్సరాల సర్వీస్ ఉంది. మంచి ఉద్యోగ జీవితం ఉండేది. కానీ దానిని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం పణంగా పెట్టారు వెంకట్రామిరెడ్డి. జగన్మోహన్ రెడ్డిని మరోసారి సీఎం చేయాలన్న కోణంలో ఉద్యోగ సంఘం నేత ముసుగులో ఆయన చేయని ప్రయత్నం లేదు. ఉద్యోగ నిబంధనల ప్రకారం ఆయన పై వేటు వేసింది కూటమి ప్రభుత్వం. ఉద్యోగిగా డిస్మిస్ అయిన ఆయనకు ప్రభుత్వం నుంచి ఎటువంటి బెనిఫిట్స్ దక్కవు. అయితే ఆయనకు జగన్మోహన్ రెడ్డి ఏ రూపంలో సాయం చేస్తారు అనేది ఇప్పుడు ప్రశ్న.గతంలో చాలామంది ఉద్యోగులతో పాటు అధికారులకు పదవులు ఇచ్చారు జగన్మోహన్ రెడ్డి వారు తమ ఉద్యోగాలకు స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన తర్వాత పార్టీలోకి రప్పించి ఎంపీ తో పాటు ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చారు. గెలిపించి చట్టసభలకు పంపించారు. ఇప్పుడు వెంకట్రామిరెడ్డి ని కూడా అలానే పొలిటికల్ గా ప్రోత్సహిస్తారా లేదా అనేది చూడాలి. కూటమి ప్రభుత్వం వెంకట్రామిరెడ్డి పై వేటు వేసినప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి విపరీతమైన సానుభూతి వచ్చింది. నేతలు ఒక్కొక్కరు ఆయనకు సంఘీభావం చెబుతూ ట్వీట్లు పెట్టారు. పొన్నవోలు సుధాకర్ రెడ్డి లాంటి వారు అయితే వెంకట్రామిరెడ్డి కోసం న్యాయపోరాటం చేస్తామని చెప్పుకొచ్చారు. అయితే న్యాయపోరాటానికి ఏళ్ల సమయం పడుతుంది. అదే పిలిచి వైసీపీలో ఏదో ఒక పదవి ఇస్తే ఆయన ఖుషి అవుతారు.

గతానికి మించి పార్టీ కోసం పని చేస్తారు.ఒక విధంగా చెప్పాలంటే వెంకట్రామిరెడ్డికి కూటమి ప్రభుత్వం పూర్తిగా స్వేచ్ఛ ఇచ్చింది. ఆయనకు స్వతంత్రత లభించింది. ఎందుకంటే ఉద్యోగ సంఘాల నేత ముసుగులో వైసీపీ కోసం ఆయన పని చేశారు. ఇప్పుడు నిజంగా వైసీపీలో తీసుకొని కీలక బాధ్యతలు కట్టబెడితే రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తారు. జగన్మోహన్ రెడ్డి నిర్ణయమే ఫైనల్. త్వరలో వెంకట్రామిరెడ్డికి వైసీపీలోకి రప్పించి కీలక పదవి కట్టబెట్టే ప్రయత్నాలు ఉన్నట్లు చర్చ నడుస్తోంది. మరి అందులో వాస్తవం ఎంత ఉందో చూడాలి.

# విజయనగరం జిల్లాపై ప్లాన్..

**విజయనగరం, ఏప్రిల్ 23, పెన్ పవర్:** : ఏపీలో మరోసారి అధికారంలోకి వస్తామని భావిస్తోంది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ. అధికార కూటమికి గట్టి సవాల్ విసురుతూనే ఉంది. దానికి కారణం బలమైన జిల్లాలు ఆ పార్టీ నేతలకు పట్టుకొమ్మలుగా నిలుస్తూ వచ్చాయి. వచ్చే ఎన్నికల్లో ఆ జిల్లాల్లో ఏకపక్షంగా సీట్లు గెలవడం ద్వారా అధికారంలోకి రావచ్చు అనేది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆలోచన. అయితే దానికి విరుగుడు సీఎం చంద్రబాబుతో పాటు లోకేష్ కనిపెట్టారు. ఎక్కడెక్కడ అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి బలం ఉందో ఆ జిల్లాలపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. ఏదో దూకుడుగా రాజకీయాలు చేయడం కాదు.. క్షేత్రస్థాయిలో పార్టీ పట్టును అమాంతం పెంచాలన్నది ప్రణాళికగా తెలుస్తోంది. మొన్నటి టిడిపి కార్యవర్గాల ప్రకటన వెనుక ఈ వ్యూహం స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా విజయనగరం లాంటి జిల్లాల విషయంలో చంద్రబాబు ఆలోచన ఇప్పుడు చర్చకు దారితీస్తోంది. పక్కా ప్రణాళిక అన్నట్టు పరిస్థితి ఉంది. గత కొంతకాలంగా విజయనగరం జిల్లాను గమనిస్తున్న లోకేష్ మార్కు కనిపిస్తోంది ఈ కూర్పులో.కుల రాజకీయాలను అడ్డం పెట్టుకుని బొత్స రాణించారు విజయనగరం జిల్లాలో కాంగ్రెస్ పార్టీతో పాటు వైసీపీలో తనకంటూ ఒక క్రియాశీలక పాత్ర పోషించి జిల్లాను శాసించారు. తన కుటుంబాన్ని మోహరించి జిల్లాను గుత్తాధిపత్యం లో ఉంచుకున్నారు. వ్యవస్థల్లో సైతం తన మనుషులను ఏర్పాటు చేసుకున్నారు. ఏ పార్టీ అధికారంలో ఉన్న.. ఏ ప్రభుత్వం ఉన్నా తన మాట చెల్లుబాటు అయ్యేలా చేసుకున్నారు. అయితే దీనిని గ్రహించారు చంద్రబాబు. కానీ అశోక్ గజపతిరాజు లాంటి సౌమ్యుడుతో రాజకీయాలు చేసి బొత్సకు చెక్ పెట్టారు కానీ.. ఆయన మూలాలను దెబ్బతీయ లేక పోయారు. అయితే ఇప్పుడు అశోక్ గజపతి రాజును గవర్నర్ లాంటి రాజ్యాంగబద్ధ పదవిలోకి పంపించి.. ఆయనను ఎంతగానో గౌరవం ఇచ్చారు. కుమార్తె అదితి గజపతిరాజుకు ఎమ్మెల్యే పదవి ఇచ్చి రాజకీయ లోటును కూడా తీర్చారు. ఇప్పుడు బొత్స పై అసలు సిసలు రాజకీయం మొదలుపెట్టారు చంద్రబాబు, నారా లోకేష్.మొన్నటి ఎన్నికల్లో క్రియాశీలక రాజకీయాల నుంచి తప్పుకున్నారు అశోక్ గజపతిరాజు. గత నాలుగు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీ జిల్లా బాధ్యతలను ఆయనే చూసేవారు. అయితే జిల్లా కోసం తన సొంత ఆస్తులను సైతం వదులుకున్నారు. అయినా సరే అక్కడ కుల సమీకరణలతో బొత్స తన ప్రాబల్యాన్ని పెంచుకున్నారు. సంప్రదాయ రాజకీయాన్ని నమ్ముకున్న అశోక్ గజపతిరాజు అదే రీతిలో ముందుకు సాగారు. కానీ జిల్లాలో ప్రాబల్య సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బొత్స మాత్రం క్షేత్రస్థాయిలో తన పట్టును పెంచుకున్నారు. ఎప్పుడైతే అశోక్ గజపతిరాజు పక్కకు వెళ్లారో .. అప్పటినుంచి చంద్రబాబు మార్పు రాజకీయం ప్రారంభం అయింది. ముల్లును ముల్లుతోనే తీయాలి అన్న కోణంలో బొత్సకు అదే సామాజిక వర్గంతో చెక్ పెట్టడం ప్రారంభించారు. తూర్పు కాపు సామాజిక వర్గానికి ఎనలేని ప్రాధాన్యమిచ్చారు. పార్టీ కార్యవర్గాలలో తూర్పు కాపుల ప్రాతినిధ్యం పెంచారు. బొత్సకు ధీటుగా ఒక సైన్యాన్ని తయారు చేసే పనిలో పడ్డారు.కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే యువనేత కిమిడి నాగార్జునను పిలిపించుకున్నారు చంద్రబాబు, లోకేష్. బొత్స హవా కు బ్రేక్ వేయాలంటే దూకుడుగా వ్యవహరించాల్సిందేనంటూ తేల్చి చెప్పారు. అది మొదలు నాగార్జున గట్టిగానే బొత్స అండ్ కోకు సమాధానాలు చెబుతున్నారు. మరోవైపు యువనేత కొండపల్లి శ్రీనివాస్ కు మంత్రి పదవి ఇచ్చారు. మరింత దూకుడు పెంచాలని ఆదేశించారు. తాజాగా తెలుగుదేశంలో విధానపరమైన నిర్ణయాల్లో అత్యున్నతంగా భావించే పొలిట్ బ్యూరోలో తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన గంటెడ శ్రీదేవికి చాన్స్ ఇచ్చారు. మరోవైపు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ను ప్రయోగిస్తున్నారు. కళా వెంకట్రావు సీనియర్ రెడ్డిని ఉపయోగించుకుంటున్నారు. ఆయన కుమారుడు రామ్ మల్లిక్ నాయుడును సైతం రంగంలోకి దించారు. ఈ పరిస్థితులన్నీ చూస్తుంటే మాత్రం బొత్స ఫ్యామిలీకి దీటుగా ఒక సైన్యాన్ని తయారు చేస్తున్నారు చంద్రబాబు, లోకేష్. అయితే వీరి ధాటికి బొత్స ఫ్యామిలీ తోక ముడియక తప్పదు అని విశ్లేషకులు భావిస్తున్నారు.

## పిఠాపురం ఎపిసోడ్ లో కొత్త ట్విస్టులు

# రంగంలోకి దొరబాబు..

**కాకినాడ, ఏప్రిల్ 23, పెన్ పవర్:** ఏపీలో కూటమిలో భాగంగా పవన్ కల్యాణ్ కోసం సీటు త్యాగం చేసిన నేతగా పేరు తెచ్చుకున్న ఆయన..అప్పుడప్పుడు న్యూస్ ఇంట్రెస్టింగ్ సీన్స్‌కు తెరలేపుతున్నారట. జనసేనాని కోసం టికెట్ వదులుకోవడం వల్ల ఆయనకు ఓ రేంజ్‌లో ఎలివేషన్ వచ్చినా..ఆ తర్వాత పొలిటికల్ మైలేజ్ మాత్రం జీరో అన్నట్లు అయిపోందట. ఎమ్మెల్సీ అని..నామినేటెడ్ పోస్ట్ అని.. ఇలా ఎన్నో లీక్స్ వచ్చినా..ఇప్పటివరకు ఆయనకు ఏ పదవి దక్కలేదు. దీంతో అప్పుడప్పుడు ఆయనలోని అసంతృప్తిని క్యామియో రోల్‌లో చూపిస్తున్నారట.నిజానికి వర్మకు ఎలాంటి ప్రోటోకాల్ లేదు. పిఠాపురంలో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటున్నారు. అక్కడే ఏదో ఒక టాపిక్‌ను ఎత్తుకుని..ఇదేం పద్ధతి అంటూ అధికారులపై ఫైర్ అవుతున్నారు. ఇప్పటికే ఓసారి ఫ్లెక్సీలో చంద్రబాబు ఫోటోను చిన్నగా వేశారని అధికారులపై ఆయన సీరియస్ అవడం పొలిటికల్ హాట్ టాపిక్ అయింది. ఇప్పుడు మరోసారి పిఠాపురం అభివృద్ధి కమిటీ సమావేశంలో ఫ్లెక్సీలో సీఎం ఫోటో లేదంటూ రాద్ధాంతం చేశారు.అయితే ఇప్పటికి రెండుసార్లు సీఎం చంద్రబాబు ఫోటో కోసమే వర్మ గళం వినిపిస్తున్నట్లు పైకి ప్రచారం జరుగుతున్నా ఆయన మాటల వెనుక మర్మమేంటన్నది ఎవరికి అంతుచిక్కట్లేదట. సీటు త్యాగం చేసినా..తనకు ఏ పదవి రాలేదనే ఫ్రస్ట్రేషన్‌లో ఉన్న వర్మ..తన అసంతృప్తిని మరో రూపంలో బయటపెడుతున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. కక్కలేక మింగలేక అన్నట్లుగా తన ఆవేదనను నిరసనగా మార్చేస్తున్నారన్న టాక్ నడుస్తోంది.ఇక వర్మ బాధ ఒకటి అయితే..జనసేన నేత, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు కథ మరోలా ఉందట. 2004లోనే ఆయన ఫస్ట్ టైమ్ ఎమ్మెల్యే. ఆ తర్వాత 2019లో వైసీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. అప్పట్లో జగన్ దగ్గర ఆయన మాట బాగా చెల్లుబాటయ్యేదన్న టాక్ ఉంది. ఆ తర్వాత 2019లో వంగా గీతకు వైసీపీకి టికెట్ ఇవ్వగా.. ఆమె గెలుపు కోసం పనిచేసినా విజయం దక్కలేదు. 2024 ఆగస్ట్‌లో పెండెం దొరబాబు జనసేనలో చేరిపోయారు. ఆయన కూడా టూ టైమ్స్ ఎమ్మెల్యే, పైగా సీనియర్ లీడర్..ఈ నేపథ్యంలో తనకు కూడా ఏ పదవి లేకపోవడం ఆయన మదిని తొలిచేస్తుందట. అందుకే వర్మకేనా ఎలివేషన్..పిఠాపురంలో తాను కూడా ఉన్నానంటూ ఇది దొరబాబు సవాల్ అంటూ రెచ్చిపోతున్నారట. ఈ క్రమంలోనే ఏకంగా వర్మను టార్గెట్ చేసి పవన్ మదిలో చోటు కోసం ఆరాట పడుతున్నారటదొరబాబు పిఠాపురంలో వైసీపీ కోవర్టు అని వర్మ అంటుంటే..వర్మ చీకటి బాగోతాలు అంటూ దొరబాబు రచ్చకు తెరలేపారట. అయితే ఈ ఇద్దరిది సీరియస్ ఫైట్ కాదని..ఏదో ఒక బెర్త్ కోసమే రచ్చ చేస్తున్నారని పిఠాపురం పబ్లిక్‌లో చర్చ జరుగుతోందట. వర్మ త్యాగానికి ఏదో ఒక పదవి దక్కితే బాగుండనే చర్చ అందరిలో ఉన్నా..దొరబాబు ఎపిసోడ్‌పై జనంలో డిఫరెంట్ ఒపీనియన్స్ వ్యక్తం అవుతున్నాయట.రాజకీయ నాయకులు ఏదీ డైరెక్ట్ గా చెప్పరు. తన మీద ఒక్క అవినీతి అక్రమాల ఆరోపణలు రుజువు చేసినా రాజకీయ సన్యాసం స్వీకరిస్తాను అని దొరబాబు మీడియా ఎదుట సవాల్ చేశారు. తన మీద ఆరోపణలు చేసిన వారు నిరూపించాలని ఆయన డిమాండ్ చేశారు. పిఠాపురంలో ఒక్క విషయంలో కూడా తాను అవినీతి చేయలేందని ఆయన అన్నారు. తనది మచ్చ లేని జీవితం అన్నారు. తాను నిజానికి రాజకీయాల నుంచి తప్పుకోవాలనే అనుకున్నానని అయితే పవన్ కళ్యాణ్ మీద అభిమానంతో జనసేనలో చేరాను అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేనను మంచి మెజారిటీతో గెలిపిస్తామని ఆయన చెప్పారు. అంతే కాదు వర్మ అండ్ కో చేస్తున్న ఆరోపణల మీద తాను పూర్తి వివరణ ఇస్తాను అని అదే విధంగా వారి విషయంలో కూడా పూర్తి గుట్టు విప్పుతాను అని స్పష్టం చేశారు. అయితే ఒకే పార్టీలో ఉంటూ ఒకరి గుట్టు మరొకరు విప్పుకుంటామని చెప్పడంతో కూటమిలో అలజడి రేగుతోంది. వర్మ అయితే దొరబాబు స్కాములను బయట పెడతామని అంటున్నారు. ఆయనకు జనసేనతో సంబంధం లేదని కేవలం తాను చేసిన అవినీతిని కప్పుపుచ్చుకోవడానికే ఆ పార్టీలో చేరారు అని వర్మ విమర్శించారు. అదే విధంగా వర్మ గుట్టు తన దగ్గర ఉందని దొరబాబు అంటున్నారు. ఇలా ఇద్దరూ మీడియాకు ఎక్కడంతో పార్టీ పెద్దలు తలలు పట్టుకుంటున్నారు. ఈ విధంగా కీలక నేతలు మాజీ ఎమ్మెల్యేలు వీధిన పడితే పోయేది కూటమి పరువే అని అంటున్నారు.పొలిటికల్ లీడర్ల మాటల వెనుక మర్మం వేరులే అన్న ఒపీనియన్ ఉండనే ఉంది. ఇప్పుడు ఈ ఇద్దరి నేతల విమర్శలు, ప్రతి విమర్శల వెనుక పకడ్బందీ స్కెచ్ ఉందట. బాబు మదిలో చోటును పదిలం చేసుకునే ప్రయత్నంలో వర్మ..జనసేనాని మెప్పుకోసం దొరబాబు..రాజకీయాన్ని రక్తి కట్టిస్తున్నారట. ఇలా ఆ ఇద్దరి అసంతృప్తికి, ఆవేదనకు కారణం వేరైనా..కంటెంట్ మాత్రం బాగుందన్న డిస్కషన్ నడుస్తోంది.

# పోలవరం ప్రాజెక్టుపై కేంద్రం కీలక నిర్ణయం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 23, పెన్ పవర్:** ఏపీ జీవనాడి పోలవరం ప్రాజెక్టుపై కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రాజెక్టును 45.72 మీటర్ల ఎత్తు మేర నిర్మించేందుకు సమ్మతి తెలిపింది. ఈ మేరకు పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) తొలిసారిగా స్పష్టమైన ప్రకటన చేసింది. కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు గత నెల 25న ప్రాజెక్టును సందర్శించారు. అనంతరం గరిష్ట నీటి నిల్వ సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకు పీపీఏ వెబ్ సైట్ లో పోలవరం ఎత్తు కేవలం 41.15 మీటర్లుగానే చూపేవారు. 115 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో పోలవరం ప్రాజెక్టును నిర్మిస్తున్నట్లు ఆ వెబ్ సైట్ లో ఉండేది అయితే తాజాగా పోలవరం ప్రాజెక్టు అథారిటీ వెబ్ సైట్ లో ప్రాజెక్టు వివరాల్లో పూర్తిగా మార్పులు చేశారు. ప్రాజెక్టు ఎత్తు 45.72 మీటర్లుగా చూపడమే కాకుండా, గరిష్ట నిల్వ 194.60 టీఎంసీలుగా పేర్కొన్నారు. దీంతో పోలవరం ప్రాజెక్టు రెండో దశ చేపట్టేందుకు కేంద్రం సానుకూలంగా ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం 41.15 మీటర్ల ఎత్తు ఉన్న ప్రాజెక్టును 45.72 మీటర్లకు పెంచాలంటే కేంద్రం తరఫున పలు కార్యక్రమాలు చేయాల్సివుంటుందని చెబుతున్నారు. కేంద్ర అటవీ పర్యావరణ అనుమతులు, స్టాప్ వర్క్ ఆర్డర్ ఎత్తివేత వంటి చర్యలు తీసుకోవాల్సివుంటుందని చెబుతున్నారు. గరిష్ట కాంటూరు 45.72 మీటర్లు ఎత్తు పెంచితే ప్రాజెక్టు రూపురేఖలు మారిపోనున్నాయని అంటున్నారు. ప్రస్తుతం పోలవరం మొదటి దశ పనులు చివరికి చేరుకున్నాయని అంటున్నారు. వచ్చే ఏడాది జూన్ లో నిర్వహించే గోదావరి పుష్కరాలకు ముందుగానే ప్రాజెక్టును జాతికి అంకితం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం అడుగులు వేస్తోంది. దీంతో కేంద్రం రెండో దశ పనుల విస్తరణపై దృష్టి పెట్టినట్లు చెబుతున్నారు. కాగా, 45.72 మీటర్ల ఎత్తుతో 194.6 టీఎంసీల చొప్పున రెండు దఫాలుగా నీటిని నిల్వ చేసుకోవచ్చునని అంటున్నారు. అంటే ప్రాజెక్టు ద్వారా మొత్తం 389.2 టీఎంసీల నీరు రాష్ట్ర అవసరాలు తీర్చేందుకు ఉపయోగపడుతుందని చెబుతున్నారు.గరిష్ట కాంటూరు కూడా పూర్తయితే గోదావరి డెల్టాలో మొత్తం 10.13 లక్షల ఎకరాలు, 13 లక్షల కృష్ణా డెల్టాకు పుష్కలంగా సాగునీరు అందుతుందని అంచనా వేస్తున్నారు. అదేవిధంగా కృష్ణా బేసిన్ లో 80 టీఎంసీలు నీటిని సరఫరా చేస్తారని, ఇందులో 23.44 టీఎంసీలు పారిశ్రామిక అవసరాలు తీర్చేందుకు ఉపయోగపడతాయని చెబుతున్నారు. అదేవిధంగా మొత్తం 28.5 లక్షల మందికి సాగునీటి సమస్య తీరుతుందని, 960 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని చెబుతున్నారు. ఇక పోలవరం ప్రాజెక్టు రెండో దశకు ప్రభుత్వం సిద్ధమైతే భూ సేకరణకు భారీగా వెచ్చించాల్సివుంటుందని అధికారులు నివేదికలు సిద్ధం చేస్తున్నారు. ప్రధాన కట్టడాల్లో ఎలాంటి మార్పు ఉండదని, కానీ, నిర్వాసితులకు పరిహారం, సహాయ పునరావాసాల కోసం రూ.28,561 కోట్లు అవసరం అవుతాయని లెక్క గడుతున్నారు. రెండో దశకు 80 వేల ఎకరాలు సేకరించాల్సివుంటుందని, మొత్తం 8 రెవెన్యూ మండలాల్లో 222 రెవెన్యూ గ్రామాలు ముంపునకు గురవుతాయని చెబుతున్నారు.

# కారుమూరికి లిక్కర్ లింక్స్...

**ఏలూరు, ఏప్రిల్ 23, పెన్ పవర్:** ఏపీ లిక్కర్ స్కామ్ డు మరో మాజీ మంత్రికి ఉచ్చు బిగుసుకుంటోంది. ఇప్పటికే సిట్ కారుమూరి ఇంటికి నోటీసులు అంటించగా..వాట్ నెక్స్ట్ అనేది ఉత్కంఠ రేపుతోంది.మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఇప్పటికే పొలిటికల్‌గా యాక్టివ్‌గా లేరు. గత ఎన్నికల్లో ఓడినప్పటి నుంచి ఆయన క్యాడర్ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇది చాలన్నదట్లుగా లిక్కర్ స్కామ్ కేసు ఆయనకు కొత్త చిక్కులు తెచ్చి పెట్టేలా కనిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో మద్యం కుంభకోణం జరిగిందని..అందులో కారుమూరి కుటుంబం కీలక పాత్ర పోషించిందనేది ప్రధాన ఆరోపణ. కారుమూరి కుమారుడు సునీల్, కోడలు కీర్తి అకౌంట్ల నుంచి కోట్ల రూపాయల లావాదేవీలు జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారట.అయితే ఈ కేసు నుంచి తప్పించుకునేందుకు కారుమూరి వేసిన ఎత్తుగడ ఇప్పుడు ఆయన మెడకే చుట్టుకుందన్న ప్రచారం నడుస్తోంది. సిట్ విచారణాధికారికి ఏకంగా లంచం ఇచ్చేందుకు ప్రయత్నించి, కేసు నమోదయ్యేలా చేసుకున్నారన్న టాక్ వినిపిస్తోంది. అధికారులనే కొనేయొచ్చనే అతి విశ్వాసం ఇప్పుడు కారుమూరిని చిక్కుల్లో పడేసిందన్న చర్చ జరుగుతోంది.వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో లిక్కర్ రవాణా కాంట్రాక్టు, టెండర్లలో అక్రమాలపై కారుమూరి, ఆయన కుమారుడు సునీల్‌కు సిట్ నోటీసులు ఇచ్చింది. విజయవాడ కమిషనర్ ఆఫీస్‌లోని సిట్ కార్యాలయంలో హాజరు కావాలని ఆదేశించారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులోని నివాసంలో వారు లేకపోవడంతో అధికారులు ఆ ఇంటి గోడకు నోటీసులు అంటించారు. మద్యం రవాణా చేసే కాంట్రాక్టులో రూ.200 కోట్ల నుంచి 400 కోట్ల వరకు దోచుకున్నారన్న ఆరోపణల నేపథ్యంలో సీఐడీ గత నెలలో కేసు నమోదు చేసింది. అయితే జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా పేరున్న కారుమూరి పేరు లిక్కర్ స్కామ్ కేసులో తెరమీదకు రావడంతో..వైసీపీలో ఆందోళన కనిపిస్తోంది. అటు తణుకు వైసీపీ క్యాడర్ ఇదే సమయమని కారుమూరిపై ఉన్న అసంతృప్తిని బయటపెడుతున్నారట.ఒకప్పుడు తణుకు నియోజకవర్గంలో కారుమూరి మాటే శాసనం. కానీ 2024 ఎన్నికల ఫలితాల తర్వాత సీన్ రివర్స్ అయింది. ఓటమి తర్వాత ఆయన నియోజకవర్గానికి దాదాపు దూరమయ్యారు. ప్రజల సమస్యల సంగతి దేవుడెరుగు..కనీసం క్యాడర్‌కు కూడా ఆయన అందుబాటులో ఉండటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# ఇరాన్ వార్నింగ్.. ఐటీ కంపెనీలకు వణుకు : ఇంటర్నెట్ కేబుళ్ల కట్ చేస్తే ప్రపంచం కల్లోలమే..!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆయిల్ టార్గెట్ అయిపోయింది.. గ్యాస్ పై ఎటాక్ అయిపోయింది.. ఈ రెండింటి దెబ్బకే ఆసియా దేశాలు విలవిలలాడుతున్నాయి. అమ్మ బాబోయ్ అంటున్నాయి., అయినా అణువంత వెనక్కి తగ్గటం లేదు ఇరాన్. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇచ్చే వార్నింగ్స్ ను లెక్కచేయటం లేదు ఇరాన్. ఆయిల్, గ్యాస్ కట్ చేస్తేనే.. హర్మూజ్ జల సంధిని దిగ్బంధిస్తేనే ఆసియా దేశాలు విలవిలలాడుతుంటే.. ఇప్పుడు ఇరాన్ ఇస్తున్న వార్నింగ్ తో ఇప్పుడు ప్రపంచమే అమ్మ బాబోయే అనే రోజులు రాబోతున్నాయి. సముద్ర గర్భంలో ఉన్న ఇంటర్నెట్ కేబుళ్లను నాశనం చేస్తాం.. ఇంటర్నెట్ కేబుళ్లను కట్ చేస్తాం అంటూ ఇరాన్ ఇస్తున్న వార్నింగ్స్ తో ఐటీ కంపెనీలు అన్నీ అల్లాడిపోతున్నాయి.. ఇదే జరిగితే ప్రపంచం ఏం కావాలి.. అల్లకల్లోలమేనా అనే భయం ఇప్పుడు ప్రపంచ దేశాలను వెంటాడుతున్నాయి. కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. పెట్రోల్ మంటలు ఒకవైపు సామాన్యుడిని వేధిస్తుంటే.. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా కోట్ల మందిని డిజిటల్ చీకటిలోకి నెట్టేసే మరో పెను ప్రమాదం ముంచుకొస్తోంది. వ్యూహం మార్చిన ఇరాన్ కేవలం చమురు నౌకలే కాక.. ఇకపై సముద్ర గర్భంలో ఉండే ఇంటర్నెట్ కేబుల్స్ తన తర్వాతి టార్గెట్ అంటూ ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ పరోక్ష సంకేతాలు ఇచ్చింది. ఇది జరిగితే.. మనం వాడుతున్న వాట్సాప్, యూట్యూబ్ నుంచి బ్యాంకింగ్ వ్యవస్థల వరకు అన్నీ నిలిచిపోయే ప్రమాదం ఉంది.

**డిజిటల్ వెన్నెముకపై వేటు..**

ప్రపంచవ్యాప్తంగా డేటా ప్రయాణించే సముద్రగర్భంలోని కేబుల్స్‌కు హార్ముజ్ జలసంధి కీలక కూడలి. యూఏఈ, ఖతార్, సౌదీ అరేబియా వంటి దేశాలను కలిపే ఈ కేబుల్స్ ఇప్పుడు ఇరాన్ టార్గెట్‌లో ఉన్నాయి. ఈ కేబుల్స్ లేదా క్లౌడ్ నెట్‌వర్క్‌లపై చిన్న దాడి జరిగినా ప్రపంచవ్యాప్తంగా ఇంటర్నెట్ వ్యవస్థ కుప్పకూలుతుందని ఇరాన్ అనుబంధ మీడియా కథనాల హెచ్చరించాయి. ఒకవేళ ఇరాన్ ఈ కేబుల్స్‌ను కట్ చేస్తే.. ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాల్లో ఆర్థిక లావాదేవీలు ఆగిపోయి, స్టాక్ మార్కెట్లు కుప్పకూలి, ప్రభుత్వ కార్యకలాపాలు పూర్తిగా స్తంభించిపోతాయి.

**యుద్ధం.. సముద్రం లోపల**

అమెరికా–ఇరాన్ మధ్య కాల్పుల విరమణ అస్థిరంగా ఉన్న తరుణంలో ఈ హెచ్చరికలు రావడం గమనార్హం. బుధవారం ఇరాన్ 3 నౌకలపై కాల్పులు జరిపి, రెండింటిని స్వాధీనం చేసుకుంది. ట్రంప్ కాల్పుల విరమణను పొడిగించినా.. ఇరాన్ పోర్టులపై ఆంక్షలు కొనసాగుతుండటంతో ఇరాన్ ఆగ్రహంతో ఉంది. ఒకవేళ ఈ కోపం ఇంటర్నెట్ కేబుల్స్ వైపు మళ్లితే.. ప్రపంచం కొన్ని దశాబ్దాల వెనక్కి వెళ్లిపోవడం ఖాయం అంటున్నారు నిపుణులు. సో సముద్ర గర్భంలో దాగి ఉన్న ఈ డిజిటల్ బాంబు ఎప్పుడు పేలుతుందో అని ప్రపంచం వణికిపోతోంది.

# ఎన్నికల తర్వాత ప్రజలపై పెట్రోల్ బాంబు: లీటరు రూ.120 దాటుతుందా? కోటక్ సంచన రిపోర్ట్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ నెల ఆఖరి నాటికి దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఎన్నికల ముగింపునకు రాబోతున్నాయి. దీంతో ఇప్పుడు సామాన్యుడి జేబుకు కేంద్ర ప్రభుత్వం మంట పెట్టబోతోందనే వార్తలు సామాన్యులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి ఆర్థికంగా. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 29తో ముగియనుంది. ఆ మరుసటి క్షణమే మోడీ సర్కార్ పెట్రోల్, డీజిల్ ధరలను పెంచవచ్చని కోటక్ ఇన్‌స్టిట్యూషనల్ ఈక్విటీస్ తన రిపోర్టులో పేర్కొంది.

**భారీ పెంపు తప్పదా?**

ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధర బ్యారెల్‌కు 104 డాలర్లకు చేరుకుంది. దీని కారణంగా పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు రూ. 25 నుంచి రూ. 28 వరకు పెంచాల్సి ఉంటుందని బ్రోకరేజ్ సంస్థ అంచనా వేస్తోంది. ప్రస్తుతం లీటరు పెట్రోల్ రూ.94--96 మధ్య ఉండగా.. ఈ పెంపు అమలైతే దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.120 మార్కును దాటిపోతాయని చెబుతోంది. ఇక డీజిల్ రేట్లను కూడా కేంద్రం భారీగానే పెంచుతుందని చెప్పింది.

**కోట్లలో నష్టాలు..**

ఇక్కడ ఆందోళనకరమైన విషయం ప్రభుత్వ రంగ ఆయిల్ సంస్థల నష్టాలు. ప్రస్తుతం చమురు కంపెనీలు ప్రతి నెలా అక్షరాలా రూ.27వేల కోట్లు నష్టపోతున్నాయి. అంటే రోజుకు సుమారు రూ.900 కోట్లు అనమాట. ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని రూ.10 తగ్గించినా, విండ్‌ఫాల్ ట్యాక్స్‌లు వేసినా.. ఈ భారీ నష్టాలను సర్దుబాటు చేసుకునేందుకు ఏమాత్రం సరిపోవటం లేదట.

**ఎందుకీ సంక్షోభం?**

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం, ముఖ్యంగా హార్ముజ్ జలసంధి వద్ద నెలకొన్న ఉద్రిక్తతలు ప్రపంచ క్రూడ్ సరఫరాను దెబ్బతీశాయి. భారత్ తన ఆయిల్ దిగుమతులను 13-15 శాతం తగ్గించుకున్నప్పటికీ, పెరిగిన ధరల వల్ల ప్రతిరోజూ అదనంగా రూ.1,600 కోట్ల నుంచి రూ. 1,750 కోట్ల భారాన్ని మోయాల్సి వస్తోందని తెలింది.

**సామాన్యుడిపై ప్రభావం..**

పెట్రోల్, డీజిల్ ధరల పెంపు ఒక్కసారిగా షాక్ ఇచ్చినట్లుగా కాకుండా.. ఎన్నికలు ముగిసిన తర్వాత విడతల వారీగా ఉండొచ్చని కోటక్ పేర్కొంది. అయినప్పటికీ పెట్రోల్ ధరలు పెరిగితే రవాణా ఖర్చులు పెరిగి పప్పులు, కూరగాయల ధరలు భగ్గుమంటాయి. డెలివరీ ఛార్జీల నుంచి ఆటో సెంటర్ డిమాండ్ వరకు అన్నీ తలకిందులయ్యే అవకాశం ఉంది. మే నెలలో భారతీయుల పర్స్ ఖాళీ అవ్వడం ఖాయమని లెక్కలు హెచ్చరిస్తున్నాయి. భారత ప్రభుత్వం ఈ ఆయిల్ బాంబు నుంచి ప్రజలను ఎలా కాపాడుతుందో చూడాలి మరి.

# ఏడాదికి 50 లక్షల జీతం.. 10 వేల ఫోన్.. ఆటోలో ఆఫీసుకు : ఈ ఐటీ ఉద్యోగి డబ్బంతా ఏం చేస్తుందో తెలిస్తే షాక్..!



**హైదరాబాద్ పెన్ పవర్:** అప్పు చేసి బిర్యానీ తింటున్న రోజులు.. అప్పు చేసి టూర్లకు వెళుతున్న సమాజం.. 10 వేల జీతానికి 20 వేలు అప్పు చేసి ఎంజాయ్ చేస్తున్న కాలం ఇది. అలాంటిది ఏడాదికి 50 లక్షల రూపాయల ప్యాకేజీ వస్తుంది.. ప్రతి నెలా అన్ని కటింగ్స్ పోను చేతికి 3 లక్షల రూపాయలు వస్తుంటే.. ఆ వ్యక్తి ఎలా ఉంటాడో ఊహించుకోండి.. లగ్జరీ కారు.. లగ్జరీ ఇల్లు.. లగ్జరీ వాచీలు.. లగ్జరీ ఐ ఫోన్.. సాయంత్రం అయితే పబ్స్.. వీకెండ్ పార్టీలతో ఎంజాయ్ చేస్తుంటారు కదా. అందరి విషయం ఏమో కానీ.. బెంగళూరులోని ఈ ఐటీ ఉద్యోగిని మాత్రం భిన్నం.. అందరి కంటే విభిన్నం. 50 లక్షల రూపాయల ప్యాకేజీ వస్తున్నా.. 10 వేల రూపాయల ఫోన్ వాడుతోంది. ఆటోలో ఆఫీసుకు వెళుతోంది.. ఒంటిపై బ్రాండెడ్ బట్టలు లేవు.. ఏదో 30, 40 వేల రూపాయల జీతగాడిలా బతుకుతోంది. ఇంతకీ నెలకు 3 లక్షల రూపాయల డబ్బును ఏం చేస్తున్నారు.. ఏ విధంగా ఖర్చు పెడుతున్నారనేది.. ఆ ఐటీ ఉద్యోగిని.. బెంగళూరు టెకీ మాటల్లోనే విందాం..

సాధారణంగా ఐటీ ఉద్యోగం చేసే వాళ్లు ఎలా ఉంటారు, ఏం కొంటారు, ఎలా లైఫ్ ఎంజాయ్ చేస్తారో మనందరికీ తెలిసిందే. కానీ ఈ 27 ఏళ్ల డేటా ఇంజినీర్ కథ వింటే లైఫ్ స్టైల్ అంటే ఆడంబరం కాదు.. ఆర్థిక భద్రత అని అర్థమవుతుంది. ఏటా రూ.50 లక్షల ప్యాకేజీ అందుకుంటున్నా, ఆమె ఎంచుకున్న సాదాసీదా లైఫ్ స్టైల్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అయింది.

వందల కోట్లు ఉన్నా అంబానీలు సింపుల్‌గా ఉంటారని వింటాం. కానీ నెలకు రూ. 3 లక్షల జీతం వచ్చే ఈ యువతి కూడా అదే బాటలో నడుస్తోంది. ఆమె వద్ద ఎటువంటి లగ్జరీ వస్తువులూ లేవు. తన దగ్గర డబ్బు ఉంది కదా అని ఇతరులను మెప్పించడానికి ఖర్చు చేయను ఉంటోంది సదరు టెక్కీ. తనకు అనుభవాలు ముఖ్యమని, అలంకారాలు కాదని ధీమాగా చెబుతోంది. చాలామంది జీతం పెరగగానే ఈఎంఐల మోత మోగిస్తుంటే.. ఈమె మాత్రం అనవసర ఖర్చులకు ఆమడ దూరంలో ఉంటూ మోడ్రన్ ఏజ్ లైఫ్ బిహేవియర్ రూల్స్ పక్కన పడేసి నేటి యువతను ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

**కన్నవారికి ఇల్లు.. భవిష్యత్తుకు భరోసా**

ఆమె సంపాదన వెనుక ఒక స్పష్టమైన లక్ష్యం ఉంది. తనను చదివించి ప్రయోజకురాలిని చేసిన తల్లిదండ్రుల కోసం ఒక ఇల్లు కొనుగోలు చేసింది. దానికి ప్రతి నెలా రూ.30 వేల ఈఎంఐ చెల్లిస్తూ తన బాధ్యతను నెరవేరుస్తోంది. ఇది తన జీవితంలో అత్యంత సంతృప్తినిచ్చిన నిర్ణయమని గర్వంగా చెబుతోంది. ఆడంబరాలకు పెట్టే ఖర్చును తగ్గించి.. కన్నవారి కళ్లలో ఆనందాన్ని వెతుక్కుంది.

**ఆర్థిక క్రమశిక్షణకు కేరాఫ్ అడ్రస్**

ఆమె కేవలం సంపాదించడమే కాదండి బాబు.. ఆ డబ్బును ఎలా పెట్టుబడి పెట్టి గ్రో చేసుకోవాలో కూడా నేర్పిస్తోంది. ప్రతి నెలా ఏకంగా రూ. లక్షను ఎస్ఐపీ రూపంలో మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెడుతోంది. అకస్మాత్తుగా ఉద్యోగం పోయినా లేదా ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైనా.. కనీసం 6 నెలల పాటు ఇబ్బంది పడకుండా ఉండేలా ఎమర్జెన్సీ ఫండ్ కూడా సిద్ధం చేసుకుంది. షో-ఆఫ్ కోసం అప్పులు చేసే నేటి కాలం యువతకు ఈ లేడీ టెక్కీ ఒక రోల్ మోడల్ అని చెప్పొచ్చు. మన సంపాదన మనకు స్వేచ్ఛను ఇవ్వాలి తప్ప, సమాజం కోసం బానిసలను చేయకూడదనేది ఆమె ఫిలాసఫీ. నిజమైన సంపద అంటే చేతిలో ఉన్న ఐఫోన్ కాదు.. బ్యాంకులో ఉన్న బ్యాలెన్స్, మనశ్శాంతి అని ఆమె నిరూపిస్తోంది.

# 34km మైలేజ్, బెస్ట్ ఫీచర్స్.. ఇండియాలోనే అత్యంత చౌకైన ఫ్యామిలీ కార్లు, ధర రూ. 3.5 లక్షల నుండే..




**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ రోజుల్లో చాలా మధ్యతరగతి కుటుంబాలకు కారు అనేది లగ్జరీకి కాదు, తప్పనిసరిగా ఉండాల్సినది. మీ దగ్గర ఖర్చు చేయడానికి సుమారు రూ. 3.5 లక్షల నుండి రూ. 5 లక్షల వరకు ఉన్నట్లయితే, మీరు కొనగలిగే కొన్ని బెస్ట్ కార్ అప్షన్స్ ఉన్నాయి. ఈ కార్లు తక్కువ ఇంధనాన్ని వినియోగించడమే కాకుండా తక్కువ మెయింటెనెన్స్ ఖర్చు ఉంటుంది. అలాగే బెస్ట్ సేఫ్టీ ఫీచర్లతో వస్తాయి. భారతదేశంలో మారుతి సుజుకి నుండి టాటా వరకు అన్ని సౌకర్యాలతో అందించే ఈ ఐదు బడ్జెట్-ఫ్రెండ్లీ ఫ్యామిలీ కార్స్ గురించి మీకోసం....

**మారుతి సెలెరియో**

మీరు ఇంధనం ఆదా చేయాలనుకుంటే మారుతి సుజుకి సెలెరియో ఒక బెస్ట్ అప్షన్. ఈ కార్ 1.0-లీటర్ పెట్రోల్ ఇంజన్ సుమారు 25 కిలోమీటర్ల మైలేజీని ఇస్తుంది, CNG మోడల్ అయితే 34 కిలోమీటర్ల మైలేజీని కూడా అందుకోగలదు. నడపడానికి, హ్యాండిల్ చేయగలగడం చాల ఈజీ.. నిర్వహణ ఖర్చు కూడా తక్కువగా ఉండటం వల్ల రెగ్యులర్ డ్రైవింగ్‌కు చాలా బాగుంటుంది.

**టాటా టియాగో**

ఈ ధరల్లో 4-స్టార్ సేఫ్టీ రేటింగ్ ఉన్న టాటా టియాగో నిజంగా ప్రత్యేకంగా నిలుస్తుంది. ఈ కార్ 1.2-లీటర్ పెట్రోల్ ఇంజన్ మీకు దాదాపు 19 kmpl మైలేజీని ఇస్తుంది, CNG వెర్షన్ దాదాపు 28 km/kg మైలేజీ ఇస్తుంది. అంతేకాకుండా ఈ కారు దృఢంగా నిర్మించబడింది, మంచి ఫీచర్లతో ఇంటీరియర్ భాగం ఒక చిన్న ఫ్యామిలీకి సౌకర్యవంతంగా ఉంటుంది.

**రెనాల్ట్ క్విడ్**

రెనాల్ట్ క్విడ్ ఒక చిన్న ూఖుం లాగా కనిపిస్తుంది, కానీ చాలా తక్కువ ధరకే లభిస్తుంది. ఈ కార్ 1.0-లీటర్ పెట్రోల్ ఇంజన్‌తో నడుస్తుంది అలాగే సుమారు 21--22 kmpl మైలేజీని ఇస్తుంది. మీకు స్టైలిష్‌గా, ఆకర్షణీయంగా కనిపించే, బడ్జెట్ ఫ్రెండ్లీ కారు కావాలంటే, ఈ అధిక రోడ్ క్లియరెన్స్ ఉన్న కారు ఒక గొప్ప ఛాయిస్.

**మారుతి ఆల్టో K10**

మారుతి సుజుకి ఆల్టో K10 ఇండియాలో అత్యంత నమ్మకమైన కార్లలో ఒకటి. దీని 1.0-లీటర్ ఇంజన్ పెట్రోల్‌తో 24--25 kmpl మైలేజీ, CNGతో ఆకట్టుకునే 33--34 km/kg మైలేజీ అందిస్తుంది. ఈ కారు చిన్నగా, చవకగా ఉండటమే కాకుండా, మారుతికి గొప్ప సర్వీస్ నెట్‌వర్క్ కూడా ఉంది. అందుకే మొదటిసారి కారు కొనే వారికి ఇది అత్యంత ఇష్టమైనదిగా నిలుస్తుంది.

**మారుతి ఎస్-ప్రెస్సో**

మారుతి సుజుకి ఎస్-ప్రెస్సో మీరు కొనగలిగే అత్యంత చవకైన కార్లలో ఒకటి, దీని ధర సుమారు రూ. 3.5 లక్షల నుండి ప్రారంభమవుతుంది. ఈ కారు 1.0-లీటర్ ఇంజన్ పెట్రోల్‌తో లీటరుకు సుమారు 24 కిలోమీటర్లు, CNGతో కిలోకి 32 కిలోమీటర్ల వరకు మైలేజీని ఇస్తుంది. దీని సిటు ఎత్తు ఆకారం కారణంగా, మీ తలపైన ఎక్కువ స్థలం, మంచి వ్యూ అందిస్తుంది. అందువల్ల సిటీ నగరాల్లోని కుటుంబాలకు ఒక గొప్ప కారుగా నిలుస్తుంది.

# తిరిగి వెనక్కి వచ్చేస్తాం: అమెరికాలోని 40 శాతం ఇండియన్స్ మాట ఇదే.. ఎందుకంటే?



**హైదరాబాద్ పెన్ పవర్:** కోట్లాది మంది భారతీయుల మదిలో మెరిసే 'అమెరికన్ డ్రీమ్' ఇప్పుడు ఒక పీడకలలా మారుతోందా? ఏళ్ల తరబడి కష్టపడి కూటబెట్టిన డబ్బులతో, సముద్రాలు దాటి, సిలికాన్ వ్యాలీలో సామ్రాజ్యాలు నిర్మించిన భారతీయులు.. ఇప్పుడు తమ సొంత దేశానికి తిరిగి వచ్చేద్దాం అనుకుంటున్నారు. లేదంటే మరో దేశానికి వెళ్లిపోవాలని అనుకుంటున్నారట. డాలర్ల కోసం వ్యయప్రయాసలు, దశాబ్దాల నిరీక్షణలు, మారుతున్న రాజకీయ పరిస్థితుల మధ్య విసిగిపోయిన ప్రవాస భారతీయుడు ఇప్పుడు తన మకాం మార్చాలని చూస్తున్నారని 'కార్నెగీ ఎండోమెంట్ ఫర్ ఇంటర్నేషనల్ పీస్' 2026 సర్వే రిపోర్ట్ బయటపెట్టింది.

2026 ఫిబ్రవరి నుండి ఏప్రిల్ మధ్య జరిగిన ఈ సర్వే ప్రకారం.. ప్రతి 10 మంది భారతీయ-అమెరికన్లలో 4 అమెరికాను వదిలి వెళ్లిపోవాలని సీరియస్ గా ఆలోచిస్తున్నారని తేలింది. అంటే దాదాపు 40 శాతం మంది అమెరికాలో ఉండటం సురక్షితం కాదని భావిస్తున్నారు. అమెరికా జనాభాలో భారతీయుల వాటా కేవలం 1.5 శాతం మాత్రమే అయినప్పటికీ.. ఆ దేశ పన్నుల ఆదాయంలో ఏకంగా 6 శాతం వీరే కడుతున్నారు. ఒక విధంగా ఈ కేటగిరీ ప్రజలు వెళ్లిపోవటం అమెరికాకు కూడా భారీ దెబ్బనే చెప్పుకోవాలి. గత ఏడాది హెచ్1బీ వీసాల జారీ 25శాతం మేర తగ్గింది. లక్ష డాలర్ల అప్లికేషన్ ఫీజు అమల్లోకి వచ్చిన తర్వాత హెచ్-1బీ వీసాల కోసం కంపెనీల నుంచి డిమాండ్ 87శాతం తగ్గిందట.

**ట్రంప్ సెకండ్ టర్మ్ – రాజకీయ విభజన..**

అమెరికాను వీడాలనుకునే వారిలో 58 శాతం మంది అక్కడ మారిన రాజకీయ వాతావరణం తమ నిర్ణయానికి ప్రధాన కారణమని చెబుతున్నారు. డొనాల్డ్ ట్రంప్ 2వ సారి అధికారంలోకి వచ్చాక దేశంలో రాజకీయ విభజన పెరిగిందని 71 శాతం మంది ఇండియన్స్ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అమెరికా కేవలం అమెరికన్లకే అనే నినాదాలు.. మారుతున్న సామాజిక పరిస్థితులు భారతీయుల్లో తమ ఉనికిపై అనుమానాలను పెంచుతున్నాయి. ఒకప్పుడు డెమోక్రాట్లకు మద్దతుగా నిలిచిన భారతీయులు ఇప్పుడు అయోమయంలో ఉన్నారు.

**గ్రీన్ కార్డ్.. ఒక జీవితకాల శిక్ష**

భారతీయుల అసహనానికి మరో ప్రధాన కారణం అక్కడి ఇమ్మిగ్రేషన్ వ్యవస్థలు. ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గ్రీన్ కార్డ్ కోసం దరఖాస్తు చేసుకుంటే.. అది చేతికి రావడానికి దాదాపు 30 నుండి 40 ఏళ్లు పడుతోంది. అమెరికా ఇప్పటికీ 2013-14 నాటి గ్రీన్ కార్డ్ అప్లికేషన్లనే ప్రాసెస్ చేస్తున్నట్లు మే 2026 వీసా బులెటిన్ వెల్లడించింది. అంటే దాదాపు 10 ఏళ్ల కిందట అప్లై చేసినోళ్లకు ఇప్పుడు ప్రాసెస్ చేస్తుంటే ఇప్పటి వరాకి ఇంకెప్పుడు వస్తాయనే భయాలు వెంటాడుతున్నాయి. కొన్ని సందర్భాల్లో ఈ వెయిటింగ్ 70 ఏళ్లు కూడా ఉండవచ్చని అంచనా. అంటే ఒక వ్యక్తి తన ఉద్యోగ జీవితం మొత్తం గ్రీన్ కార్డ్ కోసమే పోరాడాల్సి వస్తోంది. దీంతో ఇండియన్ ఫ్యామిలీస్ అక్కడ స్థిరపడలేకపోతున్నాయి.

**ఆకాశాన్నంటుతున్న ఖర్చులు**

అమెరికాలో జీవన వ్యయం ఇప్పుడు సామాన్యుడికి భారంగా మారింది. ఒక బిడ్డను 18 ఏళ్ల వరకు పెంచడానికి సుమారు రూ. 2.50 కోట్లు ఖర్చవుతోందని నివేదికలు చెబుతున్నాయి. దీనికి తోడు హెల్త్‌కేర్, చైల్డ్ కేర్ ఖర్చులు మధ్యతరగతి భారతీయుల నడ్డి విరుస్తున్నాయి. శాన్ ఫ్రాన్సిస్కో, న్యూయార్క్ వంటి నగరాల్లో అద్దెలు విపరీతంగా పెరిగిపోయాయి. అదనంగా, కార్యాలయాల్లో ఎదురయ్యే వివక్ష కూడా వారిని మానసికంగా కృంగదీస్తోంది.

అమెరికాను వదిలేస్తున్న వారు కేవలం భారత్‌కే కాకుండా.. కెనడా, ఆస్ట్రేలియా, దుబాయ్ వంటి దేశాల వైపు చూస్తున్నారు. అక్కడ పౌరసత్వ నిబంధనలు సరళంగా ఉండటం, పన్నుల భారం తక్కువగా ఉండటం వారిని ఆకర్షిస్తోంది. మొత్తం మీద.. అమెరికా తన ఇమ్మిగ్రేషన్ విధానాలను మార్చుకోకపోతే.. నైపుణ్యం కలిగిన భారతీయులను కోల్పోవడం ఖాయంగా కనిపిస్తోంది. అమెరికన్ డ్రీమ్ ఇప్పుడు కేవలం ఒక తీపి జ్ఞాపకంగా మిగిలిపోయే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

# ఆపిల్ ప్రియులకు పండగే ! ఐఫోన్ 18 ప్రో మ్యాక్స్ కొత్త కలర్స్ చూశారా..?



ప్రముఖ అమెరికన్ స్మార్ట్ ఫోన్ కంపెనీ ఆపిల్ ప్రతిష్టాత్మక ఐఫోన్ 18 ప్రో మ్యాక్స్‌ను ఈ ఏడాది సెప్టెంబర్‌లో విడుదల చేయడానికి సిద్ధమవుతోంది. దీని ధర గురించి ఇంకా అధికారిక సమాచారం లేనప్పటికీ, ఇండియాలో దీని ప్రారంభ ధర సుమారు రూ. 1,49,900 నుండి ఉండొచ్చని అంచనా. ఈసారి కొత్తగా వస్తున్న 'డార్క్ చెర్రీ' కలర్ ఈ ఫోన్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ముదురు ఎరుపు వైన్ రంగులో ఉండే ఈ వేరియంట్‌తో పాటు లైట్ బ్లూ, సిల్వర్, డార్క్ గ్రే రంగులలో కూడా ఈ ఫోన్ రానుంది. ఇందులో లైట్ బ్లూ రంగు ఐఫోన్ 14 ప్రో మోడళ్ లాగా చూడటానికి చాలా మోడ్రన్‌గా కనిపిస్తుంది. డిజైన్ పరంగా ఆపిల్ కొన్ని కీలక మార్పులు చేస్తోంది. ముఖ్యంగా కెమెరా భాగం ఫోన్ బాడీతో కలిసిపోయేలా నునుపైన మెటల్ ఫినిషింగ్‌తో మరింత అందంగా ఉండబోతోంది. మూడు కెమెరాలు ఉన్నప్పటికీ, ఫోన్ పట్టుకోవడానికి సౌకర్యంగా ఉండేలా అంచులు ఇంకా వెనుక భాగాన్ని అడ్జస్ట్ చేస్తున్నారు. ఐఫోన్ క్లాసిక్ స్టయిల్ దెబ్బతీయకుండానే డైనమిక్ ఐలాండ్ ఒ స్క్రీన్ క్వాలిటీని మరింత మెరుగుపరుస్తున్నారు.

సాంకేతిక సామర్థ్యం విషయానికి వస్తే, ఐఫోన్ 18 ప్రో మ్యాక్స్‌లో ఆపిల్ అత్యంత వేగవంతమైన సరికొత్త చిప్‌ను అమర్చనుంది. దీనివల్ల ఫోన్ పర్ఫార్మెన్స్ అద్భుతంగా ఉంటుంది. కెమెరాలో అత్యాధునిక సెన్సార్లు, మెరుగైన ఇమేజ్ ప్రాసెసింగ్ ఫీచర్లు ఉండనున్నాయి. అలాగే ఎక్కువ సేపు ఫోన్ వాడేలా బ్యాటరీ సామర్థ్యాన్ని కూడా పెంచుతున్నారు. కొత్త రంగులు, స్పీడ్ పర్ఫార్మెన్స్, మెరుగైన కెమెరా కావాలనుకునే వారు ఈ మోడల్ కోసం వేచి చూడటం మంచిది, ఎందుకంటే ధరలో పెద్ద మార్పు లేకుండానే దీర్ఘకాలం పాటు అత్యుత్తమ పనితీరును అందిస్తుంది.

# కారు ఇన్సూరెన్స్ క్లెయిమ్ రిజెక్ట్ అయ్యిందా..? ఈ తప్పులు చేస్తున్నారేమో ముందు చూస్కోండి..






కారు కొనడం ఎంత సరదాగా ఉంటుందో.. దానికి సరైన ఇన్సూరెన్స్ పాలసీ తీసుకోవడం కూడా అంతకంటే ముఖ్యం. ప్రమాదాలు జరిగినప్పుడు మన జేబుకు చిల్లు పడకుండా ఈ ఇన్సూరెన్స్ కాపాడుతుంది. అయితే చాలామంది పాలసీ ఉన్నా కూడా క్లెయిమ్ రిజెక్ట్ అయినప్పుడు లబోదిబోమంటుంటారు. చిన్న చిన్న తప్పులే మీకు రావాల్సిన ఇన్సూరెన్స్‌ను దూరం చేస్తాయి. మీ క్లెయిమ్ తిరస్కరణకు గురికాకుండా ఉండాలంటే ఈ విషయాలను తప్పక తెలుసుకోండి.

**చట్టపరమైన సలహా సేవలు**

**లేటు చేయద్దు..**

ప్రమాదం జరిగినప్పుడు, కారు దొంగతనానికి గురైనప్పుడు వెంటనే ఇన్సూరెన్స్ కంపెనీకి సమాచారం అందించాలి. సాధారణంగా కంపెనీలు 24 నుండి 48 గంటల సమయం మాత్రమే ఇస్తాయి. ఈ లోపు సమాచారం ఇవ్వకపోతే.. జరిగిన నష్టాన్ని గుర్తించటం కంపెనీకి కష్టమవుతుంది. ఫలితంగా మీ క్లెయిమ్ రిజెక్ట్ అయ్యే అవకాశం ఉంది.

**మార్పులు చేస్తే చెప్పాల్సిందే..**

మీ కారుకు సీఎన్జీ కిట్ అమర్చినా, ఇంజిన్‌లో మార్పులు చేసినా లేదంటే డిజైన్ మార్చినా వెంటనే ఇన్సూరెన్స్ కంపెనీకి తెలియజేయాలి. ఇలాంటి మార్పుల వల్ల కారు రిస్క్ పెరుగుతుందని కంపెనీలు భావిస్తాయి. ఈ సమాచారాన్ని దాచిపెడితే.. అది మోసం కిందకు వస్తుంది. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు మీరు చేసిన మార్పులు కంపెనీకి తెలిస్తే ఒక్క రూపాయి కూడా చెల్లించవు క్లెయిమ్ కోసం.

**నిర్లక్ష్యం వద్దు..**

సొంత తప్పుల కారణంగా జరిగే నష్టాలకు క్లెయిమ్ రాదు. ఉదాహరణకు.. వర్షాల వల్ల రోడ్లు నీటితో నిండినప్పుడు కారును బలవంతంగా డ్రైవ్ చేయడం, ఇంజిన్ ఆగిపోయినా పదేపదే స్టార్ట్ చేయడం వల్ల ఇంజిన్ పాడైతే ఇన్సూరెన్స్ కంపెనీలు బాధ్యత వహించవు. దీన్ని వినియోగదారుడి నిర్లక్ష్యంగా పరిగణిస్తారు.

**డాక్యుమెంట్లు సరిగ్గా ఉన్నాయా?**

ఇన్సూరెన్స్ పాలసీ గడువు ఒక్క రోజు ముగిసినా క్లెయిమ్ వర్తించదు. అలాగే కారు నడిపే వ్యక్తికి చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ ఖచ్చితంగా ఉండాలి. పొల్యూషన్ సర్టిఫికేట్ వంటి డాక్యుమెంట్స్ అప్‌డేట్ గా లేకపోయినా ఇబ్బందులు తప్పవు.

వేగంగా క్లెయిమ్ పొందాలంటే.. ప్రమాదం జరిగిన వెంటనే ఫోటోలు, వీడియోలు తీసి ఆధారంగా ఉంచుకోవాలి. సర్వేయర్ వచ్చి తనిఖీ చేసే వరకు రిపేర్లు స్టార్ట్ చేయట్టద్దు. వీలైనంత వరకు నెట్‌వర్క్ గ్యారేజీలలోనే రిపేర్లు చేయించడం వల్ల క్యాష్ లెస్ సౌకర్యం లభిస్తుంది. అలాగే పేపర్ వర్క్ తగ్గుతుంది. అన్ని వివరాలు పక్కాగా ఉంటేనే కంపెనీలు మీ క్లెయిమ్ వేగంగా సెటిల్ చేస్తాయని గుర్తుంచుకోండి.

# అంబానీ ఇంట్లో 7 స్టార్ హోటల్ కిచెన్.. యాంటిలియాలో చెఫ్ జీతం ఎన్ని లక్షలంటే..?



ముకేశ్ అంబానీ ముంబై నివాసం యాంటిలియా ఒక అధునాతన రాజప్రాసాదం. ఇక్కడ వంటగది ఒక 7-స్టార్ హోటల్ ఆపరేషన్‌ను తలపిస్తుంది. ప్రపంచంలోనే అత్యంత సంపన్న కుటుంబం ఉండే ఈ ఇంట్లో రోజూ జరిగే వంటా వార్పుల గురించి వింటే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే. యాంటిలియాలో ప్రతిరోజూ సుమారు 4వేల రోటీలు తయారు చేస్తారు. ఇది వినడానికి వింతగా అనిపించినా.. అక్కడ పనిచేసే సుమారు 600 మంది సిబ్బంది కోసం ఈ స్థాయిలో భోజనాలు సిద్ధం చేయాల్సి ఉంటుంది. హౌస్ కీపింగ్, సెక్యూరిటీ, డ్రైవర్లు, టెక్నికల్ టీమ్ ఇలా అందరికీ మూడు పూటలా రుచికరమైన భోజనం అందించడం ఒక పెద్ద మిషన్ లాంటిది. ఇందుకోసం అత్యాధునిక చపాతీ మేకింగ్ మెషీన్లను కూడా ఉపయోగిస్తారు.

**లక్షల్లో జీతం..**

ఈ వంటగదిని పర్యవేక్షించే మెయిన్ చెఫ్ ఏడాది వేతనం అక్షరాలా రూ.24 లక్షలు అని సమాచారం. అంటే నెలకు రూ. 2 లక్షల పైమాటే. దేశంలోని సగటు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ నెల సంపాదన కంటే ఇది చాలా ఎక్కువ. అయితే ఇది కేవలం వంట చేయడం మాత్రమే కాదు.. వందల మందికి నాణ్యత తగ్గకుండా, పరిశుభ్రత పాటిస్తూ, సమయానికి భోజనం అందించే హై-ప్రెజర్ మేనేజ్‌మెంట్ ఉద్యోగం.

**సింపుల్ డైట్.. లోకల్ ఫుడ్**

కోట్లు ఉన్నా అంబానీ కుటుంబం తీసుకునే ఆహారం మాత్రం చాలా నిరాడంబరంగా ఉంటుంది. ముకేశ్ అంబానీ ఉదయాన్నే బొప్పాయి జ్యూస్, ఇడ్లీ-సాంబార్‌ను ఇష్టపడతారు. ఇక నీతా అంబానీ హెల్త్ డైట్‌కు ప్రాధాన్యత ఇస్తారు. తాజా పండ్లు, డ్రై ఫ్రూట్స్, జ్యూస్‌లు ఆమె మెనూలో ఉంటాయి. మధ్యాహ్నం భోజనంలో పప్పు, అన్నం, రోటీ, సబ్జీ వంటి ఇంటి భోజనాన్నే అంబానీ ఫ్యామిలీ ఇష్టపడుతుందట. రాత్రి వేళల్లో రాగులు లేదా జొన్న రొట్టెలు, సూప్స్ వంటి తేలికపాటి ఆహారం తీసుకుంటారు.

**నెలకోసారి జంక్ ఫుడ్..**

అంబానీ కుటుంబానికి గుజరాతీ స్టైల్ పప్పు అంటే చాలా ఇష్టమని సమాచారం. వీరు జంక్ ఫుడ్‌కు చాలా దూరంగా ఉంటారు. అయితే నెలకు ఒక్కసారి మాత్రమే ట్రీట్ డే ఉంటుంది. అయితే ముకేశ్ అంబానీకి సేవ్ పూరి అంటే ప్రాణం. యాంటిలియా వంటి విలాసవంతమైన ఇంట్లో ఇన్ని సౌకర్యాలు ఉన్నా.. వారి ఆహారపు అలవాట్లు సగటు భారతీయ కుటుంబం మాదిరిగానే ఉండటం గమనార్హం. ఖరీదైన వంటగదిలో సామాన్యమైన రుచులు అంబానీ కుటుంబానికి అసలైన తృప్తినిస్తాయి.

## పెట్రోల్ రేట్లు పెరగవు.. పెరగబోవు.. పెరిగేది లేదు : గట్టిగా చెబుతున్న కేంద్ర ప్రభుత్వం



దేశ ప్రజల్లారా మీకో విన్నపం.. శుభవార్త.. గుడ్ న్యూస్. అమెరికా, ఇరాన్ యుద్ధం జరుగుతున్న ఈ సమయంలో.. దేశంలో పెట్రోల్, డీజిల్ రేట్లు పెంచబోతున్నారంటూ వస్తున్న వార్తలను.. అత్యంత తీవ్రంగా ఖండించింది కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ. సోషల్ మీడియాతోపాటు కొన్ని ఆన్ లైన్ పోర్టల్స్ లో లీటర్ పెట్రోల్ పై 28 రూపాయలు, లీటర్ డీజిల్ పై 35 రూపాయలు పెంచబోతున్నారంటూ వస్తున్న వార్తలను ఖండించింది కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ. దేశంలో పెట్రోల్, డీజిల్ రేట్లు పెంచే ఆలోచన లేదు.. అసలు అలాంటి ప్రతిపాదనే లేదు.. ఇప్పటి వరకు ఆలోచించలేదు అని స్పష్టం చేసింది. పెట్రోల్, డీజిల్ రేట్ల పెంపునకు సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలనలోకి కూడా ఉంచలేదని.. అసలు అలాంటి ఆలోచన చేయటం లేదని పెట్రోలియం మంత్రిత్వ శాఖ చాలా చాలా స్పష్టంగా.. ఒట్టేసి మరీ చెబుతోంది. పెట్రోల్, డీజిల్ రేట్ల పెంపునకు సంబంధించి వస్తున్న కథనాలు అన్నీ తప్పుడు కథనాలు అని.. ఫేక్ వార్తలు అని.. ఎవరూ నమ్మొద్దని.. ఎవరూ భయాందోళనలకు గురి కావొద్దని.. ఇలాంటి ఫేక్ వార్తలను నమ్మి.. ముందస్తుగా పెట్రోల్, డీజిల్ నిల్వ చేసుకోవద్దని కూడా సూచించింది కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ.కొందరు కావాలని.. పనిగట్టుకుని మరీ ఇలాంటి తప్పుడు కథనాలను వ్యాప్తి చేస్తూ.. దేశ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని.. ఎవరూ వాటిని నమ్మొద్దని మరీ మరీ చెప్పింది పెట్రోలియం మంత్రిత్వ శాఖ. క్రూడ్ ఆయిల్ బ్యారల్ ధర ఇప్పుడు 100 డాలర్లకు చేరుకుంది. ఈ క్రమంలోనే రోజుకు 16 వందల కోట్ల రూపాయలు ఆయిల్ కంపెనీలు నష్టపోతున్నాయని.. దీనిని భర్తీ చేయాలంటే ధర పెంచటం ఒక్కటే మార్గం అని.. అందుకే పెట్రోల్, డీజిల్ రేట్లు పెంచబోతున్నారంటూ వస్తున్న వార్తలన్నీ ఫేక్ అని స్పష్టం చేస్తూ.. ఆ వేదికగా ఓ పోస్టును పెట్టింది కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ. సో.. దేశంలో పెట్రోల్, డీజిల్ రేట్లు పెరగవు.. పెరగబోవు.. పెరిగేది లేదు అని ఇంత ఖచ్చితంగా ప్రభుత్వం చెబుతుంటే.. ఇక టెన్షన్ పడాల్సిన అవసరం ఏంటీ చెప్పండి.. సో.. డోంట్ వర్రీ.. ఎప్పటిలాగే హ్యాపీగా రోడ్డెక్కేయండి.. బంకులు ఓపెన్ చేసే ఉంటాయి.. అదే ధరకు దొరుకుతుంది..

## గూగుల్ లో 75 శాతం కోడింగ్ AI రాస్తుంది : సీఈవో సుందర్ పిచాయ్ వ్యాఖ్యలతో ఉద్యోగులు గజ గజ




గూగుల్ తెలుసు కదా.. అయినా గూగుల్ తెలియని వాళ్లు ఎవరుంటారండీ.. మొన్నటి వరకు గూగుల్ కోడింగ్ అంతా ఉద్యోగులు చేసే వాళ్లు.. అదేనండీ మనుషులు.. ఇప్పుడు AI.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చేస్తోంది. ఇప్పుడు.. ఇవాల్టికి అంటే.. 2026, ఏప్రిల్ 23వ తేదీ నాటికి.. గూగుల్ లో 75 శాతం కోడింగ్ రాస్తుంది ఎవరో తెలుసా.. AI.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్.. AI రాస్తున్న కోడింగ్ ను ఉద్యోగులు జస్ట్ చెక్ చేస్తున్నారు.. కరెక్టా కాదా అని వెరిఫై చేస్తున్నారంట.. ఇది చెప్పింది ఎవరో కాదు.. గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్.. సీఈవో వ్యాఖ్యలతో ఉద్యోగులు గజగజ వణుకుతున్నారు. ఎందుకో తెలుసా.. గూగుల్ మొత్తంలో కోడింగ్ ఉద్యోగుల సంఖ్య 30 శాతం.. ఇందులో 75 శాతం AI చేస్తే.. కోడింగ్ ఉద్యోగులు పరిస్థితి ఏంటీ రాబోయే రోజుల్లో అనేది ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యింది...గత 18 నెలల్లో గూగుల్ సంస్థలో ఒక ఊహించని మార్పు వచ్చింది. ఒకప్పుడు ఇంజనీర్లకు కేవలం సహాయకారిగా ఉన్న ఏఐAI.. ఇప్పుడు గూగుల్‌లో కోడ్ రాసే రైటర్ గా మారిపోయింది. లాస్ వెగాస్‌లో జరిగిన గూగుల్ క్లౌడ్ నెక్స్ట్ 2026 సదస్సులో సీఈఓ సుందర్ పిచాయ్ ఈ సంచలన విషయాలు వెల్లడించారు. గూగుల్‌లో ఇప్పుడు తయారవుతున్న కొత్త కోడ్‌లో 75 శాతం ఏఐ ద్వారానే రూపొందుతోంది. గత ఏడాది (2025) ఏప్రిల్‌లో ఇది కేవలం 30 శాతంగా ఉండగా, ఏడాది తిరగక ముందే 75 శాతం వరకు చేరుకోవడం విశేషం.

ఇప్పుడు గూగుల్ ఇంజనీర్లు కూర్చుని కోడ్ రాయడం కంటే, ఏఐ రాసిన కోడ్‌ను చెక్ చేయడం, అది సరిగ్గా ఉందో లేదో చూడటం వంటి పనులకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. అంటే, ఏఐ ఇప్పుడు ఒక 'ఇంజిన్' లాగా పని చేస్తుంటే, మనుషులు దానిని నడిపే 'డ్రైవర్లు'గా మారుతున్నారు. ఈ కొత్త పద్ధతి వల్ల పనులు చాలా వేగంగా జరుగుతున్నాయి. ఒక విధంగా గతంలో ఏడాది పట్టే ఒక క్లిష్టమైన ప్రాజెక్టును, ఇప్పుడు ఏఐ సాయంతో ఆరు రెట్లు వేగంగా పూర్తి చేశారు. యాపిల్ కంప్యూటర్ల (మ్యాక్‌ఓఎస్) కోసం జెమిని యాప్‌ను కేవలం కొన్ని రోజుల్లోనే ప్రోటోటైప్ రూపంలో రెడీ చేశారు.

**ఇంజనీర్ల భవిష్యత్తు ఏంటి**

ఇంతలా ఏఐ కోడ్ రాస్తుంటే ఇంజనీర్ల అవసరం ఇక ఉండదా ? అన్న ప్రశ్నకు పిచాయ్ సానుకూలంగా స్పందించారు. ఏఐ అనేది ఇంజనీర్ల ఉద్యోగాలను తీసేయదని, కానీ వారి పని చేసే విధానాన్ని పూర్తిగా మార్చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇంజనీర్లు ఇప్పుడు చిన్న చిన్న కోడింగ్ లైన్లు రాయడం కంటే, పెద్ద పెద్ద ప్రాజెక్టులను ఎలా నడిపించాలనే దానిపై దృష్టి పెడుతున్నారన్నారు. సెర్చ్, యూట్యూబ్, ఆండ్రాయిడ్ వంటి ప్రపంచంలోనే అత్యంత సంక్లిష్టమైన సాఫ్ట్‌వేర్లను తయారు చేసే గూగుల్ సంస్థలోనే 75 శాతం కోడ్ ఏఐ రాస్తుందంటే, రాబోయే రోజుల్లో మొత్తం టెక్నాలజీ రంగం ఏ స్థాయిలో మారబోతుందో ఊహించవచ్చు.

# వెయిట్‌లాస్‌కు మ్యాజిక్ ఫార్ములా?

అతిగా వ్యాయామం చేయకుండానే బరువును అదుపులో ఉంచుకునే అద్భుత ఫార్ములా '30–30–30'. ఉదయం నిద్రలేచిన అరగంటలో ప్రోటీన్ తీసుకోవడం, ఆపై 30 నిమిషాల వ్యాయామంతో జీవక్రియను వేగవంతం చేసే ఈ సింపుల్ టెక్నిక్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. నేటి ఆధునిక జీవనశైలిలో అధిక బరువు అనేది చాలా మందిని వేధిస్తున్న ప్రధాన సమస్య. బరువు తగ్గాలనే ఆత్రుతతో చాలా మంది క్రాష్ డైట్లు పాటించడం, అతిగా వ్యాయామాలు చేయడం లేదా సర్జరీల వైపు మొగ్గు చూపడం వంటివి చేస్తుంటారు. అయితే ఇటువంటి పద్ధతులు శరీరానికి మేలు చేయడం కంటే అనారోగ్య సమస్యలనే ఎక్కువగా తెచ్చిపెడతాయి. బరువు తగ్గడం అనేది ఒక నిరంతర ప్రక్రియ అని గుర్తించాలి. దీని కోసం ఎటువంటి ఇబ్బంది లేకుండా, ఆరోగ్యకరమైన పద్ధతిలో పనిచేసే '30–30–30' రూల్ ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతోంది. ఈ పద్ధతి ప్రధానంగా మూడు అంశాల చుట్టూ తిరుగుతుంది. ఇది సరళంగా ఉన్నప్పటికీ జీవక్రియపై అద్భుతమైన ప్రభావం చూపుతుంది. ఈ నియమం ప్రకారం.. ఉదయం నిద్రలేచిన 30 నిమిషాల లోపు 30 గ్రాముల ప్రోటీన్ తీసుకోవాలి. ఆ తర్వాత 30 నిమిషాల పాటు తక్కువ తీవ్రత కలిగిన వ్యాయామాలు చేయాలి. చివరగా మనం తీసుకునే ఆహారంలో 30 శాతం క్యాలరీలు తగ్గించాలి. ఈ పద్ధతి కేవలం కొవ్వును కరిగించడమే కాకుండా రోజంతా ఆకలిని నియంత్రించడంలో అద్భుతంగా సాయపడుతుంది. శరీరాన్ని హింసించకుండానే క్రమపద్ధతిలో బరువు తగ్గడానికి ఇది ఒక గొప్ప మార్గం. ఉదయం నిద్రలేచిన వెంటనే 30 గ్రాముల ప్రోటీన్ తీసుకోవడం వల్ల శరీర జీవక్రియ వేగవంతం అవుతుంది. పాలు, కోడిగుడ్లు, పప్పుధాన్యాలు, మొలకలు లేదా మాంసాహారం వంటి వాటిని అల్పాహారంలో భాగం చేసుకోవాలి. ప్రోటీన్లు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకుంటే కడుపు నిండుగా అనిపించి ఎక్కువ సమయం ఆకలి వేయదు. దీనివల్ల మధ్యలో అనవసరమైన స్నాక్స్ తినాలనే కోరిక



తగ్గుతుంది. అల్పాహారం తీసుకున్న తర్వాత 30 నిమిషాల పాటు నడక, జాగింగ్ లేదా ఈత వంటి తక్కువ తీవ్రత కలిగిన వ్యాయామాలు చేయాలి. దీనివల్ల శరీరంలో పేరుకుపోయిన అదనపు కొవ్వు కరగడం మొదలవుతుంది. కండరాలు బలంగా తయారై శరీరం దృఢంగా మారుతుంది.

బరువు తగ్గడంలో క్యాలరీల పాత్ర చాలా కీలకం. మనం ఖర్చు చేసే శక్తి కంటే ఎక్కువ క్యాలరీలు తీసుకోవడం వల్ల అవి శరీరంలో కొవ్వుగా మారిపోతాయి. అందుకే రోజువారీ క్యాలరీల ఆహారంలో 30 శాతం తగ్గించి తీసుకోవాలి. దీనివల్ల శరీరం తన అవసరాల కోసం పేరుకుపోయిన పాత కొవ్వును ఇంధనంగా వాడుకుంటుంది. ఈ రూల్ పాటించడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు స్థిరంగా ఉంటాయి. ఇది డయాబెటిస్ ముప్పును కూడా తగ్గిస్తుంది. ఎటువంటి ఒత్తిడి లేకుండా స్థిరంగా బరువు తగ్గాలనుకునే వారికి ఈ విధానం ఒక సంజీవనిలా పనిచేస్తుంది. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, క్రమం తప్పని వ్యాయామం కలిస్తేనే ఆశించిన ఫలితాలు వస్తాయి. ఈ 30–30–30 రూల్ మనల్ని క్రమశిక్షణతో ఉంచడమే కాకుండా ఆరోగ్యకరమైన జీవనశైలికి పునాది వేస్తుంది. కఠినమైన డైట్లు లేకపోయినా ఫలితం నెమ్మదిగా మొదలై దీర్ఘకాలంలో స్థిరంగా ఉంటుంది. బరువు తగ్గడమే లక్ష్యంగా పెట్టుకున్న వారు ఈ చిన్న మార్పును తమ దినచర్యలో భాగం చేసుకోవడం వల్ల అద్భుతమైన మార్పును చూడవచ్చు. ఆరోగ్యమే మహాభాగ్యం అని గుర్తించి సరైన పద్ధతిలో అడుగులు వేయండి. మన శరీరాన్ని మనం గౌరవిస్తూ సంరక్షించుకోవడం కంటే మించిన సంతోషం మరొకటి ఉండదు.

## ఇలా అయితే అనారోగ్యం వచ్చినట్టే



వేసవి కాలం వచ్చిందంటే చాలు అందరికీ ముందుగా గుర్తొచ్చేది పండ్ల రాజు మామిడి పండు. ఆ రుచికి, సువాసనకు ఎవరైనా ఫిదా అవ్వాల్సిందే. అయితే మామిడి పండ్లను ఆస్వాదించే క్రమంలో మనం చేసే కొన్ని చిన్న చిన్న పొరపాట్లు మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. చాలామంది మామిడి పండు తిన్న వెంటనే దాహంగా అనిపించి నీళ్లు తాగుతుంటారు. ఇది చూడటానికి సాధారణ విషయంగా అనిపించినప్పటికీ, శరీరంలోని జీర్ణవ్యవస్థను ఇది తీవ్రంగా ఇబ్బంది పెడుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కేవలం రుచి కోసం పండును ఆస్వాదించడమే కాదు, దానిని ఎలా తినాలో కూడా తెలుసుకోవడం ఎంతో ముఖ్యం. మామిడి పండ్లలో చక్కెర శాతం, పీచు పదార్థం అంటే ఫైబర్ ఎక్కువగా ఉంటాయి. ఇవి మన శరీరంలో జీర్ణం కావడానికి కొంత సమయం పడుతుంది. మనం పండు తిన్న వెంటనే నీళ్లు తాగడం వల్ల పొట్టలోని జీర్ణరసాలు పలుచబడిపోతాయి. దీనివల్ల మామిడి పండులోని పోషకాలను శరీరం గ్రహించే వేగం మందగిస్తుంది. ఫలితంగా జీర్ణ ప్రక్రియ ఆలస్యమై ఆహారం పొట్టలో అలాగే ఉండిపోయి గ్యాస్ లేదా అసౌకర్యానికి దారితీస్తుంది. అందుకే మామిడి పండు తిన్న తర్వాత కనీసం అరగంట పాటు నీటిని ముట్టుకోకపోవడమే శ్రేయస్కరం. మామిడి పండు తిన్న వెంటనే నీళ్లు తాగడం వల్ల కలిగే ప్రధాన ఇబ్బందుల్లో కడుపు నొప్పి ఇంకా విరేచనాలు ముఖ్యమైనవి. నీరు జీర్ణ ఎంజైమ్‌ల పనితీరును అడ్డుకోవడం వల్ల ఆహారం సరిగ్గా జీర్ణం కాక పొట్టలో గందరగోళం మొదలవుతుంది. ఇది వికారం లేదా కడుపులో ఉబ్బరం వంటి సమస్యలకు దారితీస్తుంది. ముఖ్యంగా సున్నితమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారిలో ఈ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుంది. మామిడి పండులోని ఫ్రక్టోజ్ (సహజ చక్కెర) నీటితో కలిసినప్పుడు బ్యాక్టీరియా చర్య వేగవంతమై ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం కూడా ఉంది. ఆరోగ్యంగా ఉండాలంటే మామిడి పండు తిన్న తర్వాత కనీసం ముప్పై నుండి నలభై నిమిషాల వరకు వేచి ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ సమయంలో జీర్ణక్రియ సక్రమంగా జరిగి పండులోని విటమిన్లు ఇంకా ఖనిజాలు రక్తంలో కలుస్తాయి. ఆ తర్వాత నీళ్లు తాగడం వల్ల ఎటువంటి ఇబ్బంది ఉండదు. అలాగే మామిడి పండ్లను రాత్రి పూట కంటే ఉదయం లేదా మధ్యాహ్నం సమయంలో తీసుకోవడం వల్ల అవి మెరుగ్గా జీర్ణమవుతాయి. పండు తినే ముందు దానిని గంట పాటు నీటిలో నానబెట్టడం వల్ల అందులోని వేడి తగ్గి చర్మానికి ఎటువంటి అలర్జీలు రాకుండా ఉంటాయి. ప్రకృతి ప్రసాదించిన ఈ అద్భుతమైన పండును ఆస్వాదించేటప్పుడు ఈ చిన్న జాగ్రత్తలు పాటించడం వల్ల మనం ఆరోగ్యంగా ఉండవచ్చు. ఆహారపు అలవాట్లలో క్రమశిక్షణే మనల్ని దీర్ఘకాలిక రోగాల నుండి కాపాడుతుంది. మామిడి పండు తిన్న వెంటనే నీళ్లు తాగే అలవాటు మీకు ఉంటే వెంటనే దానిని మార్చుకోండి. రుచితో పాటు ఆరోగ్యం కూడా ముఖ్యం కాబట్టి నియమాలను పాటిస్తూ ఈ వేసవిని ఆనందంగా గడపండి. మన శరీరానికి ఏది అవసరమో.. ఎప్పుడు అవసరమో గుర్తించి మెలగడమే అసలైన విజ్ఞత.

## పండుతోపాటు గింజలను కూడా తినేస్తున్నారా?



వేసవి కాలం రాగానే అందరికీ ముందుగా గుర్తొచ్చే పండు పుచ్చకాయ. శరీరానికి కావాల్సిన నీటిని అందిస్తూ, ఉష్ణతాపం నుండి ఉపశమనం కలిగించే ఈ రసవంతమైన పండును సామాన్యుల నుండి సెలబ్రిటీల వరకు ప్రతి ఒక్కరూ ఇష్టపడతారు. అయితే వేసవిలో పుచ్చకాయ తింటున్నప్పుడు గింజలను పారేస్తున్నారా? అయితే మీరు ఒక గొప్ప పోషకాహారాన్ని వృథా చేస్తున్నట్లే. పుచ్చకాయ తినేటప్పుడు చాలామంది గింజలను వేరు చేసి పారేస్తుంటారు. పోషకాల నిధి.. డైటీషియన్ రంజనా సింగ్ ప్రకారం, పుచ్చకాయ గింజల్లో ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, మెగ్నీషియం, ఐరన్ జింక్ వంటి ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరానికి తక్షణ శక్తిని అందించడమే కాకుండా, కండరాల బలోపేతానికి రోగనిరోధక శక్తిని పెంచడానికి ఎంతో తోడ్పడతాయి. అయితే ఈ పోషకాలను శరీరం సరిగ్గా గ్రహించాలంటే గింజలను నమిలి తినడం చాలా ముఖ్యం. గింజలను నమలకుండా నేరుగా మింగేయడం వల్ల వాటిలోని పూర్తి ప్రయోజనాలను మనం పొందలేము. అంతేకాకుండా, వీటిలో ఉండే ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరిచి మలబద్ధకం వంటి సమస్యలను దూరం చేస్తుంది. ఎలా తీసుకోవాలి? నిపుణుల సూచనలు పుచ్చకాయ గింజలను నేరుగా పండుతో పాటు నమిలి తినవచ్చు లేదా వాటిని సేకరించి ఎండబెట్టి, దోరగా వేయించుకుని చిరుతిండిగా కూడా తీసుకోవచ్చు. వేయించిన గింజలు రుచిగా ఉండటమే కాకుండా సులభంగా జీర్ణమవుతాయి. అయితే ఏ వస్తువైనా మితంగా తీసుకుంటేనే ఆరోగ్యం. పుచ్చకాయ గింజలను కూడా మోతాదుకు మించి తీసుకోకూడదు. సాధారణ ఆరోగ్యవంతులకు ఇవి ఎంతో మేలు చేసినప్పటికీ, వీటిని తీసుకునేటప్పుడు కొన్ని జాగ్రత్తలు పాటించడం అవసరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎవరు జాగ్రత్తగా ఉండాలి? పుచ్చకాయ గింజలు సురక్షితమైనవే అయినప్పటికీ, జీర్ణ సంబంధిత సమస్యలు అంటే గ్యాస్, ఎసిడిటీ లేదా అజీర్తితో బాధపడేవారు వీటిని అధికంగా తీసుకోకూడదు. గింజలు కడుపులో భారంగా అనిపించేలా చేసే అవకాశం ఉంది. చిన్న పిల్లలు వృద్ధులు వీటిని నమలకుండా మింగడం వల్ల జీర్ణ సమస్యలు తలెత్తవచ్చు. అలాగే కిడ్నీలో రాళ్లు లేదా మినరల్స్ అసమతుల్యత ఉన్నవారు తమ ఆహారంలో వీటిని చేర్చుకునే ముందు ఖచ్చితంగా వైద్యుడిని సంప్రదించాలి. ఈ చిన్న జాగ్రత్తలు పాటిస్తూ పుచ్చకాయ గింజలను మీ ఆహారంలో భాగం చేసుకుంటే, వేసవిలో ఆరోగ్యంగా ఉండటమే కాకుండా శరీరానికి అవసరమైన ఖనిజాలను సహజంగానే పొందవచ్చు.

## రాత్రి భోజనంలో ఏది తీసుకుంటే ఆరోగ్యానికి మేలు చేస్తుంది?




నేటి కాలంలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం చాలా ముఖ్యం. తరచుగా మనం చేసే కొన్ని పొరపాట్లు కారణంగా లేనిపోని చిక్కుల్లో పడుతుంటాం. అవి కొన్ని ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. ముఖ్యగా రాత్రివేళల్లో భోజనంలో అన్నం, చపాతీలలో ఏది తీసుకుంటే ఆరోగ్యానికి ఎక్కువ మేలు చేస్తుందో చాలా మందికి సరైన అవగాహన ఉండదు. నేటి

కాలంలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించడం చాలా ముఖ్యం. తరచుగా మనం చేసే కొన్ని పొరపాట్లు కారణంగా లేనిపోని చిక్కుల్లో పడుతుంటాం. అవి కొన్ని ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. ముఖ్యగా రాత్రివేళల్లో భోజనంలో అన్నం, చపాతీలలో ఏది తీసుకుంటే ఆరోగ్యానికి ఎక్కువ మేలు చేస్తుందో చాలా మందికి సరైన అవగాహన ఉండదు. చాలా

కుటుంబాల్లో చపాతీ, అన్నం లేకుండా భోజనం సంపూర్ణం కాదు. చపాతీ, అన్నం తినేంత వరకు అది భోజనంలా అనిపించదు. కొందరు చపాతీని ఆరోగ్యకరమైనదిగా భావిస్తే, మరికొందరు అన్నం తేలికైనదని, సులభంగా జీర్ణమవుతుందని అనుకుంటారు. ఈ రెండు ఆహారాలలో ఏది సులభంగా జీర్ణమవుతుంది? దేనికి ఎక్కువ సమయం పడుతుంది అనే ప్రశ్న చాలా మందిలో తలెత్తుతుంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం అన్నం జీర్ణం కావడానికి తక్కువ సమయం పడుతుంది. కానీ చపాతీ తినడం కూడా మంచిదే. నిపుణుల అభిప్రాయం ప్రకారం అన్నం జీర్ణం కావడానికి సాధారణంగా

1 నుండి 2 గంటల సమయం పడుతుంది. అన్నంలో అధిక మొత్తంలో పీచుపదార్థం ఉంటుంది. ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. అన్నం శరీరంలోకి ప్రవేశించినప్పుడు త్వరగా గ్లూకోజ్‌గా మారుతుంది. అందుకే అనారోగ్యంతో లేదా బలహీనంగా ఉన్నవారికి తరచుగా అన్నం తినమని సలహా ఇస్తారు. ఇది కడుపును తేలికగా ఉంచి, తక్షణ శక్తిని అందిస్తుంది. తెల్ల బియ్యం కంటే బ్రౌన్ రైస్‌లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. ఇది జీర్ణం కావడానికి కొంత సమయం పడుతుంది. జీర్ణక్రియకు తెల్ల బియ్యం కంటే బ్రౌన్ రైస్ మంచిది. మరింత ప్రయోజనకరమైనది. కాబట్టి రాత్రి పూట చపాతీ బదులు బ్రౌన్ రైస్ తినడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చు. చపాతీ పగటి వేళల్లో తీసుకుంటే మంచిది.

## పదే పదే బీపీ పెరుగుతోందా.. ఇలా జరిగితే ప్రాణం ప్రమాదంలో ఉన్నట్లే!




ఈ మధ్య కాలంలో చాలా మంద అధిక రక్తపోటు భారిన పడుతున్నారు. వయసుతో సంబంధం లేకుండా ఈ సమస్య తలెత్తుతుంది. అయితే అసలు బీపీ ఎంత ఉంటే నార్మల్, ఎంత దాటింది అంటే మీ ప్రాణం రిస్క్‌లో ఉన్నట్లో ఇప్పుడు తెలుసుకోండి. అధిక రక్తపోటు కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. ఒత్తిడి, డిప్రెషన్, అతిగా ఆలోచించడం వలన కొంత మందిలో ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. అయితే ఒక వ్యక్తికి 120/80ఎఎఊణ ఉంటే అది సాధారణం. కానీ దీనికి మించి ఉంటే అది అధిక రక్తపోటు సమస్యగా గుర్తించి, తప్పకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అయితే కొన్ని సార్లు ఇది అకస్మాత్తుగా 200 దాటే ఛాన్స్ ఉంటుంది. అయితే ఇలా దాటింది అంటే అది తీవ్రమైన అనారోగ్య సమస్యగా గుర్తించాలి. ముఖ్యంగా ఇది మీ శరీరంలో అనేక అవయవాలపై ప్రభావం చూపుతుంది. కొన్ని సార్లు అత్యవసర పరిస్థితిగా కూడా పరిగణించవచ్చు, ఇలానే కొనసాగితే ఇది మరణానికి కూడా దారితీస్తుందని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. అధిక రక్తపోటు అనేది చాలా ప్రమాదకరమైనది. ఇది శరీరంలోని అవయవాలపై ప్రభావం చూపుతుంది. కొన్ని సార్లు పక్షవాతానికి కూడా దారితీస్తుందంట. అంతే కాకుండా ఇలా పదే పదే బీపీ పెరిగి, మెదడులోని రక్తనాళాలు చిట్లిపోయి, పక్షవాతం వస్తుంది. అయితే మీకు బీపీ సమస్య ఉన్నప్పుడు కొన్ని సార్లు వాంతులు, కళ్లు తిరగడం, కళ్లు మసకబారడం, మైకం కమ్మడం వంటి సమస్య ఎదురు అయితే చాలా జాగ్రత్తగా ఉండాలి. లేకపోతే ఇది అధిక రక్తపోటుకు దారి తీసే ఛాన్స్ ఉన్నదంట. అంతే కాకుండా ఇది గుండెపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని చెబుతున్నారు ఆరోగ్య నిపుణులు. కొన్ని సార్లు ఈ బీపీ సమస్య అధికం అయినప్పుడు ,అధిక రక్తపోటు వలన గుండెకు రక్త సరఫరా సరిగ్గా జరగక గుండెపోటు కూడా వచ్చే ఛాన్స్ ఉంటుంది. వయసుతో సంబంధం లేకుండా హైబీపీ వలన ఇలాంటి సమస్య తలెత్తే ప్రమాదం ఉంది. అందుకే అధిక రక్తపోటు విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

## తులసి, తేనె కలిపిన నీటిని తాగితే.. ఈ ఐదు లాభాలు మీ సొంతం

నేటి ఉరుకుల పరుగుల జీవితంలో, మారుతున్న ఆహారపు అలవాట్ల మధ్య ఆరోగ్యంగా ఉండటం ఒక పెద్ద సవాలుగా మారింది. మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఖరీదైన మందులు, సప్లిమెంట్ల కంటే మన పెరట్లో ఉండే తులసి, వంటింట్లోని తేనె అద్భుతంగా పనిచేస్తాయి. ఆయుర్వేదం ప్రకారం, తులసి తేనె కలయిక ఒక శక్తివంతమైన ఔషధం. ప్రతిరోజూ ఉదయం పరగడుపున ఈ మిశ్రమాన్ని తీసుకోవడం వల్ల శరీరానికి సహజమైన డిటాక్స్ లభించడమే కాకుండా, అనేక వ్యాధుల నుండి రక్షణ లభిస్తుంది. ఆధునిక పరిశోధనలు కూడా ఈ అద్భుత పానీయం ప్రయోజనాలను అంగీకరిస్తున్నాయి. తులసిలో యాంటీ బాక్టీరియల్ యాంటీ వైరల్ గుణాలు పుష్కలంగా ఉంటాయి. మరోవైపు, తేనెలో యాంటీ ఆక్సిడెంట్లు మెండుగా దొరుకుతాయి. ఈ రెండింటినీ కలిపి తీసుకోవడం వల్ల శరీర రోగనిరోధక శక్తి మెరుగుపడుతుంది. ముఖ్యంగా వాతావరణం మారినప్పుడు వచ్చే జలుబు, ఫ్లూ ఇతర ఇన్ఫెక్షన్ల నుండి ఈ పానీయం ఒక



రక్షణ కవచంలా పనిచేస్తుంది. శరీరంలోని తెల్ల రక్త కణాల సామర్థ్యాన్ని పెంచి, వ్యాధికారక క్రిములతో పోరాడే శక్తిని అందిస్తుంది. బరువు తగ్గడానికి నిర్విషీకరణకు సహకారం శరీరంలో పేరుకుపోయిన విషపదార్థాలు అనేక అనారోగ్యాలకు కారణమవుతాయి. తులసి, తేనె నీరు సహజమైన డిటాక్స్ పానీయంగా పనిచేసి రక్తంలోని వ్యర్థాలను తొలగిస్తుంది. ఇది శరీర మెటబాలిజం లేదా జీవక్రియను వేగవంతం చేస్తుంది, తద్వారా నిల్వ ఉన్న కొవ్వు కరగడానికి సహాయపడుతుంది. మీరు బరువు తగ్గడానికి ప్రయత్నిస్తుంటే, మీ రోజును ఈ పానీయంతో ప్రారంభించడం వల్ల జీర్ణవ్యవస్థ శుభ్రపడి, ఆశించిన ఫలితాలు త్వరగా లభిస్తాయి. ఒత్తిడి తగ్గింపు.. తులసిని ఒక అద్భుతమైన 'అడాప్టోజెన్'గా పరిగణిస్తారు, ఇది మానసిక ఒత్తిడిని ఎదుర్కోవడంలో శరీరానికి సహాయపడుతుంది. తేనెతో కలిపి దీనిని తీసుకున్నప్పుడు, ఇది శరీరంలోని కార్టిసాల్ (ఒత్తిడి హార్మోన్) స్థాయిలను తగ్గించి నరాలను ప్రశాంతపరుస్తుంది. దీనివల్ల రోజంతా ఉత్సాహంగా, ఏకాగ్రతతో ఉండవచ్చు. అలాగే, తులసి రక్తాన్ని శుద్ధి చేయడం వల్ల మొటిమలు తగ్గి, చర్మం లోపలి నుండి కాంతివంతంగా మారుతుంది. తేనె చర్మానికి అవసరమైన తేమను అందించి, ముఖానికి సహజమైన మెరుపును ఇస్తుంది.

# సన్‌రైజర్స్‌లోకి ప్యాట్ కమిన్స్.. కెప్టెన్సీ మార్పుపై SRH కన్ఫ్యూజన్







**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 ఎడిషన్ లో సన్‌రైజర్స్ హైదరా బాద్ అద్భుతంగా ఆడుతుంది. వరుసగా 3 విజయా లతో పాయింట్ల పట్టికలో దూసుకుపోతోంది. కానీ జట్టు విజయాలతో ముందుకు సాగుతున్న తరుణంలో కెప్టెన్సీకి సంబంధించి ఓ పెద్ద చర్చ స్టార్ట్ అయింది. రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ జట్టుతో చేరడంతో ప్రస్తుతం కెప్టెన్‌గా ఉన్న ఇషాన్ కిషన్ నుంచి బాధ్యతలు తప్పుకునే ఛాన్స్ ఉందనేది.. అనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఈ సీజన్ ఆరంభంలో ప్యాట్ కమిన్స్ గాయంతో అందుబాటులో లేకపోవడంతో జట్టు యాజమాన్యం అనూహ్యంగా యువ ప్లేయర్ ఇషాన్ కిషన్‌కు సారథ్య బాధ్యతలు అప్పగించింది. ఆరంభంలో కొన్ని ఓటములు ఎదురైనప్పటికీ.. ఇషాన్ తన నాయకత్వ పటిమతో జట్టుకి మళ్లీ విజయాలు అందించాడు. ముఖ్యంగా బౌలర్లను ఉపయోగించుకోవడంతో పాటు ఫీల్డింగ్ సెట్ చేయడంలో కిషన్ చూపిన పరిణతి చూస్తున్నాడు. ఇషాన్ కిషన్ కెప్టెన్సీని కొనసాగించాలని మాజీ క్రికెటర్లు గట్టిగా వాదిస్తున్నారు. హైదరాబాద్ జట్టు ప్యాట్ కమిన్స్ వైపు వెళ్లాలనే ఆలోచన చేయొద్దని సూచించారు. ప్రస్తుత సెటప్‌లో ఇషాన్ సారథ్యంలో జట్టు చాలా సమతుల్యంగా కనపడుతుంది. గత 5 మ్యాచ్‌ల్లో 4 గెలిచిన టీమ్ లో మార్పులు చేయడం అనవసరం అని హర్భజన్ సింగ్ పేర్కొన్నాడు. ప్యాట్ కమిన్స్ 2024లో జట్టును ఫైనల్‌కు చేర్చినప్పటికీ.. ప్రస్తుత ఫామ్ ఇషాన్‌కు అనుకూలంగా ఉందన్నాడు. మాజీ కోచ్ సంజయ్ బంగర్ కూడా ఇషాన్ కిషన్ కి సపోర్టు చేశాడు. ప్యాట్ కమిన్స్ వెన్నునొప్పి గాయంతో బాధపడుతున్నాడని.. దీనివల్ల అతను గత టీ20 ప్రపంచ కప్‌కు కూడా దూరంగా ఉన్నాడని గుర్తు చేశారు. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న కమిన్స్.. ఐపీఎల్ లాంటి సుదీర్ఘ టోర్నీలో పూర్తిస్థాయిలో ఫిట్‌గా ఉంటాడా అన్నది అనుమానమేనని సంజయ్ పేర్కొన్నారు. ఇషాన్ కిషన్ గ్రౌండ్లో ఆటను నియంత్రించే తీరు అద్భుతంగా ఉందని కొనియాడారు. హైదరాబాద్ జట్టు యాజమాన్యం ఇప్పుడు కన్ఫ్యూజన్ లో పడింది. ఓ వైపు ప్యాట్ కమిన్స్ అందుబాటులోకి రావడం.. మరోవైపు వరుస విజయాలతో జోరు మీదున్న యంగ్ కెప్టెన్ ఇషాన్ కిషన్.. ఎవరినీ కెప్టెన్సీగా ఉంచాలనే నిర్ణయంపై మదనపడుతుంది. మరి ఆరెంజ్ ఆర్మీ అనుభవానికి ఓటేస్తుందో లేక విజయం తెచ్చిపెడుతున్న యువ రక్తాన్ని నమ్ముతుందా అనేది వేచి చూడాలి.

# మ్యాచ్‌కు ముందు కార్టూన్లు చూస్తా: వైభవ్ సూర్యవంశీ

## ప్రతి మ్యాచ్‌కు ముందు కార్టూన్లు చూస్తానని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచిన వైభవ్

## సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న యువ సంచలనం నిజాయతీ వ్యాఖ్యలు

## వేగవంతమైన 500 పరుగుల ఘనతలో మ్యాక్స్‌వెల్ ను అధిగమించిన సూర్యవంశీ

**హైదరాబాద్ పెన్ పవర్:** రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ ఐపీఎల్‌లో సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నాడు. నిన్న లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. ఈ మ్యాచ్‌లో కేవలం 8 పరుగులే చేసినప్పటికీ, ఐపీఎల్ చరిత్రలో 500 పరుగులు పూర్తి చేసిన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు.

అంతేగాక ఎదుర్కొన్న బంతుల పరంగా వేగంగా ఈ మైలురాయిని చేరుకుని, ఆస్ట్రేలియా స్టార్ ఆటగాడు గ్లెన్ మ్యాక్స్‌వెల్ పేరిట ఉన్న రికార్డును కూడా వైభవ్ బద్దలుకొట్టాడు. ఈ ఘనత సాధించిన తర్వాత అతను పంచుకున్న విషయాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.మ్యాచ్ అనంతరం మాట్లాడుతూ... "నా బుర్రలో పెద్దగా ఏమీ ఆలోచించను. ఇప్పటికీ ప్రతి మ్యాచ్‌కు ముందు కార్టూన్లు చూస్తాను. అది నాకు అలవాటు. అయితే, ఆటపైనే పూర్తి ఫోకస్ ఉంటుంది" అని నవ్వుతూ చెప్పాడు. చిన్న వయసులోనే స్టార్‌డమ్ వచ్చినా, తనలోని చిన్నపిల్లల అలవాటును నిజాయతీగా చెప్పడంతో నెటిజన్లు అతనిపై ప్రశంసలు కురిపిస్తున్నారు.

"తర్వాతి మ్యాచ్‌లో కచ్చితంగా బాగా ఆడతాను. ఈ విజయంతో రెండు పాయింట్లు సాధించాం. ప్లేఆఫ్స్ దిశగా ముందుకు వెళ్తాం" అని వైభవ్ ధీమా వ్యక్తం చేశాడు.



# ఫిఫా వరల్డ్ కప్‌లో రాజకీయ ప్రకంపనలు.. ఇరాన్ స్థానంలో ఇటలీకి అవకాశం?

**హైదరాబాద్ పెన్ పవర్:**ఫుట్‌బాల్ ప్రపంచంలోనే అతిపెద్ద ఈవెంట్ అయిన ఫిఫా వరల్డ్ కప్‌కు రాజకీయ వివాదాల సెగ తగిలింది. జూన్ 11 నుంచి ప్రారంభం కానున్న ఈ మెగా టోర్నమెంట్‌లో అర్హత సాధించిన ఇరాన్ జట్టును తప్పించి, దాని స్థానంలో ఇటలీని చేర్చాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రత్యేక ప్రతినిధి ఒకరు ఫిఫాకు సూచించినట్లు సంచలన వార్తలు వెలువడుతున్నాయి. పోప్ లియో ౧౪ పై ట్రంప్ చేసిన తీవ్ర వ్యాఖ్యల నేపథ్యంలో చెలరేగిన రాజకీయ వివాదాన్ని చల్లార్చేందుకే ఈ ప్రతిపాదన తెరపైకి వచ్చినట్లు తెలుస్తోంది.అమెరికా వలస విధానం, ఇరాన్‌తో యుద్ధం వంటి అంశాలపై పోప్ లియో ౧౪ వ్యతిరేకత వ్యక్తం చేయడంతో ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' మీడియా వేదికగా ఆయనపై తీవ్ర విమర్శలు గుప్పించారు. "పోప్ నేరాలను అరికట్టడంలో బలహీనంగా ఉన్నారు. విదేశాంగ విధానంలో ఘోరంగా విఫలమయ్యారు" అని ట్రంప్ చేసిన పోస్ట్ ప్రపంచవ్యాప్తంగా దుమారం రేపింది. ముఖ్యంగా ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ ఈ వ్యాఖ్యలను "ఆమోదయోగ్యం కాదు" అని తీవ్రంగా ఖండించారు. ఈ పరిణామంతో ట్రంప్, మెలోనీ మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఫైనాన్షియల్ టైమ్స్ కథనం ప్రకారం దెబ్బతిన్న సంబంధాలను చక్కదిద్దే ప్రయత్నంలో భాగంగానే ఈ వరల్డ్ కప్ ప్రతిపాదన ముందుకు వచ్చింది. ట్రంప్ ప్రత్యేక ప్రతినిధి పాలో జంపొల్లి మాట్లాడుతూ.. "వరల్డ్ కప్‌లో ఇరాన్ స్థానంలో ఇటలీని చేర్చాలని నేను ట్రంప్, ఫిఫా అధ్యక్షుడు ఇన్ఫాంటినోలకు సూచించాను. నేను ఇటలీ సంతతికి చెందినవాడిని. అమెరికా ఆతిథ్యం ఇచ్చే టోర్నమెంట్‌లో అజూరీ (ఇటలీ జట్టు) ఆడటాన్ని చూడాలన్నది నా కల. నాలుగుసార్లు ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన ఇటలీకి ఆ అర్హత ఉంది" అని వివరించారు.



విచిత్రమేమిటంటే వరుసగా మూడుసార్లు ప్రపంచకప్‌కు అర్హత సాధించడంలో ఇటలీ విఫలమైంది. ప్లే-ఆఫ్‌లో బోస్నియా హెర్జెగోవినా చేతిలో ఓడిపోయి చరిత్రలో తొలిసారిగా ఇలాంటి ఘోర పరాభవాన్ని మూటగట్టుకుంది. మరోవైపు ఇరాన్ వరుసగా నాలుగోసారి ప్రపంచకప్‌కు అర్హత సాధించింది. అయితే, అమెరికా, ఇజ్రాయెల్‌తో యుద్ధం నేపథ్యంలో తమ గ్రూప్ మ్యాచ్‌లను అమెరికా నుంచి మెక్సికోకు మార్చాలని మొదట ఫిఫాను కోరింది. ఆ తర్వాత దేశంపై జరుగుతున్న వైమానిక దాడుల కారణంగా టోర్నమెంట్‌లో పాల్గొనలేమని ఇరాన్ క్రీడా మంత్రి అహ్మద్ దొన్యమాలి అధికారికంగా ప్రకటించారు.

దీనిపై ట్రంప్ స్పందిస్తూ.. "ఇరాన్ జట్టుకు ప్రపంచకప్‌లోకి స్వాగతం. కానీ, వారి ప్రాణ భద్రత దృష్ట్యా వారు ఇక్కడ ఉండటం సబబు కాదని నేను భావిస్తున్నాను" అని 'ట్రూత్ సోషల్'లో పోస్ట్ చేశారు. షెడ్యూల్ ప్రకారం ఇరాన్ తన తొలి మ్యాచ్‌ను న్యూజిలాండ్‌తో సోఫై స్టేడియంలో ఆడాల్సి ఉంది. కానీ తాజా పరిణామాలతో అర్హత కోల్పోయిన ఇటలీకి అనూహ్యంగా తలుపులు తెరుచుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**నేహా శర్మ చిక్ మరియు సొగసైన స్టైల్ స్టేట్‌మెంట్‌లో స్టన్స్**



# రౌడీ జనార్ధన కోసం భారీ యాక్షన్ సీక్వెన్స్!



రౌడీ స్టార్ విజయ్ దేవరకొండ నటిస్తున్న భారీ మాసీవ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ -రౌడీ జనార్ధన-. రవి కిరణ్ కోలా దర్శకత్వం వహిస్తున్నాడు. దిల్ రాజు అత్యంత భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ మూవీ షూటింగ్ శర వేగంగా జరుగుతోంది. కీర్తి సురేష్ తొలి సారి విజయ్‌కి జోడీగా నటిస్తుండటం, విజయ్ ఫస్ట్ టైమ్ పక్కా మాస్ క్యారెక్టర్ చేస్తుండటంతో ఈ మూవీపై అంచనాలు భారీగానే ఉన్నాయి. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే ఈ సినిమాలో విజయ్ దేవరకొండ పలికే తూర్పు గోదావరి యాస ప్రధాన హైలైట్‌గా నిలవనుంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టైటిల్ గ్లింప్స్ అంచనాల్ని పెంచేసింది. 80వ దశకంలో సాగే పొలిటికల్ యాక్షన్ డ్రామా ఇది. ఇందు కోసం డిఫరెంట్ మేకోవర్‌తో విజయ్ దేవరకొండ నటిస్తున్నాడు. టీజర్‌లో రౌడీ పాత్రలో విజయ్ సరికొత్తగా కనిపించిన తీరు అభిమానుల్ని, సినీ లవర్స్‌ని విశేషంగా ఆకట్టుకుంటూ సినిమాపై అంచనాల్ని పెంచేసింది. రాయలసీమ ప్రాంతంలో జరిగిన ఓ పొలిటికల్ ఎమోషనల్ పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా దర్శకుడు రవి కిరణ్ కోలా దీన్ని తెరకెక్కిస్తున్నాడు.విజయ్‌తో బ్లాక్ బస్టర్ హిట్‌ని అందించాలనే పట్టుదలతో దిల్ రాజు ఈ మూవీని ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. మే చివర్లో రామోజీ ఫిల్మ్ సిటీలో కొత్త షెడ్యూల్‌ని ప్రారంభించి సాంగ్‌తో పాటు భారీ యాక్షన్ సీక్వెన్స్‌ని పూర్తి చేయాలని టీమ్ ప్లాన్ చేస్తోంది. ఈ మూవీకి ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ అత్యంత కీలకంగా నిలుస్తుందని ఇన్ సైడ్ టాక్.ఈ ఎపిసోడ్‌లో విజయ్ దేవరకొండ ఫుల్ యాక్షన్ మోడ్‌లో కనిపించి కేక పెట్టిస్తాడని తెలుస్తోంది. రౌడీలకే రౌడీగా విజయ్ దేవరకొండ నటిస్తున్న సినిమా కావడం, ఇందులో మునుపెన్నడూ లేనంతగా మాస్ క్యారెక్టర్‌లో విజయ్ దేవరకొండ నటిస్తుండటంతో అభిమానులు, సినీ లవర్స్ ఈ సినిమా కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. శరవేగంగా షూటింగ్‌ని పూర్తి చేసి ఇదే ఏడాది డిసెంబర్‌లో సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.గత కొంత కాలంగా వరుస ఫ్లాపుల్లో ఉంటూ తనదైన మార్కుని కోల్పోయిన విజయ్ దేవరకొండ ఈ మూవీతో స్ట్రాంగ్ కమ్ బ్యాక్ ఇవ్వాలని బలంగా కోరుకుంటున్నాడు. అందుకే ప్రతి విషయంలోనూ చాలా జాగ్రత్తలు తీసుకుంటూ ఈ సినిమా చేస్తున్నాడట. ఈ విషయాన్ని ఆ మధ్య విడుదల చేసిన టైటిల్ గ్లింప్స్‌తో ఫుల్ క్లారిటీ ఇచ్చేయడంతో మళ్లీ రౌడీ రైజింగ్ అవ్వబోతున్నాడని ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నారు.

**కృతి శెట్టి గ్రేస్ మరియు గ్లామర్ యొక్క విజన్**



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965